SAMAYAM

epaper.samayamdaily.net
APTEL/2006/18267

# సమయం

మన గొంతుక.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 94 | ఎడిటర్ : విక్రం కుమార్ | ఆదివారం 25 జనవరి 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |

## 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

- 27న ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు



పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలను పురస్కరించుకుని ప్రభుత్వం ఈనెల 27న అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. పార్లమెంటు బ్డజెట్ సమావేశాలకు ముందు సంప్రదాయం ప్రకారం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఒక ప్రకటనలో తెలిపారు. 4

“సింగరేణి పై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. సింగరేణి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కొందరు రాతలు రాస్తున్నారని, ఈ నినాదాల వెనుక ఎవరి ప్రయోజనాలు దాగున్నాయి? అంటూ ప్రశ్నలు సంధించారు.”



# సింగరేణిపై దుష్ప్రచారం

సైట్ విజిట్ నిబంధన గతంలో ఉన్నదే

ఎవరి ప్రయోజనం కోసం.. ఎవరు చేస్తున్నారు

వీరికి ఉన్న సబంధం ఏమిటో ప్రజలకు తెలియాలి

## ఒకరు కథనం.. మరోకరు లేఖ... ఇంకొకరు విచారణ

- సింగరేణిపై కిషన్ రెడ్డి విచారణను స్వాగతిస్తున్నాం
- అన్ని వ్యవహారాలపై విచారణ జరగాలన్నదే తన అభిప్రాయం
- మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**హైదరాబాద్, జనవరి 24:** అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థపై నిందలు మోపుతూ, కార్మికుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నారని డిప్యూటీ సీఎం ఆగ్రహించారు. శనివారం నాడు ప్రజాభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సింగరేణిపై కట్టుకథలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వంపై కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. 'ఒకరు కథనం రాశారు, మరొకరు లేఖ రాశారు, ఇంకొకరు విచారణకు ఆదేశించారు, ఈ ముగ్గురికీ ఉన్న సంబంధం ఏంటి' అని డిప్యూటీ సీఎం ప్రశ్నించారు. సింగరేణి అటానమస్ సంస్థ అని, అన్ని నిర్ణయాలు వారే తీసుకుంటారని భట్టి తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రావడం, విచారణ జరిపించడాన్న స్వాగతిస్తున్నామని చెప్పారు. సింగరేణిలో తాను వచ్చాకే సైట్ విజిట్ నిబంధన వచ్చిందని ప్రచారం చేస్తున్నారని, నిజాలు బయటకు రావాలని, ప్రజలకు తెలియాలని చెప్పుకొచ్చారు. 2018లోనే సైట్ విజిట్ నిబంధనను కోల్ ఇండియా తీసుకొచ్చిందని, 2021లో ఎన్‌ఎమ్‌డీసీ కూడా అమలు చేసిందని డిప్యూటీ సీఎం వెల్లడించారు. 2023లో సింగరేణిలోనూ సైట్ విజిట్ కండీషన్ అమల్లోకి వచ్చిందని, సీఎమ్‌పీడీఐ

మిగతా 2 లో



## సింగరేణిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- కాంగ్రెస్, బీఆర్ఎస్ దోపిడీ దారులే
- ఉమ్మడి ఏపీని మించి గనుల దోపిడీ
- కేంద్రమంత్రి బండి సంజయ్ 3



## దేశవ్యాప్తంగా రోజ్‌గార్ మేళా

- 61,000 మందికి నియామక పత్రాలు అందించిన మోదీ 4



## సాయిబాబాపై అనుచిత వ్యాఖ్యలు

- టీ బీజేపీ చీఫ్‌కు శిరిడి సాయి భక్తుల ఐక్య వేదిక ఫిర్యాదు 2

## యూపీలో బాలికపై మతమార్పిడికి ఒత్తిడి

ఐదుగురు ముస్లిం బాలికలపై కేసు నమోదు 4





గణతంత్ర వేడుకల్లో

## తెలంగాణ ప్రత్యేకత 2

- పరేడ్‌లో ఒగ్గుడోలు ప్రదర్శనకు అనుమతి
- ఢిల్లీ వేదికగా ప్రాక్టీస్ చేస్తున్న కళాకారులు

## నాంపల్లిలో అగ్నిప్రమాదం

- తక్షణమే మంటలను ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది
- భారీగా పొగ, మంటలు చెలరేగడంతో ట్రాఫిక్ జామ్
- నుమాయిష్‌కు రావొద్దని సజ్జన్నార్ సూచన 2



నాంపల్లిలోని ఫర్నిచర్ షాపులో జరిగిన అగ్నిప్రమాదం కారణంగా నుమాయిష్ ను ఒకరోజు నాంపల్లి నుమాయిష్‌ను సందర్శకులు వాయిదా వేసుకోవాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ సూచించారు. అగ్నిప్రమాదం కారణంగా ఘటనా ప్రాంతంలో ట్రాఫిక్ స్తంభించిందని, ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని, సందర్శకులు తమ ఎగ్జిబిషన్ పర్యటనను ఆదివారానికి వాయిదా వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



## అందరి బాగోతాలను బయటపెడతాం

- ఫోరెన్సిక్ ఆడిట్‌తో సిద్దిపేట, సిరిసిల్లల్లో అక్రమాల గుర్తింపు
- త్వరలో 31 జిల్లాల్లో కూడా ఫోరెన్సిక్ ఆడిట్
- ధరణి పోర్టల్ లొసుగుల వల్లే రిజిస్ట్రేషన్‌లలో అక్రమాలు
- జిల్లాల్లోని 35 మండలాల్లో 48 మందిపై క్రిమినల్ కేసులు
- ధరణి పోర్టల్ అక్రమాలపై ఉన్నతస్థాయి కమిటీ నివేదిక
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

**హైదరాబాద్, జనవరి 24:** ధరణి పోర్టల్‌లోని లొసుగులను ఆసరాగా చేసుకొని ప్రభుత్వ భూములను కొల్లగొట్టినవారిని, రిజిస్ట్రేషన్‌ల చలానా సొమ్మును కాజేసినవారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని గత ప్రభుత్వంలోని పెద్దలు ప్రభుత్వ భూములను కాజేశారని, దీనిపై సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థతో పైలట్ కింద ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించడం జరిగిందని ఇందులో అనేక అవినీతి అక్రమాలు జరిగినట్లు ప్రాథమిక నివేదికలో స్పష్టమైందని ఆయన తెలిపారు.

మిగతా 2 లో

## ఫోన్ ట్యాపింగ్ దోషులను వదిలేది లేదు

మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టీకరణ 2



## గంజాయి గ్యాంగ్ హల్‌చల్ 2

- మహిళా కానిస్టేబుల్‌ను కారుతో ఢీకొట్టిన దుండగులు

## టెండర్లు రద్దు చేయడమంటే.. అవినీతి జరిగినట్లే

- అసలు విషయాలు భట్టి ఎందుకు దాస్తున్నారు
- సీఎం రేవంత్ బావమరిది విషయంలోనూ దాపరికాలు 3
- మండిపడ్డ బీఆర్ఎస్ నేత హరీష్ రావు






# ఫోన్ ట్యాపింగ్ దోషులను వదిలేది లేదు

**సూత్రధారులను, పాత్రధారులను బయటకు లాగుతాం : మంత్రి జూపల్లి**

**హైదరాబాద్,జనవరి24:** ఫోన్‌ట్యాపింగ్ కేసులో దోషులను కఠినంగా శిక్షపడేలా చూస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ఎక్సైజ్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ వ్యవహారంలో ఎవ్వరినీ వదిలి పెట్టమని స్పష్టంచేశారు. ఫోన్‌ట్యాపింగ్ అనేది చాలా దుర్మార్గమని.. దానిని రాజకీయ కక్ష్య అని అనడం సరికాదని ఆయన అన్నారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పద్ధతిలో దర్యాప్తు జరుగుతుందని స్పష్టం చేశారు. ఫోన్‌ట్యాపింగ్ లో పాత్రధారులెవరో, సూత్రధారులెవరో తెలియాల్సి ఉందన్న మంత్రి.. దీనిని దిగజారుడు తనమే అంటారని చెప్పుకొచ్చారు. ప్రజాధనంతో నడిచేది విజిలెన్స్ డిపార్ట్‌మెంట్ అని తెలిపారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఏం చేసినా చూస్తూ ఊరుకోవాలా? దర్యాప్తు జరిపించవద్దా.? అని ప్రశ్నించారు. ఫోన్‌ట్యాపింగ్ కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తామని మంత్రి జూపల్లి తెలిపారు. ఫోన్.. ట్యాపింగ్ అవుతుందని వి.ప్రకాశ్ అనే వ్యక్తి ఆరోజే చెప్పారని ప్రస్తావించారు. ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ కూడా ఫోన్‌ట్యాపింగ్ అయిందని గతంలో మాట్లాడారని గుర్తుచేశారు. ఐఏఎస్ అధికారులు ఆకునూరి మురళి సైతం ఈ అంశం గురించి మాట్లాడారని చెప్పుకొచ్చారు. మాజీ గవర్నర్ తమిళిసై ఫోన్ కూడా ట్యాపింగ్ జరిగిందని చెప్పారని ప్రస్తావించారు. మాజీ మంత్రి కేటీఆర్ సహా మరి కొందరి ఫోన్లు ట్యాపింగ్ అయ్యుండొచ్చని ఒప్పుకున్నారని జూపల్లి అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసుకున్నది ప్రజల సమస్యలు పరిష్కారం కోసమేనని స్పష్టం చేశారు. కెటీఆర్‌కు 160 సీఆర్పీసీ కింద మాత్రమే నోటీసులు ఇచ్చారని.. నేరస్థులుగా పరిగణించలేదని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. సాక్షిగా సమాచారం కోసమే పోలీసులు కేటీఆర్‌ను విచారణకు పిలిచారన్నారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌తో పాటు కీలక పాత్ర పోషించిన కోదండరామ్‌నూ గతంలో అక్రమంగా అరెస్ట్ చేశారని వెల్లడించారు. చట్టం ప్రకారం నోటీసులిచ్చి పోలీసులు విచారిస్తారని చెప్పారు. ఃూఏః చీఫ్ ప్రభాకర్ రావు.. అమెరికాకు ఎందుకు వెళ్లిపోయారని నిలదీశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రభాకర్ రావు అమెరికా నుంచి ఇండియాకు వచ్చారని వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల్లో మార్పులు రావడానికి చాలా కారణాలున్నాయని చెప్పారు. పార్టీలకు అతీతంగా అందరూ విచారణకు వచ్చారని మంత్రి జూపల్లి పేర్కొన్నారు.

# సాయిబాబాపై మాధవీలత అనుచిత వ్యాఖ్యలు

**బీజేపీ నేత మాధవీలతపై ఫిర్యాదు**



**హైదరాబాద్,జనవరి24:** సినీనటీ, ఏపీ బీజేపీ నేత మాధవిలతపై తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావుకు శిరిడి సాయి భక్తుల ఐక్య వేదిక ఫిర్యాదు చేసింది. ఈ వ్యవహారంపై రామ చందర్ రావు మాట్లాడుతూ.. షిరిడి సాయి బాబాపై అనుచిత వాఖ్యలు చేయడం సరైంది కాదని అన్నారు. మనోభావాలు దెబ్బ తీయడం సరికాదు.. బాబాపై వాఖ్యలకు బీజేపీకి సంబంధం లేదని తెలిపారు. సాయి బాబాపై చేసిన వాఖ్యలను వెనక్కి తీసుకోవాలని మాధవీ లతకు సూచించారు. ఎవరు ఇలాంటి వాఖ్యలు చేసిన వారికి బీజేపీమద్దతు ఉండదు.. ఏకీభవించదని స్పష్టం చేశారు. ఎవరైనా సరే భక్తుల మనోభావాలు దృష్టిలో పెట్టుకొని మాట్లాడాలని అన్నారు. సాయి బాబాపై దుష్ప్రచారం చేస్తున్న వారికి శిరిడి సాయి బాబా ఐక్య వేదిక హెచ్చరికలు జారీ చేసింది. మంచికంటి ధనుంజయ,శిరిడి సాయి భక్త ఐక్య వేదిక అధ్యక్షుడు మాట్లాడుతూ.. సాయి బాబాపై లేనిపోని మాటలు మాట్లాడితే సహించేది లేదన్నారు. సాయి బాబాపై దుష్ప్రచారం చేస్తున్నారు. ఆది సరికాదు.. సాయి బాబా ఆలయంలో జరిగేవి హిందూ పూజలే.. ఇంకేదో పూజలు కాదన్నారు. హిందువులను విడదీసే కుట్రలు చేయకండి.. బాబాను, బాబా భక్తులను హేళన చేయకండి అని కోరారు.




# గంజాయి గ్యాంగ్ హల్‌చల్

**ఎక్సైజ్ మహిళా కానిస్టేబుల్‌ను కారుతో ఢీకొట్టిన దుండగులు**

**నిజామాబాద్,జనవరి24 :** నిజామాబాద్ నగర శివారులో గంజాయి గ్యాంగ్ హల్‌చల్ చేసింది. శుక్రవారం అర్ధరాత్రి తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ సిబ్బందిని కారుతో ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఎక్సైజ్ మహిళా కానిస్టేబుల్ గాజుల సౌమ్య తీవ్రంగా గాయపడ్డారు. నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆమె చికిత్స పొందుతున్నారు. ఆమె కిడ్నీలు దెబ్బ తిన్నట్లు వైద్యులు తెలిపారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటన అనంతరం పోలీసులు వాహనాన్ని వెంబడించి ఇద్దరు గంజాయి స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. 2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను నిర్మల్ జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. కానిస్టేబుల్ సౌమ్యను ఆస్పత్రిలో కలెక్టర్ ఇలా త్రిపాఠి పరామర్శించారు. మరోవైపు నిజామాబాద్ ఆబ్కారీశాఖ ఎస్‌హెచ్‌వో కార్యాలయం ముందు కానిస్టేబుళ్లు ధర్నా చేపట్టారు. సౌమ్యకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# సింగరేణిపై దుష్ప్రచారం

మొదటి పేజీ తరువాయి

డాక్యుమెంట్‌లో సైట్ విజిట్ తప్పనిసరని ఉందని చెప్పారు. 2018, 2021లో డిప్యూటీ సీఎం భట్టి లేదని, కాంగ్రెస్ లేదని ఆయన గుర్తు చేశారు. దేశంలోని పలు కేంద్ర, రాష్ట్ర సంస్థలు సైట్ విజిట్ అమలు చేస్తున్నాయన్నారు. రైల్వే, హిందుస్థాన్ కాపర్స్, గుజరాత్ ఇండస్ట్రీస్ పవర్ కంపెనీ, మహారాష్ట్ర ప్రభుత్వ టెండర్లలోనూ ఈ నిబంధన ఉందని భట్టి పేర్కొన్నారు. సైట్ విజిట్ ఎక్కడా లేదన్నట్టు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దురుద్దేశంతో రాసిన ఓ కథనం ఆధారంగా ఒక నేత లేఖ రాశారని, అపోహలు పెరుగుతాయని వెంటనే టెండర్లు రద్దు చేశామని భట్టి తెలిపారు. నైనీ కోల్ బ్లాక్‌లకు బీఆర్ఎస్ హయాంలోనే టెండర్లు పిలిచారని, దేశంలో ఏ మైనింగ్ యాక్టివిటీలోనూ డీజిల్ సప్లయ్ చేసే పరిస్థితి లేదని చెప్పారు. 2022లో నైనీ బ్లాక్ టెండర్లలో డీజిల్ విధానం మార్చారని వెల్లడించారు. సింగరేణి 25 టెండర్లలో 20 బీఆర్ఎస్ హయాంలోనే జరిగాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 5 టెండర్లే జరిగాయని ఉపముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇప్పటివరకు కాంగ్రెస్‌కు సంబంధించిన ఎవరికీ టెండర్లు రాలేదని అన్నారు. సృజన్‌రెడ్డితో సీఎంకు సంబంధాలున్నాయన్న వార్తల్లో నిజం లేదన్నారు. సృజన్‌రెడ్డి కంపెనీ శోధ కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ అని, ఎండీ దీప్తి రెడ్డి కందాల కూతురు అని, సృజన్‌రెడ్డి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే అల్లుడని భట్టి వివరించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు అసలు ఏం కావాలని, కేంద్రానికి ఎందుకు లేఖలు రాస్తున్నారని ఉపముఖ్యమంత్రి ప్రశ్నించారు. 2014 నుంచి ఇప్పటివరకు జరిగిన అన్ని టెండర్లపై విచారణ జరపాలని తనకు లేఖ రాయాలన్నారు. తాడిచర్ల నుంచి నైనీ వరకు అన్నింటిపై దర్యాప్తు చేద్దామని అన్నారు. సీఎం రేవంత్ రాగానే చర్చించి విచారణకు ఆదేశిస్తామని చెప్పారు. తాను ఆస్తులు కూడబెట్టుకోవడానికి రాజకీయాల్లో రాలేదని, బొగ్గు బావుల్లో ఏ రాబందులను వాలనివ్వనని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. తెలంగాణకు ఆత్మగా ఉన్న సింగరేణిపై కొన్ని కట్టుకథలు వస్తున్నాయని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. సింగరేణి ఉద్యోగుల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. సింగరేణిలో మొత్తం 25 కాంట్రాక్టులు జరిగితే.. 20 టెండర్లు బీఆర్ఎస్ హయాంలోనే జరిగాయని మంత్రి వివరించారు. తెలంగాణ కు ఆత్మ సింగరేణి అని అన్నారు. అలాంటి సింగరేణిపై కట్టుకథలు.. కొన్ని లేఖలు.. కొన్ని రివ్యూలు వచ్చాయని మండిపడ్డారు. 42 వేల మంది సింగరేణి ఉద్యోగుల.. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు 20 వేల మందినీ మానసికంగా దెబ్బతీసేలా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానంగా పెట్టుబడులు రాకుండా.. కట్టుకథల విషపు రాతలు.. తొలిపలుకు రాతలు.. తప్పుడు ప్రచారం.. రాష్ట్ర ప్రభుత్వం పై కావాలని కథనాలు రాస్తున్నారు. రోజుకో కథ వండి వారిస్తున్నారని భట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా సింగరేణికి సంబంధించిన ఆస్తుల్ని కాపాడాల్సినటువంటి వ్యక్తిగా వీటన్నింటిని చూస్తూ ఉంటే ఏ రాబందులు ఏ గద్దలు ఏ దోపిడి దారుల ప్రయోజనాల కోసమో ఈ కథనాలన్నీ వస్తున్నట్లుగా కనిపిస్తుందన్నారు. ఇటువంటి రాతలతో తెలంగాణకు సంబంధించినటువంటి అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ




పైన నిందలు మోపే క్రమంలో ఈ రాష్ట్రానికి సింగరేణికి నష్టం చేస్తున్నారన్న సంగతి మర్చిపోవద్దని గుర్తు చేశారు. సింగరేణి నిర్ణయం మంత్రుల దగ్గరికి రాదు.. అటానమస్ సంస్థ ఇది. మంత్రి మండలి దగ్గరకు కూడా రాదు.. ఇంగితం ఉన్న.. విజ్ఞానం ఉన్న వారు ఇలా రాయరు అని తెలిపారు. పారదర్శకంగా ఉండాలి అనుకోవడమే కాదు.. పారదర్శకంగా ఉండాలి అని వెంటనే టెండర్ రద్దు చేయాలి అని చెప్పానని అన్నారు. హరీష్ లేఖ రాయడం.. కిషన్ రెడ్డి విచారణ చేపట్టడం.. మంచిది అయ్యిందన్నారు. కిషన్ రెడ్డి చర్యలను స్వాగతిస్తున్నానని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యం.. అడ్డగోలుగా ప్రచారం చేసే వాళ్ల బతుకు బయట పడాలని అనుకున్నానని అన్నారు.గత డాక్యుమెంట్ల ఆధారంగానే సింగరేణి టెండర్లు పిలిచింది.. నిజం ఇలా ఉంటే.. భట్టి విక్రమార్క చేసినట్టుగా కథనాన్ని వండి వార్చారని మండిపడ్డారు.

# అందరి బాగోతాలను బయటపెడతాం

మొదటి పేజీ తరువాయి

ఈ ఫోరెన్సిక్ నివేదికను పరిశీలించిన తర్వాత మిగిలిన 31 జిల్లాల్లో కూడా ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తామని ప్రకటించారు. శనివారం సచివాలయంలోని తన కార్యాలయంలో ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడిన సంఘటనలపై ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీతో మంత్రి పొంగులేటి సమావేశం నిర్వహించారు. విచారణలో ఎదురైన అంశాలు,ఎవరి పాత్ర ఎంత? తెరవెనుక ఎవరైనా ఉన్నారా? రెవెన్యూ అధికారుల పాత్ర ఏమైనా ఉందా? వంటి అంశాలపై కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కమిటీ ప్రాథమిక నివేదికను పరిశీలించి మరికొన్ని సలహాలు సూచనలు చేస్తూ మరింత లోతైన విచారణ జరిపి తుది నివేదికను సమర్పించాలని సూచించారు. ధరణి పోర్టల్ ప్రారంభమైనప్పటినుంచి 35వేల లావాదేవీలు జరిగాయని, ప్రాథమికంగా 4,848 లావాదేవీల్లో లోటుపాట్లు జరిగినట్లు గుర్తించడం జరిగిందని అయితే విచారణ తర్వాత 1109 డాక్యుమెంట్లకు సంబంధించి సుమారు నాలుగు కోట్ల రూపాయిలు ప్రభుత్వానికి చెల్లింపు జరగలేదని కమిటీ సభ్యులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆనాటి ప్రభుత్వం అనాలోచితంగా ఎలాంటి ముందుచూపు లేకుండా ఒక కుట్రపూరితంగా తీసుకువచ్చిన ధరణి పోర్టల్ లోని లొసుగులను ఆసరాగా చేసుకొని కొంతమంది అక్రమాలకు పాల్పడితే భూభారతి పోర్టల్ ద్వారా ఆడిట్ నిర్వహించి



అక్రమాలను గుర్తించి తక్షణమే ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేపట్టామని తెలిపారు. ఇందుకు సంబంధించి తొమ్మిది జిల్లాల్లోని 35 మండలాల్లో అక్రమాలకు పాల్పడిన 48 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే ప్రతిపక్షంలో ఉన్న ఓ నాయకుడు వెయ్యి కోట్ల అవినీతి అని, మరో నాయకుడు పదివేల కోట్లు అని ఇంకొక్కరు భూభారతి పోర్టల్ అవినీతిమయమని నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇదిలావుంటే ఇప్పటికే మొదటి విడతలో నాలుగు వేల మంది శిక్షణ పొందిన సర్వేయర్లకు లైసెన్స్‌లు జారీ చేయగా ఆదివారం నాడు ఖమ్మం జిల్లా కలెక్టరేట్ లో మరో రెండు వేల మందికి లైసెన్స్‌లు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ లైసెన్స్‌డ్ సర్వేయర్లతో రాష్ట్రంలో నక్షా లేని 373 గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, ఇంటిలిజెన్స్ అదనపు డిజి విజయ్‌కుమార్ ,ఉన్నతస్థాయి కమిటీ సభ్యులు డిఐజీ ఎమ్. సుభాషిని, సిఎమ్ఆర్‌వో మకరంద్, ఎసీబీ ఎస్పీ సింధు శర్మ, సైబర్ క్రైమ్ డిఎస్పీ ఎ. సంపత్, ఎన్ఐసి ప్రతినిధి శ్రీనివాస్ , హోంశాఖ సలహాదారు పి. శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గణతంత్ర వేడుకల్లో తెలంగాణ ప్రత్యేకత

**పరేడ్‌లో ఒగ్గుడోలు ప్రదర్శనకు అనుమతి**

**ఢిల్లీ వేదికగా ప్రాక్టీస్ చేస్తున్న కళాకారులు**

**న్యూఢిల్లీ, జనవరి 24:** దేశ రాజధాని ఢిల్లీలో ఈ ఏడాది జరిగే 77వ గణతంత్ర వేడుకుల్లో ఈసారి తెలంగాణ బిడ్డలు ప్రత్యేకంగా నిలవబోతున్నారు. రాష్ట్రపతి, ప్రధాని, ఇతర దేశాధిపతుల ముందు తెలంగాణకే సొంతమైన కళారూపాన్ని ప్రదర్శించనున్నారు. ఇప్పటి వరకు ఎన్నో కళారూపాలు రిపబ్లికే డేలో పాల్గొన్నా, తొలిసారి ఒగ్గుడోలు విన్యాసానికి చోటు దక్కింది. ఈ ప్రదర్శన కోసం సౌత్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్ నుంచి ప్రఖ్యాత ఒగ్గు డోలు కళాకారుడు డాక్టర్ ఒగ్గు రవి బృందానికి ఆహ్వానం అందింది. దీంతో ఒగ్గు రవి నేతృత్వంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 30 మంది కళాకారులు ఈనెల 8నే ఢిల్లీకి చేరుకున్నారు. ఎముకలు కొరికే చలిలో దాదాపు 15 రోజులుగా కర్తవ్యపథ్ పై ప్రాక్టీస్ చేస్తున్నారు. సుమారు వంద మంది కళాకారులు దేశంలోని వివిధ కళారూపాలతో కలిపి, ఏక్ భారత్ అనే కాన్సెప్ట్ తో కళారూపాన్ని ప్రదర్శించనున్నారు. త్రివిధ దళాలు, పారా మిలటరీ బలగాలు, ఢిల్లీ పోలీస్ కంటింజెట్లకు ఏమాత్రం తీసిపోకుండా, కేవలం తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్‌సిసి విద్యార్థులు ఈసారి కవాతు చేయబోతున్నారు. ఎపి, తెలంగాణ నుంచి మొత్తం 133 మంది పాల్గొంటున్నారు. ఈ టీంను కవాడీ గూడకు చెందిన బీటెక్ మూడో ఏడాది విద్యార్థి భరత్ లీడ్ చేయ-ంబోతున్నాడు. డిసెంబర్ 27 న ఢిల్లీ వచ్చిన ఈ టీం దాదాపు నెల రోజులుగా కర్తవ్య పథ్ పై కవాతు చేస్తోంది. భారత గణతంత్ర దినోత్సవాల్లో తొలిసారిగా భారతీయ సినిమా అపూర్వమైన రీతిలో జాతీయ దృష్టిని ఆకర్షించనుంది. ప్రముఖ చలనచిత్ర దర్శకుడు సంజరు లీలా భన్సాలీ కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కోసం సినీ శకటాన్ని రూపొందించారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జాతీయ ఉత్సవాల్లో ప్రముఖ సినీ దర్శకుడు ఈ ప్రత్యేక సినీ శకటానికి ప్రాతినిధ్యం వహించడం విశేషం. 'భారత్ గాథ' అనే భావనతో తీసుకువస్తున్న ఈ శకటానికి కొత్తగా స్వరపరిచిన, ప్రముఖ గాయని శ్రేయా ఘోషల్ ఆలపించిన పాట తోడవుతుంది. జీవన సాంస్కృతిక కథనంగా సినిమా పట్ల భన్సాలీ దార్శనికతకు ఇదొక తార్కాణంగా నిలుస్తుంది.

# నాంపల్లి ఫర్నీచర్ షాపులో అగ్నిప్రమాదం

**తక్షణమే మంటలను ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది**

**పొగ, మంటలు చెలరేగడంతో ట్రాఫిక్ జామ్**

**హైదరాబాద్, జనవరి 24:** హైదరాబాద్ నగరంలోని రద్దీ ప్రాంతమైన నాంపల్లిలో శనివారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఒక ఫర్నిచర్ షోరూమ్‌లో ఒక్కసారిగా చెలరేగిన మంటలు నిమిషాల వ్యవధిలోనే భవనం మొత్తానికి వ్యాపించాయి. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. నాంపల్లి ప్రధాన రహదారిపై ఉన్న ఒక నాలుగు అంతస్తుల కమర్షియల్ భవనంలో ఈ ప్రమాదం సంభవించింది. భవనం కింద ఉన్న సెల్లార్‌లోని హోల్‌సేల్ ఫర్నిచర్ షాపులో మొదట మంటలు ప్రారంభమయ్యాయి. లోపల ఫర్నిచర్ సామాగ్రి అధికంగా ఉండటంతో మంటలు వేగంగా పై అంతస్తుల వరకు వ్యాపించాయి. దట్టమైన పొగలు పరిసర ప్రాంతాలను కమ్మేయడంతో జనం పరుగులు తీశారు. ప్రమాద సమయంలో భవనంలో ఇద్దరు నుండి నలుగురు పిల్లలు చిక్కుకున్నట్లు వార్తలు రావడంతో ఒక్కసారిగా ఆందోళన నెలకొంది. అయితే, అగ్నిమాపక సిబ్బంది రాకముందే స్థానిక యువకులు సాహసించి భవనంలోకి వెళ్లి పిల్లలను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. భవనంలోని మిగిలిన కుటుంబాలను , పక్కనే ఉన్న రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లోని నివాసితులను అధికారులు వెంటనే ఖాళీ చేయించారు. మంటలను అదుపు చేసేందుకు నాలుగు ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అయితే, భవనం ఇరుకైన సందులో ఉండటం , చుట్టూ సెట్‌బ్యాక్స్ లేకపోవడంతో అగ్నిమాపక యంత్రాలు లోపలికి వెళ్లడానికి వీలు పడలేదు. దీంతో సిబ్బంది పక్కనే ఉన్న భవనాల గోడలపైకి ఎక్కి ప్రాణాలకు తెగించి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. ప్రధాన రహదారిపైనే ఈ ప్రమాదం జరగడంతో నాంపల్లి నుంచి అబిడ్స్ వెళ్లే మార్గంలో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. పరిస్థితిని గమనించిన ట్రాఫిక్ పోలీసులు వెంటనే వాహనాల రాకపోకలను ఇతర మార్గాల్లోకి మళ్లించారు. గంటల తరబడి శ్రమించిన అనంతరం అగ్నిమాపక సిబ్బంది మంటలను ప్రాథమికంగా అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనలో ఆస్తి నష్టం భారీగానే ఉన్నప్పటికీ, ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. నగరంలోని ఇరుకైన ప్రాంతాల్లో అగ్నిమాపక నిబంధనలు పాటించకపోవడం వల్ల ఇలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

**నుమాయిష్‌కు రాకండి : సజ్జన్నార్ సూచన**

నాంపల్లిలోని ఫర్నిచర్ షాపులో జరిగిన అగ్నిప్రమాదం కారణంగా నుమాయిష్ ను ఒకరోజు నాంపల్లి నుమాయిష్‌ను సందర్శకులు వాయిదా వేసుకోవాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ సూచించారు. అగ్నిప్రమాదం కారణంగా ఘటనా ప్రాంతంలో ట్రాఫిక్ స్తంభించిందని, ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని, సందర్శకులు తమ



ఎగ్జిబిషన్ పర్యటనను ఆదివారానికి వాయిదా వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నాంపల్లిలో బచ్చా క్రిస్టల్ ఫర్నిచర్ దుకాణంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. నాలుగు అంతస్తుల భవనంలో ఇద్దరు చిన్నారులతో సహా ఆరుగురు చిక్కుకున్నట్లు సమాచారం . ఫైరిరజన్లు రంగంలోకి దిగి రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. అగ్ని ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. గ్రౌండ్ ఫలోర్ నుంచి దట్టమైన పొగలు రావడంతో వారు బయటకు రాలేక పై అంతస్తుల్లోనే ఉండిపోయారు. జేసీబీలు, భారీ క్రేన్ల సహాయంతో భవనం పైభాగంలో ఉన్న వారిని క్షేమంగా బయటకు తీసుకువచ్చేందుకు రెస్క్యూ టీమ్ తీవ్రంగా శ్రమించింది.

# సింగరేణిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- కాంగ్రెస్, బీఆర్ఎస్ దోపిడీ దారులే
- ఉమ్మడి ఏపీని మించి గనుల దోపిడీ
- కేంద్రమంత్రి బండి సంజయ్



**హైదరాబాద్,జనవరి 24:** కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసి సింగరేణిని దోచుకుంటున్నాయని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. ఈ రెండు పార్టీలు ఇప్పుడు నీతులు వల్లిస్తున్నాయని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ కుటుంబమే సింగరేణిని దోచుకుందని ఆరోపించారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన.. మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. 2014 నుంచి ఇప్పటివరకు సింగరేణిలో గనుల కేటాయింపు, జరిగిన దోపిడీపై శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణలో జరిగిన దోపిడీపై మాట్లాడుతుంటే.. గుజరాత్‌ను ఎందుకు లాగుతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో మంత్రులు, దళారులు దోచుకుంటున్నారని ఆరోపించారు. అందుకే ఒకరి అవినీతిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అవినీతిపై బీఆర్ఎస్ లేఖ రాస్తే.. బీఆర్ఎస్ అవినీతిపై కూడా విచారణ జరుపుదామా? అని మంత్రి మల్లు భట్టి విక్రమార్క చెబుతున్నారని ప్రస్తావించారు. సింగరేణిలో రెండు పార్టీలు దోచుకున్న దోపిడీపై విచారణ జరపాలని బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికులు పోరాటాలు చేసి తెలంగాణ సాధించుకుంటే.. ఉమ్మడి రాష్ట్రంలో కంటే ఎక్కువ గనుల దోపిడీ ఇప్పుడు కొనసాగుతోందని ఆరోపించారు. సింగరేణిపై ఆరోపణలు, ప్రత్యారోపణలతో టైంపాస్ చేయొద్దని బండి అన్నారు. సింగరేణి అవకతవకలకు సంబంధించిన రికార్డులన్నీ వెంటనే సీజ్ చేయాలని కోరారు. లేనిపక్షంలో అవి తారుమారు చేసే ప్రమాదముందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సింగరేణికి చెల్లించాల్సిన రూ.42 వేల కోట్లు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. 'కేసీఆర్ పాలనలో సింగరేణిని దోచుకుంది ఆయన కుటుంబమేనని బండి సంజయ్ విమర్శించారు. ఆ సొమ్ముతోనే బీఆర్ఎస్‌ను ఇన్నాళ్లూ నడిపించారని ఆరోపించారు. 'రూ.42 వేల కోట్ల సింగరేణి సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం దోచుకుంది. సింగరేణిని అప్పుల పాల్జేసింది. ఎన్నికలకు ముందు సింగరేణిని లాభాల్లోకి తెస్తామంటారు. అధికారంలోకి వచ్చాక ఆ సొమ్మునంతా దారి మళ్లించడం పరిపాటైంది. సింగరేణి ప్రజలు, కార్మికులు రెండు పార్టీల తీరును చూసి అసహ్యించుకుంటున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ తోడు దొంగలే. మా బాగోతం మీరు బయటపెడితే.. మీ బాగోతం మేం బయటపెడతామంటూ మాట్లాడుకుంటున్నారు. మరో వారం రోజుల తర్వాత సింగరేణి బాగోతాన్ని దారి మళ్లించేందుకు మరో అంశాన్ని తెరపైకి తెస్తారు. ఎన్ని అరాచకాలు, అవినీతి చేసినా కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయలేదనే ధీమా కేసీఆర్ కుటుంబంలో ఉందని విమర్శించారు. కేటీఆర్ పెద్ద నిజాయతీపరుడిలా మాట్లాడుతున్నారు. ఎన్ని కుటుంబాలను, ఎంత మంది జీవితాలను నాశనం చేశారో తెలియదా? నిజామ్ అరాచకాలను మరువలేదు.. నీ అరాచకాలను కూడా మర్చిపోలేం. కేటీఆర్‌లో ఇంకా అహంకారం తగ్గలేదు. ఫోన్ ట్యాపింగ్ చేయలేదని చెబుతున్న కేసీఆర్, కేటీఆర్.. నా ఛాలెంజ్‌కు సిద్ధమా? దేవుడి ఆలయం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ప్రమాణం చేసే దమ్ముందా? మావోయిస్టుల జాబితాలో హీరోయిన్లు, వ్యాపారులతో పాటు బీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేల ఫోన్ నంబర్లను చేర్చింది నిజం కాదా? ఆఖరికి కేసీఆర్ బిడ్డ, అల్లుడి ఫోన్లను కూడా ఆ జాబితాలో చేర్చి ఫోన్ ట్యాపింగ్ చేయించలేదా? ఇంకా సిగ్గులేకుండా దేశ భద్రత కోసం ఫోన్ ట్యాపింగ్ చేశామని చెబుతారా? నేను సవాల్ విసిరితే లీగల్ నోటీసులంటూ డ్రామాలాడతారు. పోనీ ఆ లీగల్ నోటీసులకైనా కట్టుబడి ముందుకు సాగుతారా? అంటే.. మధ్యలోనే పారిపోతారు' అని కేంద్ర మంత్రి ఎద్దేవా చేశారు.

# టెండర్లు రద్దు చేయడమంటే..అవినీతి జరిగినట్లే

- అసలు విషయాలు ఎందుకు దాస్తున్నారు
- సీఎం రేవంత్ బావమరిది విషయంలోనూ దాపరికాలు
- మండిపడ్డ బీఆర్ఎస్ నేత హరీష్ రావు



**హైదరాబాద్, జనవరి 24:** బొగ్గు కుంభకోణం విషయంలో అవినీతి ఆరోపణలు రావడంతో నైనీ టెండర్ రద్దు చేశారంటే, స్కాం జరిగినట్లేనని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు.నైనీ వ్యవహారంలో మంత్రి భట్టి మసిబూసి మారేడు కాయ చేస్తున్నారని ఆరోపించారు. సింగరేణిలో సోలార్ స్కాం చేసిన ఆరోపణలపై మౌనం ఎందుకు వహిస్తున్నారని ఆరోపించారు. శనివారం హరీష్‌రావు ఎక్స్ వేదికగా స్పందించారు. రేవంత్ రెడ్డి బావమరిది కోసమే ఈ తతంగమంతానని విమర్శించారు. బొగ్గు కుంభకోణంలో అవినీతి జరగలేదని సూటిగా చెప్పలేక, విషయాలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. నైనీ టెండర్ రద్దు చేయడమే అవినీతికి నిదర్శనమని, అదే తరహాలో పిలిచిన మిగిలిన టెండర్లను ఎందుకు రద్దు చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బొగ్గు కుంభకోణంలో అవినీతి జరగలేదని చెప్పకుండా బీటింగ్ అరౌండ్ ద బుష్ లా ఏదో చెప్పి, మసిబూసి మారేడు కాయ చేసారు. మీరెన్ని సాకులు చెప్పినా మీ కాంగ్రెస్ పాలనలో బొగ్గు కుంభకోణం జరిగింది నిజం. అందులో రేవంత్ రెడ్డి బామ్మర్ది రింగ్ మెన్ గా పాత్ర పోషించింది నిజం. నేను సూటిగా అడుగుతున్నా. ఏ స్కాం జరగకుంటే నైనీ టెండర్లను రద్దు చేస్తున్నట్లు ఎందుకు ప్రకటించారు? నిన్న బయటపెట్టిన మరో కుంభకోణం.. సోలార్ పవర్ స్కాం గురించి ఎందుకు ఒక్క మాట కూడా ప్రెస్ మీట్ లో మాట్లాడలేదని నిలదీశారు. నైనీని రద్దు చేసినట్లే మిగతా అన్ని టెండర్లను ఎందుకు రద్దు చేయడం లేదు? సైట్ విజిట్ సర్టిఫికేట్ నిబంధనను బిఆర్ఎస్ మీద నెట్టే ప్రయత్నం చేయడం వల్ల నిజాలు అబద్దాలు అయిపోవు. జరిగిన స్కాంలు, స్కీంలుగా మారిపోవని స్పష్టం చేశారు. సైట్ విజిట్ నిబంధనను 2018లోనే మొదలైందని చెప్పి, దానికి కేంద్ర ప్రభుత్వ సంస్థలను ఉదాహరణలుగా చెప్పి ఏం చెప్పదలుచుకున్నారు? అది తప్పు కాకుంటే నైనీ ఎందుకు రద్దు చేసినట్లు? ఇదే సైట్ విజిట్ విధానం సింగరేణిలో కూడా అమలు చేసామని ఇప్పటికైనా ఒప్పుకున్నందుకు ధన్యవాదాలని అన్నారు. భట్టి గారూ. మీరంటే నాకు చాలా గౌరవం. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తిపై విచారణ జరగాలంటే సిట్టింగ్ జడ్జి లేదా కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన సీబీఐ మాత్రమే చేయగలవు అన్న ఉద్దేశ్యంతోనే లేఖ రాసాను. మీరు నిజంగా రేవంత్ రెడ్డి, అతని బావమరిది కుంభకోణం మీద నిష్పక్షపాతంగా విచారణ జరిపిస్తాను అని హామీ ఇస్తే మీకూ లేఖ రాయడానికి సిద్ధమని హరీష్‌రావు స్పష్టం చేశారు.

# వేధింపులను తప్పపడితే నోటీసులా?

- ప్రజా సమస్యలు, దౌర్జన్యాలపై గొంతెత్తుతూనే ఉంటా
- సిట్ పోలీసుల నోటీసులపై మాజీ ఐపిఎస్ ప్రవీణ్ కుమార్



**హైదరాబాద్,జనవరి 24:** ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కేటీఆర్, హరీష్‌రావులను గంటల తరబడి దర్యాప్తు పేరిట వేధించడాన్ని తప్పుబడితే తనకు సిట్ నోటీసులు అందించడంపై బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తీవ్రంగా స్పందించారు. తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో ఖండించిన 12 గంటల లోపే రాత్రి 12 గంటలకు ఇంటికి వచ్చి సిట్ పోలీసులు నోటీసులు ఇచ్చి రెండు రోజుల్లో ఆధారాలతో సహా రిప్లై ఇవ్వకపోతే సివిల్, క్రిమినల్ చర్యలకు సిద్ధం కావాలని వార్నింగ్ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. ప్రజా సమస్యలు, దౌర్జన్యాలపై గొంతెత్తడం నా హక్కు అని వెల్లడించారు. పోలీసుల వార్నింగ్‌లకు భయపడేది లేదని స్పష్టం చేశారు. తాను ఎప్పుడూ కూడా వ్యక్తిగత దూషణలు , చిల్లర భాషను వాడనని, అదేవిధంగా వాస్తవాలు దాచనని తెలిపారు. దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటం కూడా ఆపనని వెల్లడించారు.రేవంత్ రెడ్డి ట్యాపింగ్ జరగడం మామూలే అని ఢిల్లీలో చెప్పినట్లుగా కూడా వార్తలున్నాయి. అలాంటప్పుడు సిట్ దర్యాప్తు ఎందుకు? అని ప్రశ్నించారు. సిట్ ఛీఫ్ సజ్జనార్‌పై ఆంధ్ర ప్రదేశ్ లో నమోదైన కేసుల మీద మరో సిట్ వేయాలి అని డిమాండ్ చేసినట్లుగా నోటీసులో ఉందని , ఇది వాస్తవ విరుద్ధమని అన్నారు. ఓటుకు నోటు కేసులో లైవ్ కెమెరాలో నాటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి అడ్డంగా దొరికిన తరువాత, ఆంధ్ర ప్రదేశ్ నాయకుల ఫోన్లు తెలంగాణ ప్రభుత్వం, ఇంటలిజెన్స్ అధికారులు ట్యాప్ చేశారని 2015 జూన్ నెలలో ఆంధ్రలో అనేక పోలీసు స్టేషన్లలో తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం పై కేసులు నమోదయ్యాయని పత్రికల్లో చాలా వార్తలొచ్చాయి. ఆ సమయంలో ఆంధ్రలో కూడా ఒక సిట్ కూడా ఏర్పాటు అయ్యింది. నాడు తెలంగాణ ఇంటెలిజెన్స్ విభాగం లో అధికారిగా సీపీ సజ్జనార్ పనిచేశారు అన్న అవగాహన తనకుందని అన్నారు. ప్రస్తుత ట్యాపింగ్ వ్యవహారం పై వేసిన రెండో తెలంగాణ సిట్‌కు ఛీఫ్ గా ఉండడం నైతికంగా కరెక్టు కాదని అన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకుడిగా మరుగున పడిన విషయాలను ప్రజల ముందుకు తీసుకరావాల్సిన కనీస బాధ్యత తనపై ఉందన్నారు. ఈ విషయం మీకు నచ్చకపోతే వివరణ ఇవ్వాలని సూచించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న పలు కుంభకోణాల మీద సిట్ వేయాలని డిమాండ్ చేశానని వివరించారు. తాను సజ్జనార్‌తో సహా ఏ అధికారి, ఏ రాజకీయ నాయకుడి వ్యక్తిత్వ హననానికి పాల్పడలేదని వెల్లడించారు. గత రెండేళ్లుగా కేటీఆర్, హరీష్ రావు, మరెందరో బీఆర్ఎస్ నాయకులపై రేవంత్ రెడ్డి ప్రతీకార పాలనలో తీవ్రమైన వ్యక్తిత్వ హననానికి గురయ్యారని పేర్కొన్నారు. ఆ విషయంలో నిందితులపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పోలీసులు చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం చేస్తున్న ట్యాపింగ్ పై చేసిన ఫిర్యాదు చేస్తే పోలీసులు ఇంతవరకు రేవంత్ రెడ్డికి నోటీసులు ఎందుకు ఇవ్వలేదని అన్నారు. కనీసం తనకు అక్నాలె÷–జ్మెంటు కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. కేవలం బీఆర్ఎస్ నాయకులకు మాత్రమే నోటీసుల మీద నోటీసులు రావడం, మీడియా లీకులు, జర్నలిస్టుల, సోషల్ మీడియా ఆక్టివిస్టుల విచ్చలవిడి అరెస్టులు దేనికి సంకేతమని నిలదీశారు. నాలుగు గోడల మధ్య జరగాల్సిన దర్యాప్తుపై గాంధీభవన్ లో కాంగ్రెస్ నాయకులు ప్రతిరోజూ లైవ్ కామెంటరీ ఇవ్వడం దేనికి సంకేతమని ప్రశ్నించారు.

# బండి, ధర్మపురికి కేటీఆర్ లీగల్ నోటీసులు

## పరువు తీసినందుకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్



**హైదరాబాద్, జనవరి 24:** కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ లీగల్ నోటీసులు పంపించారు. తనపై, తన కుటుంబంపై నిరాధారమైన, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేసినందుకు సంజయ్, అర్వింద్‌లకు విడివిడిగా లీగల్ నోటీసులు జారీ చేశారు. తన రాజకీయ ప్రతిష్ఠను దెబ్బతీసేలా, ప్రజల్లో తనపై ఉన్న నమ్మకాన్ని సడలించేలా వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నట్టు కేటీఆర్ తెలిపారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి అడ్డగోలుగా మాట్లాడిన వీరు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా కేవలం దురుద్దేశం పూర్వకంగా, రాజకీయాల కోసం దిగజారి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఈ మేరకు బండి సంజయ్, అర్వింద్‌లకు కేటీఆర్ తన న్యాయవాదులతో నోటీసులు పంపించారు. కేటీఆర్ కుటుంబం ఫోన్ ట్యాపింగ్ ద్వారా రూ.వేల కోట్లు సంపాదించిందని, సెలబ్రిటీల ఫోన్లు ట్యాప్ చేశారంటూ ఈనెల 23న నిర్వహించిన ప్రెస్ మీట్‌లో బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని కేటీఆర్ పేర్కొన్నారు. ఇప్పటికే బండి సంజయ్‌పై సిటీ సివిల్ కోర్టులో పరువు నష్టం దావా నడుస్తున్నప్పటికీ, మళ్లీ అదే తరహాలో తప్పుడు ఆరోపణలు చేయడం దురుద్దేశపూర్వకమని మండిపడ్డారు. మరోవైపు ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు పంపిన నోటీసులో ఆయన చేసిన వ్యక్తిగత దూషణలను తప్పుబట్టారు. డ్రగ్స్ సేవించడం, సరఫరా చేస్తున్నారంటూ అర్వింద్ చేసిన వ్యాఖ్యలు ఆక్షేపణీయమని పేర్కొన్నారు.



# యధాతథంగా టీహబ్ కార్యాలయం

## ప్రభుత్వ కార్యాలయాల మార్చవద్దన్న సీఎం

## అమెరికా నుంచి సీఎస్‌కు రేవంత్ ఆదేశాలు

**హైదరాబాద్, జనవరి 24:** టీహబ్‌ను స్టార్టప్‌ల కేంద్రంగానే కొనసాగించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ అంశంపై సీఎస్ రామకృష్ణారావుకు అమెరికా నుంచి ఫోన్ చేసి సీఎం మాట్లాడారు. అద్దె భవనాల్లోని ప్రభుత్వ కార్యాలయాలను టీహబ్‌కు మారుస్తున్నారనే వార్తలను ఖండించారు. టీహబ్‌లో ఇతర ఆఫీసులు ఉండకూడదని ఆదేశించారు. అలాంటి ఆలోచనలు అధికారులు విరమించుకోవాలన్నారు. అద్దె భవనాల్లోని ప్రభుత్వ ఆఫీసులను ఇతర ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని సీఎం సూచించారు. టీహబ్‌ను స్టార్టప్ కేంద్రంగా కొనసాగించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆఫీసులను టీ హబ్‌కు మారుస్తున్నట్లు వస్తున్న వార్తలపై ముఖ్యమంత్రి స్పందించారు. అమెరికా పర్యటనలో ఉన్న రేవంత్ రెడ్డి.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావుకు ఫోన్ చేసి మాట్లాడారు. అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ ఆఫీసులను అందుబాటులో ఉన్న ఇతర ప్రభుత్వ భవనాలకు మార్చాలని సూచించారు.

# మావోయిస్టులకు ఆశ్రయం

## సోదాలు చేపట్టిన పోలీసులు



**నాగర్‌కర్నూల్, జనవరి 24:** అమ్రాబాద్ ప్రాంతంలో శనివారం పోలీసులు విస్తృత దాడులు నిర్వహించారు. మావోయిస్టు సభ్యులకు ఆశ్రయం ఇచ్చినట్టు ఆరోపణల నేపథ్యంలో ప్రజా సంఘాల నాయకుల ఇళ్లలో పోలీసులు సోదాలు చేపట్టారు. ఈ క్రమంలో అడ్డ అంబయ్య, జక్క బాలయ్య నివాసాల్లో తనిఖీలు చేశారు. ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ ఆధ్వర్యంలో మావోయిస్టులకు షెల్టర్ ఇచ్చినట్టు పోలీసులకు నిఘా సమాచారం అందిన నేపథ్యంలో ఈ ఆపరేషన్ చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ దాడుల్లో సల్మాన్, ఆయన భార్య సుకుమ సహా మొత్తం ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారణ కోసం పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై పోలీసులు ఇంకా అధికారిక వివరాలు వెల్లడించాల్సి ఉంది. కాగా, ఈ సోదాల సమయంలో పోలీసులు కొన్ని డాక్యుమెంట్లు, మొబైల్ ఫోన్లు, సామాజిక సంఘాల సంబంధిత మెటీరియల్ స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. అదుపులోకి తీసుకున్న వారిని విచారిస్తున్నారు. మావోయిస్టు కనెక్షన్లు, ఆర్థిక సహాయం, లాజిస్టిక్స్ సపోర్ట్ వంటి అంశాలపై పోలీసులు దృష్టి సారించినట్టు తెలుస్తోంది. అమ్రాబాద్ ప్రాంతం తెలంగాణలో మావోయిస్టు ప్రభావం ఉన్న ఏరియాల్లో ఒకటిగా పోలీసులు భావిస్తున్నారు. గత కొన్ని నెలలుగా ఇక్కడ పోలీసులు, ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు అప్రమత్తంగా ఉన్నాయి. ఈ దాడులు మావోయిస్టు నెట్‌వర్క్‌ను బలహీనపరచడానికి, సపోర్టర్లను గుర్తించడంలో భాగమేనని పోలీస్ అధికారులు అంటున్నారు. ఇవి సమీప భవిష్యత్ లోనూ కొనసాగుతాయని పోలీసులు చెబుతున్నారు. అయితే, ప్రజా సంఘాల నేతల్ని అదుపులోకి తీసుకున్నా.. వారి బంధువులు, సహచరులు ఇది రాజకీయ హింస, ప్రజా ఉద్యమాలపై దాడి అని ఆరోపిస్తున్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు బీఆర్ఎస్ ఇన్‌చార్జిలు

## మున్సిపాలిటీల వారీగా సమన్వయకర్తల నియామకం



**హైదరాబాద్, జనవరి 24:** పురపాలక ఎన్నికల కోసం బిఆర్ఎస్ ఇన్‌ఛార్జిలను నియమించింది. త్వరలో ఎన్నికలు జరగనున్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీల వారీగా సమన్వయకర్తల జాబితాను ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విడుదల చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి మున్సిపాలిటీ, కార్పొరేషన్‌ను ఒక సీనియర్ నాయకుడికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఎన్నికల వ్యూహాలను రూపొందించడం సమన్వయకర్తల ప్రధాన బాధ్యత అని కేటీఆర్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి ముగిసే వరకు నిరంతరం ఆయా మున్సిపాలిటీల్లో అందుబాటులో ఉంటారని చెప్పారు. ఎన్నికల్లో అత్యంత కీలకమైన అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో ఇన్‌ఛార్జిలు కీలక పాత్ర పోషిస్తారన్న ఆయన... స్థానిక నాయకత్వంతో చర్చించి, గెలుపు గుర్రాలను గుర్తించి, నివేదికలను ఎప్పటికప్పుడు పార్టీ అధిష్ఠానానికి సమర్పిస్తారని పేర్కొన్నారు. పార్టీ రూపొందించిన ప్రచార కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లడం, బూత్ లెవల్ ఏజెంట్లను సమన్వయం చేయడం వంటి అంశాలను పర్యవేక్షిస్తారని కేటీఆర్ తెలిపారు. ఎన్నికల సరళి, క్షేత్రస్థాయి పరిస్థితిని ఎప్పటికప్పుడు పార్టీ కేంద్ర కార్యాలయానికి నివేదించేలా ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజల మద్దతుతో మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.



సంపాదకీయం

# తల్లిదండ్రులూ.. తస్మాత్ జాగ్రత్త!

భారతీయ విద్యావిధానం మనిషి మేధావిని భాషించేలా..ప్రపంచాన్ని శాసించేలా ఉండేది. అన్నిరంగాల్లో విద్యార్థులను ఆరితేరేలా చేసే మన విద్యావిధానం పాతపడి పోయింది. ఎందుకంటే దానిని పాతరేశారు. బ్రిటిషర్ల హయాంలో మెకాలే విద్యావిధానంతో మన విద్యావ్యవస్థ భ్రష్టుపట్టిపోయింది. అందుకే సమాజంలో నైపుణ్యత, నాణ్యత లేని విద్యను గడిస్తున్న విద్యార్థులు కోకొల్లలుగా పుట్టుకు వస్తున్నారు. వారికి నైపుణ్యాలు లేక ఎక్కడా రాణించడం లేదు. ఒళ్లు వంచి పనిచేసేందుకు ముందుకు రావడం లేదు. దీంతో మనదేశంలో కోటళ్లల్లో నిరుద్యోగులు పెరిగి పోతున్నారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో అవకాశాలు దండిగా ఉన్నా.. బిటెక్, ఎంటెక్‌లు చదివిన వారంతా ఇలాంటి పనులకు రాలేకపోతున్నారు. చదువు వేరు వృత్తి వేరు అన్న విధంగా ఆలోచించే ధోరణి కానరావడం లేదు. భారతీయుల మేధస్సు అమోఘం, అద్భుత మని ప్రపంచం ఎప్పుడో గుర్తించింది. ఇప్పటికీ విదేశాల్లో రాణిస్తున్నది కూడా మనవారే. ముఖ్యంగా ఇంగ్లీష్, మ్యాథ్, సైన్స్ తదితర రంగాల్లో అద్భుత ప్రదర్శనను కనబరుస్తున్నాం. అయితే ఈ దిశగా మానవనరులను అభివృద్ధి చేసుకునేలా విద్యావిధానం రావడం లేదు. సమాజంలో విలువలు పడిపోవడానికి, యువతలో నైపుణ్యాలు లేకపోవడం కూడా విద్యావిధాన లోపంగానే గుర్తించాలి. అత్యాధునిక ఫోన్లు, ఇంటర్నెట్, సోషల్ మీడియా ప్రభావంతో విద్యార్థుల్లో నైపుణ్యత కొరవడింది. ప్రతిదానికి గూగుల్‌లో వెతికేస్తున్నారు. అలాగే గంటలతరబడి సెల్ ఫోన్లకు అతుక్కు పోతున్నారు. అలవాట్లో భాగంగా యువత పోర్న్ వీడియోలు తిలకిస్తున్నారు. జూదాలకు బానిసలు అవుతున్నారు. అర్థాంతరంగా తనువులు చాలిస్తున్నారు. నిజానికి ఇదో సామాజిక రుగ్మత. దీనిని మార్చాలంటే అక్షరాభ్యాసం నుంచే క్రమశిక్షణ అలవర్చాలి. విద్యారంగాన్ని బలోపేతం చేయాలి. విలువలతో కూడిన విద్యను నేర్పాలి. లేకుంటే మరింతగా సమాజం దెబ్బతినగలదు. ఎందుకంటే ప్రస్తుతం పిల్లలంతా సెల్ ఫోన్లకు అలవాటు పడ్డారు. చిన్న పిల్లవాడిని బుజ్జగించడానికి, అన్నం పెట్టడానికి కూడా సెల్ ఫోన్ వాడేస్తున్నాం. దీంతో పిల్లల్లో మానసిక పరిపక్వత లోపించి, తరగతి గదిలో పరధ్యానంగా వుండిపోతున్నారు. ఆటస్థలంలోనూ నిశ్శబ్దంగా వుంటున్నారు. చురుకుగా, రాటులేదలే కపోతున్నారు. పాఠాలు ఇప్పుడు చాలా చోట్ల స్క్రీన్ల మీద చెబుతు న్నారు. పిల్లలు వీటిని చూస్తూ టీచర్ల వైపు చూడ్డమే మానేశారు. వారితో సంభాషించడం లేదు. పరస్పర అవగాహన లోపిస్తోంది. దీంతో పిల్లలు టీచర్లు ఒకరికి ఒకరు దూరమైపోతున్నారు. తీరిక సమయాల్లో పిల్లలు వాళ్లలో వాళ్లు కూడా మాట్లాడు కోవడం మానేస్తున్నారు. ఇప్పటి పిల్లలది ఏదో ఒక కొత్త లోకమనిపిస్తోంది. మన కుర్రకారు యవ్వనమంతా అశాంతి, చిరాకు, ఆందోళన, ఒంటరి తనాలతో నిండిపోతోంది. తరగతి గది, బడి వాతావరణమంతా యాంత్రికంగా మారింది. పుస్తకాలూ చదవకుండా, గ్రంథపఠనం లేకుండా, పరిసరాల పై అవగాహన లకుండా, చుట్టూ ఏం జరుగుతుందో తెలియకుండా చదివేసి పట్టాలు పుచ్చుకుంటున్నారు. మన తినే అన్నం ఏ ధాన్యం ద్వారా వస్తుందో కూడా తెలియడం లేదు. పాలు ఎలా వస్తాయో తెలియడం లేదు. సెల్‌ఫోన్ పిచ్చిలో పడి మనిషికి మనిషికీ మధ్య అనుబంధాన్ని కోల్పోతున్నారు. నిజానికీ దేశంలోని పిల్లలందరికీ విజ్ఞానం దక్కాలి. వాళ్ల సామర్థ్యాలన్నీ వెలికి రావాలి. వారి మేధస్సుకు పదును పెట్టాలి. ఇవన్నీ కూడా పాఠశాలలో బోధనా తీరుతో..అదికూడా మన ప్రాచీన పద్ధతుల ద్వారానే సాధ్యం అవుతుంది. దీనికి ప్రభుత్వాలదే ప్రధాన బాధ్యత. పాలకుల ఓటు బ్యాంక్ రాజకీయాలకు విద్యావ్యవస్థ బలయిపోతోంది. చిన్ననాటి నుంచే కులాల కుంపట్లను రాజేస్తున్నాం. ఇక కులరహిత సమాజం ఎక్కడ పోతుందన్న ఆలోచన చేయడం లేదు. మనం మన పిల్లలకు కావలసిందంతా ఇస్తున్నామనుకుంటున్నాం. విస్తృత ప్రపంచాన్ని వారి ముందు తెరిచి పెడుతున్నామనుకుంటున్నాం.కానీ అది ఎలాంటి విపరిణామాలకు దారితీస్తున్నదో గ్రహించడం లేదు. నగరాల్లో ఉన్న సెంట్రల్ సిలబస్, కేంబ్రిడ్జ్ వంటి స్కూళ్లతో పోల్చుకుంటే ఇప్పటికీ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే కొంత జనరలం నాలెడ్జ్ అబ్బుతోంది. సెల్‌ఫోన్ కారణంగా మన పిల్లలు మానసిక రుగ్మతకు లోనవుతున్నారు. దీనికితోడు పిజ్జాలు, బర్గర్లు, చిప్స్, కూల్ డ్రింక్స్ లాంటి చెత్త తిండి వల్ల ఊబకాయం పెరిగి అనేక రకాల రోగాలు చేరుతున్నాయి. టీనేజర్లలో ఆత్మహత్యా ప్రయత్నాలు పెరిగాయి. ఒక అధ్యయనం ప్రకారం ప్రతి ముగ్గురు బిడ్డల్లో ఒకరికి కంటి సమస్య తలెత్తు తోంది. ఒకరకంగా ఇదంతా మనం తెచ్చిపెట్టుకున్న సమస్య. ఎక్కువ కాలం ఫోన్లపై గడపడం, బ్లూ లైట్లు, నిద్ర లేమి, ఆటల కొరత ఇవన్నీ మనం కోరి తెచ్చుకొన్న ఉపద్రవాలు. కంటి జబ్బులతో ఇది ఆగడం లేదు. ఈ ఫోన్ల పుణ్యమా అని మన పిల్లలు డ్రగ్స్ బారిన పడుతున్నారు. హింసాత్మకంగా మారుతున్నారు. పోర్న్ వీడియోలకు బానిసలవుతున్నారు. వారి ప్రవర్తనలో తీవ్రమైన మార్పులొస్తున్నాయి. బస్సుల్లో, రైళ్లలో ప్రయాణించే మన చంటిపిల్లలు కూడా ఫోన్లకు అతుక్కుపోతున్నారు. కిటికీ లోంచి బయటికి చూడ్డం లేదు. అక్కడ వారికే కొత్త లోకమూ కనపడ్డం లేదు. విచిత్రంగా పసిబిడ్డలకు కూడా ప్రపంచం మూసుకుపోతోంది. ఇంతకంటే విషాదం మరోటి ఉండదు. కోవిడ్ రోజుల్లో మనం చెప్పిన ఆన్‌లైన్ పాఠాలు కూడా వారిని మరింతగా ఫోన్లకు బానిసల్ని చేశాయి. మనకు తెలియకుండానే మన పిల్లలు మానసికంగా బలహీనులై పోయారు. టెక్నాలజీ ఏదో గొప్పదనీ, దీన్ని చిన్నప్పటి నుంచే పిల్లలకందించాలనీ మనమనుకుంటే అది పిల్లల్ని బడికి, కుటుంబానికి, చివరకు స్వతంత్ర ఆలోచనలకు కూడా దూరం చేసింది. ఇప్పుడు కోవిడ్ లేదు. అయినా సెల్ ఫోన్ల జాఢ్యం మాత్రం కొనసాగుతోంది. దీనికి దూరం చేయడం కోసం పిల్లల్లో మానసిక పరివర్తనకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. సమతు ఆహారం ఇవ్వాలి. వ్యాయామం, నడకను ప్రోత్సహించాలి. ఇలా మనమంతా మన ప్రాచీన అలవాట్లను ముందుకు తెచ్చుకుంటే తప్ప మనుగడ సాగించడం కష్టం. తల్లిదండ్రులు ఈ బిజీ లైఫ్‌లో పిల్లల మనుగుడ గురించి ఆలోచించడం లేదు. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పాఠశాలల్లో వ్యాపారధోరణి పెరిగింది. అందుకే మనమే మారాలి. పిల్లల కోసం సమయం కేటాయించాలి. ఇంటినుంచే మార్పు రావాలి.

# 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

**27న ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు**



**న్యూఢిల్లీ, జనవరి 24:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలను పురస్కరించుకుని పరభుత్వం ఈనెల 27న అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. పార్లమెంటు బ్జడెట్ సమావేశాలకు ముందు సంప్రదాయం ప్రకారం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 27వ తేదీన పార్లమెంట్‌లోని మెయిన్ కమిటీ రూమ్‌లో ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందని అన్నారు. బడ్జెట్ సమావేశాల్లో చేపట్టనున్న లెజిస్లేటివ్, ఇతర అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తారు. జనవరి 28న ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించడంతో పార్లమెంటు బ్జడెట్ సమావేశాలు ప్రారంభమవుతాయి. జనవరి 28తో ప్రారంభమయ్యే తొలి విడత బ్జడెట్ సమావేశాలు ఫిబ్రవరి 13న ముగుస్తాయి. రెండో విడత బ్జడెట్ సమావేశాలు మార్చి 9న తిరిగి ప్రారంభమై ఏప్రిల్ 2న ముగుస్తాయి. ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారంనాడు కేంద్ర బ్జడెట్ 2026-27ను ఉభయసభల్లోనూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెడతారు. సీతారామన్ వంసగా ప్రవేశపెడుతున్న తొమ్మిదవ బ్జడెట్ ఇది. ఫిబ్రవరి 2 నుంచి 4వ తేదీ వరకూ రాష్ట్రపతి బ్జడెట్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం ఉంటుంది. దీనితో పాటు వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు-2025, ది సెక్యూరిటీస్ మార్కెట్ కోడ్-2025, రాజ్యాంగ (129వ సవరణ) బిల్లు-2024పై సభలో చర్చ ఉంటుంది. ఈ బిల్లులను తదుపరి పరిశీలన కోసం పార్లమెంటరీ స్థాయి సంఘానికి లేదా సెలెక్ట్ కమిటీలకు పంపనున్నారు. కాగా, గత శీతాకాల సమావేశాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో కేంద్రం తీసుకువచ్చిన వికసిత్ భారత్-గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్(గ్రామీణ్) చట్టంపైనా పార్లమెంటులో చర్చ జరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం చేసిన ఈ మార్పుపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించడంతో పాటు కొత్త చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త ప్రచారం సాగిస్తోంది.



# దేశవ్యాప్తంగా 18వ రోజ్‌గార్ మేళా

**61,000 మందికి నియామక పత్రాలు అందించిన మోడీ**

**న్యూఢిల్లీ,జనవరి 24:** దేశవ్యాప్తంగా శనివారం జరిగిన 18వ రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ 61,000 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించారు. కొత్తగా వివిధ శాఖల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చిన వారికి నియామక పత్రాలను మోదీ వర్చువల్‌గా అందజేశారు. ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దేశవ్యాప్తంగా 45 కేంద్రాల నుంచి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. మొత్తం నియామకాల్లో 49,200.. హోంమంత్రిత్వ శాఖ, పారామిలిటరీ దళాలకు సంబంధించినవని తెలిపారు. మహిళా కానిస్టేబుల్స్ భారీగా నియమితులవు తున్నారని, గత 11 సంవత్సరాల్లో ప్రభుత్వం అనేక సౌలభ్య చర్యలు తీసుకున్నందు వల్ల ఇది సాధ్యమైందని వివరించారు. బీఎస్ఎఫ్ మహిళా దళాలు సరిహద్దుల్లో జీరో లైన్ వద్ద ఉద్యోగాలు చేస్తున్నాయని, రిపబ్లిక్ డే పరేడ్‌లో సీఆర్‌పీఎఫ్ పురుష దళానికి మహిళా అసిస్టెంట్ కమాండెంట్ నాయకత్వం వహిస్తుందని ఆయన పేర్కొన్నారు. రోజ్‌గార్ మేళా కార్యక్రమం ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, ప్రభుత్వ నిబద్ధతను చాటి చెబుతోందని మోదీ పేర్కొన్నారు. ఈ మేళాల ద్వారా ఇప్పటివరకూ 11 లక్షలకు పైగా నియామక పత్రాలు విడుదల చేశారు. వివిధ మంత్రిత్వ శాఖలు.. హోం వ్యవహారాలు, ఆరోగ్యం, ఆర్థిక సేవలు, ఉన్నత విద్య విభాగాలతోపాటు ఇతర శాఖల్లో ఈ నియామకాలు జరిగాయి. దేశవ్యాప్తంగా ఉన్న యువత ఈ కార్యక్రమంలో పాల్గొని ఉద్యోగ నియామక పత్రాలు స్వీకరించారు.

# ఎంపీ ఇంజినీర్ రషీద్‌కు కస్టడీ పెరోల్




**న్యూఢిల్లీ:** బారాముల్లా ఎంపీ షేక్ అబ్దుల్ రషీద్ అలియాస్ ఇంజినీర్ రషీద్ కు పార్లమెంటు బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో కస్టడీ పెరోల్ మంజూరైంది. ఉగ్రనిధుల కేసులో నిందితుడైన రషీద్ ప్రస్తుతం ఢిల్లీలోని తిహాడ్ జైలులో ఉన్నారు. జనవరి 28 నుంచి ప్రారంభమవుతున్న పార్లమెంటు బడ్జెట్ సమావేశాలకు హాజరయ్యేందుకు ఆయనకు అనుమతిస్తూ ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టు కస్టడీ పెరోల్ మంజూరు చేసింది. పార్లమెంటు సమావేశాల్లో హాజరయ్యేందుకు తాత్కాలిక బెయిల్ కానీ, కస్టడీ పెరోల్ కానీ ఇవ్వాలని రషీద్ ఇటీవల కోర్టును కోరారు. దీనిపై సమాధానం ఇవ్వాలని ఎన్ఐఏకు గతవారం ప్రత్యేక ఎన్ఐఏ జడ్జి ప్రశాంత్ శర్మ నోటీసులు జారీచేశారు. కోర్టు తాజా ఆదేశాలపై రషీద్ తరఫు న్యాయవాది నిశిత గుప్తా మాట్లాడుతూ, బడ్జెట్ సమావేశాలు జరిగే జనవరి 28 నుంచి ఏప్రిల్ 2 వరకూ అన్ని రోజులూ హాజరయ్యేందుకు కోర్టు అనుమతించిందని చెప్పారు. పార్లమెంటు సెక్యూరిటీతో పాటు పోలీసు సెక్యూరిటీతో ఈ సమావేశాలకు రషీద్ హాజరవుతారని తెలిపారు.

# ఆపరేషన్ సిందూర్‌పై రాజీ లేదు

**ఈ విషయంలో నా అభిప్రాయాలు నాకున్నాయి**

**కాంగ్రెస్‌తో విభేదాలపై ఎంపి శశిథరూర్**



**న్యూఢిల్లీ, జనవరి 24:** పార్లమెంటులో పార్టీ నియమావళిని తాను ఎప్పుడూ ఉల్లంఘించలేదని కాంగ్రెస్ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ అన్నారు. 'ఆపరేషన్ సిందూర్' విషయంలోనే తనకు పార్టీతో అభిప్రాయభేదాలున్నట్టు చెప్పారు. అయితే ఈ విషయంలో తాను క్షమాపణ కోరనని తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం ఆపరేషన్ సిందూర్‌ను భారత్ చేపట్టింది. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని ఎండగట్టేందుకు విదేశాలకు వెళ్లిన కేంద్ర ప్రతినిధి బృందంలో శశిథరూర్ ఉండటం సొంత పార్టీ నుంచి విమర్శలకు దారితీసింది. కేరళ లిటరేచర్ ఫెస్టివల్ సందర్భంగా మీడియా అడిగిన ఒక ప్రశ్నకు శశిథరూర్ స్పందిస్తూ, ఆపరేషన్ సిందూర్ అంశలో తాను ఒక బలమైన నిర్ణయం తీసుకున్నానని, దానికి కట్టుబడి ఉన్నానని, దానిపై తాను క్షమాపణ కోరనని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌కు ముందు తాను రాసిన ఆర్టికల్‌ను థరూర్‌ను ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఒక రచయితగా పహల్గాం గురించి తాను ఆర్టికల్ రాశానని, ఉగ్రదాడులకు తగిన సైనిక స్పందన ఉండాలని అందులో చెప్పానని, అభివృద్ధిపై దృష్టిసారించిన భారత్ దీర్ఘకాల ఘర్షణలకు వెళ్లకుండా ఉగ్రవాద శిబిరాలను టా÷-గ్గ్÷ట్ చేయాలని అందులో పేర్కొన్నానని చెప్పారు. తాను ఏదైతో అభిప్రాయపడ్డానో అదేవిధంగా పాక్ ఉగ్రవాద శిబిరాలను భారత్ ధ్వంసం చేయడం తనకు ఆశ్చర్యం కలిగించిందని అన్నారు. పార్టీ అధినాయకత్వంతో థరూర్‌కు విభేదాలున్నాయని, రాహుల్ గాంధీ ఇటీవల కొచ్చి వెళ్లినప్పుడు ఆయనకు ప్రాధాన్యత ఇవ్వలేదని, రాష్ట్ర నాయకులు సైతం థరూర్‌ను ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఇటీవల ఊహాగానాలు వెలువడ్డాయి. ఈ పరిణామాలపై థరూర్ సైతం అసంతృప్తితో ఉన్నారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. కాగా, కేరళ అసెంబ్లీ ఎన్నికలపై ఆ రాష్ట్ర నాయకులతో ఏఐసీసీ అధిష్ఠానం శుక్రవారంనాడు సమావేశమైంది. దీనికి కూడా శశిథరూర్ గైర్హాజరయ్యారు. పార్టీకి థరూర్ అవసరం ఇంకెంతమాత్రం లేదంటూ సందీప్ దీక్షిత్ సహా పలువురు పార్టీ నేతలు దీనిపై వ్యాఖ్యానించారు. శశిథరూర్ గైర్హాజరు వెనుక పార్టీతో విభేదాలే కారణమని ఊహాగానాలు సైతం వెలువడ్డాయి. దీనిపై తాజాగా శశిథరూర్ స్పందించారు. పార్టీ అంతర్గతం వ్యవహారాలపై బహిరంగంగా మాట్లాడటం సరికాదన్నారు. రాజకీయ డిక్లరేషన్ చేసేందుకు తాను ఇక్కడికి రాలేదని, ఇది లిటరరీ ఫెస్టివల్ అని అన్నారు. పార్టీ నాయకత్వంతోనే ఈ విషయం ప్రస్తావించగలనని, బహిరంగ వేదికలమీద కాదని చెప్పారు. సమవేశంలో పాల్గొనే విషయంలో తన అసక్తతను తెలియజేస్తూ పార్టీకి ముందస్తు సమాచారం ఇచ్చినట్టు తెలిపారు.

# యూపీలో బాలికపై మతమార్పిడికి ఒత్తిడి

**ఐదుగురు ముస్లిం బాలికలపై కేసు నమోదు**



**లక్నో, జనవరి 24:** ఉత్తరప్రదేశ్‌లోని మోరాదాబాద్ జిల్లా బిలారి పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదుగురు మైనర్ ముస్లిం బాలికలపై కేసు నమోదు అయింది. హిందూ బాలికను బురఖా ధరించమని బలవంతం చేసినట్లు, అలాగే ఆమెను మతం మారాలని ఒత్తిడి చేసినట్లు పోలీస్ అధికారులు పేర్కొన్నారు. కాగా, ఈ ఘటన గత డిసెంబర్ 12వ తేదీన చోటు చేసుకున్నప్పటికీ, ఇటీవలే వెలుగులోకి వచ్చింది. బాధితురాలి అన్న దక్ష్ చౌదరి (16) బిలారి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విషయం బయటకు వచ్చింది. ఐదుగురు బాలికలు చదువుతున్న పాఠశాలతో పాటు ఒకే ట్యూషన్ క్లాస్‌లో హాజరయ్యేవారు.. దీంతో వారు ఆమెను బురఖా ధరించమని, ఇతర మతం స్వీకరించమని ఒత్తిడి చేసినట్లు ఆరోపించారు. ఈ కేసు ఉత్తరప్రదేశ్ మతమార్పిడి నిరోధక చట్టంలోని సెక్షన్ 3, సెక్షన్ 5(1) కింద నమోదు అయింది. ఈ చట్టం ప్రకారం మోసం, బలవంతం, బెదిరింపు, అనుచిత ప్రభావం లేదా ఆకర్షణ ద్వారా జరిగే మతమార్పిడిని నేరంగా పరిగణిస్తుంది. ఇక, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ మత మార్పిడికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయింది. వీడియోలో ఇరుకైన వీధిలో హిందూ బాలిక బురఖా ధరించగా, మిగతా బాలికలు ఆమె దుస్తులపై బురఖాను సరిచేస్తూ కనిపిస్తున్నారు. వారు రెస్టారెంట్ వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. తన అన్న చూసేస్తాడేమో అన్న భయంతో బాధితురాలు బురఖా ధరించిందని పోలీసులు తెలిపారు. గ్రామీణ ఎస్పీ కున్వర్ ఆకాశ్ సింగ్ మాట్లాడుతూ.. ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. నిందితుల ఉద్దేశం, ఘటన వెనుక ఉన్న కారణాలను లోతుగా పరిశీలిస్తున్నామని చెప్పారు. అయితే, ఈ చట్టం ప్రకారం మైనర్లకు సంబంధించిన మతమార్పిడి కేసుల్లో దోషులుగా తేలితే కనీసం ఐదేళ్ల నుంచి 14 ఏళ్ల వరకు కఠిన శిక్ష విధించవచ్చని హెచ్చరించారు. నిందితులందరూ మైనర్లు కావడంతో వారిని వెంటనే అదుపులోకి తీసుకోలేదని.. ఈ ఘటనపై బలవంతంగా చేశారా అనే అంశంపై విచారణ కొనసాగుతోందని తెలిపారు.

## జాతీయ బాలికా దినోత్సవం



**సమయం న్యూస్, వాంకిడి:** మండల కేంద్రంలోని పీఎం శ్రీ జడ్పిహెచ్ఎస్ వాంకిడి కలాన్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వ హించారు. బాలికల సర్వతో ముఖాభివృద్ధిని ఆకాంక్షిస్తూ పాఠశాల ప్రాంగణంలో విద్యా ర్థినులకు వివిధ రకాల పోటీలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా నిర్వహించిన ఆటల పోటీలు, పాటలు, నృత్యాలు, రంగవల్లుల పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి. అలాగే విద్యార్థినులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేలా చేతివృత్తులతో నైపుణ్యం కల్పించే పలు కృత్యాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మహిళా సాధికారత, బాలికల హక్కులు సమాజంలో వారు నిర్వర్తించాల్సిన బాధ్యతల గురించి ఉపాధ్యాయులు విద్యార్థినులకు వివరించారు. దేశాభివృద్ధిలో బాలికల పాత్ర కీలకమని, వారు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రధాన ఉపాధ్యాయుడు సంతోష్ కుమార్ ఉపాధ్యాయులు మమత, శోభారాణి, శైలజ, అరుంధతి, నాగరాణి, స్వప్న, అలివేణి, నుజహాత్, కవిత, రమాదేవి , సరిత తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పథకాన్ని కొనసాగించాలి



**సమయం న్యూస్, జైనూర్ : సిర్పూర్(యు):** విబిజిరామ్ జీ చట్టాన్ని రద్దు చేసి మహాత్మా గాంధీ ఉపాధిహామీ పథకాన్ని కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆత్రం గోవిందరావు ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు కుడ్మెత యశ్వంతరావు మాట్లాడుతూ మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని, మహాత్మా గాంధీ పేరును తొలగించడం సరికాదని అన్నారు. విబిజిరామ్ జీ అనే కొత్త చట్టంతో ఉపాధి హామీ కూలీలు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజావ్యతిరేక చట్టాలను తీసుకురావడం సిగ్గుచేటని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేద ప్రజలకు సంవత్సరానికి వంద రోజుల ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు గుర్తు చేశారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన విబిజిరామ్ జీ పథకాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఆత్రం ద్వాలత్ రావు, సీనియర్ నాయకులు సుద్దాల శ్రీనివాస్, ఉప సర్పంచ్ పెందోర్ రామారావు, మైనార్టీ నాయకులు షేక్ ఆరిఫ్, ఆత్రం నాగోరావు, సర్పంచులు మెస్రం భూపతి, టెక్మ అంబారావు, డైరెక్టర్ లచ్చు, ఆత్మ డైరెక్టర్ మహేశ్, వార్డు సభ్యులు దేవిదాష్, పవర్ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ



**సమయం న్యూస్, జైనూర్:** జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆదేశాల మేరకు ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ పర్యవేక్షణలో జైనూర్‌లో మహిళలకు ఉచిత కుట్టు మెషిన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీఐ రమేష్ తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్, కెరమేరి మండలాల మహిళలకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణలో భాగంగా కుట్టు మిషన్ నిర్వహణతో పాటు స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల మహిళలు నేరుగా జైనూర్ పోలీస్ స్టేషన్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవచ్చని, ఇతర వివరాల కోసం సెల్:8712670511 (సీఐ, జైనూర్), 8712670534 (ఎస్సై, జైనూర్), 8712670536 (ఎస్సై, సిర్పూర్-యూ), 8712670535 (ఎస్సై, లింగాపూర్)లపై సంప్రదించాలని సూచించారు.

## జాతీయ బాలికల దినోత్సవం



**సమయం న్యూస్, బెజ్జూర్:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో శనివారం జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి సునీత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జనవరి 24న జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక అభివృద్ధి వంటి అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఆడపిల్లలను సమాజంలో చిన్నచూపు చూడటం దురదృష్టకరమని, కడుపులో ఉన్న బిడ్డ ఆడపిల్ల అని తెలిసిన వెంటనే భ్రూణ హత్యలకు పాల్పడడం తీవ్రంగా ఖండించదగిన చర్య అన్నారు. మహిళల రక్షణ, బాలికల సంరక్షణ కోసం ప్రభుత్వాలు చేపడుతున్న చర్యలు ప్రశంసనీయమని, వారికి సమాజంలో గౌరవం కల్పించడం ప్రతిఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. భావితరాల కోసం భ్రూణ హత్యలను పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



### 10వ తరగతి ఫలితాల్లో వంద శాతం

## ఉత్తీర్ణతే లక్ష్యం

**జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ**

**సమయం న్యూస్, ఆసిఫాబాద్:** పదవ తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ పిలుపునిచ్చారు. శనివారం ఆయన ఆసిఫాబాద్ మండలంలోని బురుగుడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు, పరీక్షల సిద్ధతను సమీక్షించిన ఆయన, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి, మెనూ పాటించడంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

## మిలిటరీ అధికారుల పర్యటనకు ఏర్పాట్లు చేయాలి



**సమయం న్యూస్, ఆసిఫాబాద్ :** మిలటరీ ఇంజనీరింగ్ సర్వీస్ అధికారుల క్షేత్రస్థాయి పర్యటనకు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం.డేవిడ్ లతో కలిసి జిల్లాలో జరగనున్న డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానభవనరుల అభివృద్ధి కేంద్రం-హైదరాబాద్ ఆధ్వర్యంలో మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీస్ అధికారుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహణపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీస్ ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఈ నెల 24వ తేదీ నుండి 31వ తేదీ వరకు జరగనున్నందున సంబంధిత అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సర్వీస్ అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామపంచాయతీ, మున్సిపాలిటీలను సందర్శించి జిల్లా భౌగోళిక చరిత్ర, పలు విషయాలపై వివరాలు తెలుసుకుంటారని, వారికి అవసరమైన సమాచారాన్ని అధికారులు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సురేష్, శిశు సంక్షేమ, అటవీ శాఖల అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి



**జిల్లా కలెక్టర్ కె.హరిత**

**సమయం న్యూస్, ఆసిఫాబాద్ :** జిల్లాలో రాబోయే మున్సిపల్ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో నోడల్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని, తమకు కేటాయించిన విధులను అధికారులు అత్యంత సమర్థవంతంగా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హరిత ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం. డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావులతో కలిసి నోడల్ అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి చిన్నపాటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా బ్యాలెట్ బాక్సుల నిర్వహణ, బ్యాలెట్ పేపర్ల ప్రింటింగ్, మీడియా సమన్వయం, సిబ్బందికి శిక్షణ, మ్యాన్ పవర్ వాహనాల కేటాయింపు వంటి అంశాలను క్షుణ్ణంగా పర్యవేక్షించాలన్నారు. అలాగే అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల పరిశీలనతో పాటు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని జిల్లాలో పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. గతంలో వివిధ ఎన్నికల విధుల్లో పాల్గొన్న అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని, ఈ మున్సిపల్ ఎన్నికలను ఎటువంటి ఆటంకాలు లేకుండా పారదర్శకంగా పూర్తి చేయాలని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపల్ కమిషనర్లు మరియు వివిధ విభాగాలకు చెందిన నోడల్ అధికారులు పాల్గొన్నారు.

## వాంకిడి సర్పంచ్‌కు కళాశాల బృందం ఘన సన్మానం

**సమయం న్యూస్, వాంకిడి:** వాంకిడి మండల కేంద్రంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ చూనార్కర్ సతీష్ ని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ , అధ్యాపక బృందం ఘనంగా సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ చంద్రయ్య ఆధ్వర్యంలో సర్పంచ్‌ను కలిసి శాలువాతో సత్కరించి, పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చంద్రయ్య మాట్లాడుతూ.. వాంకిడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2016-2018 బ్యాచ్‌లో విద్యనభ్యసించిన విద్యార్థి సతీష్ (సోను) నేడు సర్పంచ్‌గా గెలవడం తమ కళాశాలకు ఎంతో గర్వకారణమని ఆనందం వ్యక్తం చేశారు. నేటి యువత రాజకీయాల్లోకి వచ్చి రాణించాల్సిన అవసరం ఉందని, సర్పంచ్ సతీష్ తన పదవీ కాలంలో వాంకిడి గ్రామ సమగ్ర అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు తిరుపతి, కిరణ్, శ్రీధర్, రాజమౌళి, సురేందర్ ఇతర అధ్యాపక బృందం సభ్యులు పాల్గొన్నారు.




## చదువుతోనే ఉన్నత శిఖరాలు సాధ్యం

**కాగజ్‌నగర్ డీఎస్పీ వహీవద్దీన్**



**సమయం న్యూస్, కాగజ్ నగర్ :** చదువుతోనే ఉన్నత శిఖరాలు సాధ్యమని కాగజ్‌నగర్ డీఎస్పీ వహీవద్దీన్ అన్నారు. శనివారం కాగజ్‌నగర్ పట్టణంలోని స్థానిక అన్వర్ ఉర్దూ పాఠశాలలో అబిద్ అలీ ఖాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉర్దూ మీడియం 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా సియాసత్ క్వశ్చన్ బ్యాంక్‌లు, ఎగ్జామ్ ప్యాడ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ వహీవద్దీన్ అన్వర్ ఉర్దూ పాఠశాల, ఎగ్బాల్ స్కూల్, ప్రభుత్వ పాఠశాల ఆర్.బి పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వీటిని అందజేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు ఆటపాటలతో పాటు చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించడం ద్వారా తమ తల్లిదండ్రులకు, సిర్పూర్ నియోజకవర్గానికి రాష్ట్రస్థాయిలో మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. గతంలో ఉర్దూ మీడియం పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన వారికి కూడా ట్రస్ట్ ద్వారా క్వశ్చన్ బ్యాంకులు అందించడం అభినందనీయమని, ఇలాంటి కార్యక్రమాలు విద్యాభివృద్ధికి ఎంతో తోడ్పడతాయని పేర్కొన్నారు. మండల విద్యాధికారి ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించి తమ గురువులకు, తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలవాలని కోరారు. ఉపాధ్యాయుల మార్గదర్శనం, తల్లిదండ్రుల సహకారంతోనే విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ కుమారస్వామి, అన్వర్ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు ఆరిఫ్ ఉద్దీన్, ట్రస్ట్ జిల్లా ఇంచార్జ్ అబ్దుల్ జమీల్, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయుడు తాటి రవీందర్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు

# సంభావ్య అనుసంధాన రుణ ప్రణాళిక ,( పి ఎల్ పి) ప్రారంభించారు.



**కామారెడ్డి జనవరి24( సమయం న్యూస్) :** కామారెడ్డి జిల్లాకు సంబంధించిన 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంభావ్య అనుసంధాన రుణ ప్రణాళికను ఈరోజు (24.01.2026 ) కామారెడ్డి జిల్లా గౌరవ కలెక్టర్ శ్రీ ఆశిష్ సంగ్వాన్, ఐఏఎస్ గారు ప్రారంభించారు. 2026-27 సంవత్సరానికి జిల్లా మొత్తం రుణ సామర్థ్యాన్ని రూ. 7752 కోట్లుగా అంచనా వేశారు. ఈ సంభావ్య అనుసంధాన రుణ ప్రణాళిక జిల్లా వార్షిక రుణ ప్రణాళిక (ఏసీపీ) తయారీకి ఆధారంగా ఉంటుంది. ఈ ప్రారంభ కార్యక్రమంలో నాబార్డ్ డిడిఎం శ్రీ ప్రవీణ్ కుమార్, ఎల్‌డిఎం జె. చంద్ర శేఖర్, పిడి డిఆర్‌డిఏ శ్రీ సురేందర్, డిఎఫ్ఓ, డిఏఓ, పిడి మెప్మా, డిహెచ్ఓ, డివిహెచ్ఓ మరియు ఇతర జిల్లా అధికారులు కూడా పాల్గొన్నారు.

## ఎక్సైజ్ కానిస్టేబుల్ ను పరామర్శించిన కలెక్టర్



**నిజామాబాద్, జనవరి 24( సమయం న్యూస్)** నిజామాబాద్ నగర శివారులో తనిఖీలు నిర్వహిస్తున్న సందర్భంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తులు కారుతో ఢీకొట్టిన సంఘటనలో తీవ్రంగా గాయపడి నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ జి.సౌమ్యను కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి ఆసుపత్రి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సౌమ్య కుటుంబ సభ్యులను కలిసి వారికి ధైర్యం చెప్పారు. సౌమ్య త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. విధి నిర్వహణలో ఉన్న ఎక్సైజ్ వుమెన్ కానిస్టేబుల్ పై హత్యా యత్నానికి పాల్పడడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని, బాధ్యులైన వారికి కఠిన శిక్ష పడేలా చూడాలని పోలీస్ కమిషనర్ ను కోరతామని అన్నారు. సౌమ్య వెంటిలేటర్ పై ఉన్నారని, ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నప్పటికీ 48 గంటల పాటు అబ్జర్వేషన్ లో ఉంచాలని వైద్యులు తెలిపారని కలెక్టర్ వెల్లడించారు. సౌమ్య ఆరోగ్యం సహకరించిన వెంటనే ఉన్నత స్థాయి వైద్యం కోసం హైదరాబాద్ కు తరలించేలా ఏర్పాట్లు చేశామని, ఆమె వైద్యం కోసం అయ్యే ఖర్చును ప్రభుత్వ పరంగా అందించడం జరుగుతుందని తెలిపారు. కాగా, సంఘటన జరిగిన వెంటనే ఘటనా స్థలంలో ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ స్వప్న తక్షణమే స్పందించి సౌమ్యకు సీ.పీ.ఆర్ చేయడం ఎంతగానో ఉపకరించిందని ఈ సందర్భంగా స్వప్నను కలెక్టర్ అభినందించారు. కలెక్టర్ వెంట ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి, సూపరింటెండెంట్ మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

### విధి నిర్వహణలో స్వీయ భద్రత పాటించాలి

కాగా, ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు అందరూ విధి నిర్వహణ సమయంలో స్వీయ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు పలికారు. అభివృద్ధి పనుల ప్రగతిపై కలెక్టరేట్ లో శనివారం అధికారులతో సమీక్ష నిర్వహించిన సందర్భంగా కలెక్టర్ ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య ఘటనను ప్రస్తావించారు. విధి నిర్వహణలో ఉన్న తరుణంలో హత్యా యత్నానికి గురై తీవ్రంగా గాయపడిన సౌమ్య ఘటన తనను ఎంతగానో కలిచివేసిందని అన్నారు. విధులు నిర్వర్తించే సమయాలలో ఉద్యోగులు అందరూ తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## బాలికల అభ్యున్నతికి కృషి చేయాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి




**నిజామాబాద్, జనవరి 24( సమయం న్యూస్)** బాలికల పట్ల వివక్షతను ప్రదర్శించకుండా వారి అభ్యున్నతికి కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిజామాబాద్ నగరంలో చేపట్టిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. పాత కలెక్టరేట్ గ్రౌండ్ నుండి ప్రధాన వీధుల మీదుగా న్యూ అంబేద్కర్ భవన్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. బేటీ బచావో - బేటీ పడావో, బాలికలను రక్షిద్దాం అని నినాదాలు చేస్తూ విద్యార్థినులు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ రసూల్ బీ, జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి పవన్ కుమార్, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ట్రంప్ వ్యాఖ్యలు బహిరంగ విస్తరణవాదానికి నిదర్శనం: నారాయణ, సీపీఐ

**హైదరాబాద్ జనవరి24( సమయం న్యూస్) :** అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు బహిరంగ విస్తరణవాదానికి నిదర్శనమని సీపీఐ జాతీయ నాయకుడు నారాయణ విమర్శించారు. శక్తివంతమైన దేశాలు బలహీన దేశాలపై బెదిరింపులు, ఒత్తిళ్లు, వనరులపై నియంత్రణ ద్వారా ఆధిపత్యం చెలాయించాలనే ప్రమాదకరమైన మనస్తత్వాన్ని ఈ వ్యాఖ్యలు బయటపెడుతున్నాయని ఆయన అన్నారు."భద్రత" లేదా "జాతీయ ప్రయోజనం" అనే పేర్లతో కొత్త తరహా వలసవాద బెదిరింపులను ప్రపంచం ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించకూడదు. మానవాళికి అవసరమైనది సామ్రాజ్యవాద రాజకీయాలు కాదు, దేశాల సార్వభౌమత్వం, సమానత్వం, శాంతియుత సహజీవనమే అని నారాయణ స్పష్టం చేశారు.ఇలాంటి విస్తరణవాద చర్యలను ఈ రోజు సహిస్తే, రేపు ఏ స్వతంత్ర దేశమైనా లక్ష్యంగా మారే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. అందుకే ప్రపంచ సమాజం మొత్తం ఈ దౌర్జన్యపూరిత అజెండాను ఖండించి, తిరస్కరించాలని నారాయణ పిలుపునిచ్చారూ.

# జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం

- పాల్గొన్న జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS




**వికారాబాద్, జనవరి,24(సమయం న్యూస్) :** జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని వికారాబాద్ కొత్తగాడి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ఉ కాలేజీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడిన జిల్లా ఎస్పీ నేటి సమాజంలో బాలికలు అన్ని రంగాల్లో ప్రతిభను చాటుతూ ముందంజలో ఉన్నారని, ఏ రంగంలోనైనా ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే కేవలం ప్రతిభ మాత్రమే కాకుండా ఆత్మవిశ్వాసం, నిరంతర కృషి, పట్టుదల ఎంతో అవసరమని పేర్కొన్నారు."విద్య అనేది మీరు ధరించే అత్యంత శక్తివంతమైన ఆభరణం మరియు ఆయుధం. అది మీ భవిష్యత్తును మార్చడమే కాకుండా సమాజంలో మీకు గౌరవప్రదమైన స్థానాన్ని కల్పిస్తుంది" అని ఆమె తెలిపారు. ప్రతి బాలిక తనకు తాను ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ఎదురయ్యే అడ్డంకులను ధైర్యంగా అధిగమిస్తూ విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. బాలికలు తమపై తాము నమ్మకం పెంచుకోవాలని, ఎలాంటి పరిస్థితుల్లోనైనా వెనకడుగు వేయకుండా ముందుకు సాగాలని సూచించారు. అదేవిధంగా బాలికల రక్షణ మరియు భద్రత అంశాలపై జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. అన్యాయం జరిగినప్పుడు భయపడి మౌనంగా ఉండటం నేరస్తులకు మరింత ధైర్యాన్ని ఇస్తుందని, కాబట్టి ప్రతి బాలిక తన గళాన్ని విప్పి ధైర్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో "షీ" టీమ్స్ (షీ టీమ్స్) నిరంతరం నిఘా ఉంచుతూ బాలికలు, మహిళల భద్రత కోసం పనిచేస్తున్నాయని తెలిపారు. ఎలాంటి ఆపదలో ఉన్నా లేదా వేధింపులకు గురైన సందర్భాల్లో సంకోచించకుండా వెంటనే 100 డయల్ చేయాలని లేదా "షీ" టీమ్ వాట్సాప్ నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.సోషల్ మీడియా వినియోగంలో విద్యార్థినులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, అపరిచితులతో వ్యక్తిగత వివరాలను పంచుకోవద్దని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా "షీ" టీమ్ అధికారులు మరియు కళాజాత బృందం వారు తమ ఆటపాటలు, ప్రదర్శనల ద్వారా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, మహిళా భద్రతకు సంబంధించిన చట్టాలు, అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను ఎలా సంప్రదించాలి అనే అంశాలపై విద్యార్థినులకు ఎంతో ఆకట్టుకునే విధంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి. రాములు నాయక్, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఉమెన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ సరోజా, షీటీమ్ ఇన్స్పెక్టర్ అన్వార్ పాషా, పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఎం.వి.ఎఫ్ ఫౌండేషన్ అధికారులు, జిల్లా "షీ" టీమ్ సిబ్బంది, కళాజాత బృందం అధికారులు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

# రూ. 6 కోట్లతో 565 ఇందిరా మహిళా శక్తి స్టాల్స్

- మంత్రి సీతక్క చొరవతో SHG మహిళలకు లబ్ధి




**మేడారం జనవరి24( సమయం న్యూస్) :** మహిళాభ్యున్నతికి తెలంగాణ ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నది. ప్రతి సందర్భాన్ని మహిళల ఆర్థిక చేకూర్పుకు అవకాశంగా మార్చాలని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి సంకల్పించారు. మేడారం మహాజాతరకు వచ్చే భక్తులకు అవసరమైన నిత్యావసర వస్తువులు, ఆహార పదార్థాలు విక్రయించుటకు ఇందిరా మహిళా శక్తి ద్వారా రూ. 6 కోట్ల వ్యయంతో 565 షాపులను ప్రభుత్వం రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా ప్రభుత్వం మంజూరు చేసింది. మొత్తం 37 లొకేషన్లలో 27 రకాల వ్యాపారాలను మహిళలు నిర్వహించనున్నారు.అందులో మేడారం చుట్టుపక్కల ప్రాంతాల్లో 464 యూనిట్స్, మేడారం రాక పోకలు జరిగే మార్గంలో 63 యూనిట్స్ ఏర్పాటు చేశారు. మిగిలిన యూనిట్స్ ఇతర చోట్ల నెలకొల్పారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద [illegible] రూ. 341.30 లక్షలతో 315 యూనిట్స్, [illegible] నిధులు రూ. 86.50 కోట్లతో 80 [illegible], స్త్రీనిధి రూ. 92 లక్షలతో 90 [illegible], [illegible] సమాఖ్య [illegible] రూ. 64 లక్షలతో 60 [illegible], గ్రామ సమాఖ్య నిధులు రూ. 19.50 లక్షలతో 20 [illegible] ను ప్రభుత్వం మంజూరు చేసింది. రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి , RWS & Womensnd Child Welfare శాఖ మంత్రి శ్రీమతి దనసరి అనసూయ-సీతక్క చొరవతో మేడారం జాతర సందర్భంగా ఏర్పాటుచేసిన స్టాల్స్ ద్వారా ఈ ప్రాంత సంఘాల మహిళలు లబ్ధి పొందనున్నారు. ఇందిరా మహిళా శక్తి ద్వారా ఇప్ప పువ్వు లడ్డులు, మిల్లెట్ లడ్డులు, రాగి లడ్డులు, పల్లీ లడ్డులు విక్రయ స్టాల్స్, ఇప్ప నూనె, [illegible] [illegible], కారం, పసుపు, మసాలా యూనిట్స్, రాగి జావ/టిఫిన్, రొట్టెల యూనిట్, మిల్లెట్ షేక్, స్వీట్ కార్న్, పాప్ కార్న్, టీ స్టాల్స్, స్నాక్స్ స్టాల్స్, తెలంగాణ పిండి వంటలు, పచ్చళ్ళు, పూజా సామాగ్రీ విక్రయ స్టాల్స్ తో పాటుబేకరీ, బ్యాంబు చికెన్, చికెన్, క్లాత్ రెడీ మేడ్ డ్రెస్సెస్, గాజులు, బెల్లం, కొబ్బరికాయలు, పూలు, భోజన, అల్పాహార, కిరాణా జనరల్ స్టోర్, కూల్ డ్రింక్స్, పాలు, ఫాస్ట్ ఫుడ్, మొబైల్ ఫిష్ ఉ కర్రీ అవుట్ లెట్, కోళ్ల విక్రయ అవుట్ లెట్, కోడి గుడ్ల స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ స్టాల్స్ ద్వారా ఆయా కుటుంబాలు ఆర్థికముగా అభివృద్ధి చెందనున్నాయి. మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇందిరా మహిళా శక్తి పథకం అండగా నిలుస్తుంది.

# ప్రశాంతంగా రంజాన్ మాసం నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి



**ఖమ్మం, జనవరి 24: ( సమయం న్యూస్ ) :** ప్రశాంతంగా రంజాన్ మాసం నిర్వహణకుఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. అదనపు కలెక్టర్, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రంజాన్ మాసం ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో, ముస్లిం ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం ప్రశాంతంగా జరుపుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, జిల్లాలోనిగ్రామీణ ప్రాంతాలు, మున్సిపాలిటీలలో సైతం అవసరమైన ఏర్పాట్ల కోసం అధికారులకు సూచనలు జారీ చేశామని అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా మసీదుల వద్ద ఎక్కడైనా డ్రైయినేజీ, అప్రోచ్ రోడ్డు గుంతల మరమ్మత్తు పనులు వెంటనే చేపట్టాలని అన్నారు. మసీదుల వద్ద హైమాస్ లైట్, వీధి దీపాల పని తీరు పర్యవేక్షించాలని, మసీదుల వద్ద పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని అన్నారు. మసీదుల వద్ద వీధి కుక్కల బెడద ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు.మసీదు పరిసరాల ప్రాంతాల్లో కుక్కలకు, కోతులకు ఎట్టి పరిస్థితుల్లో ఆహారం పెట్టవద్దని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రతి మసీదు వద్ద ఓఆర స్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ వైద్య ఆరోగ్యశాఖ అధికారికి సూచించారు. షాపులు 24 గంటలు నడిపేందుకు గల అవకాశాలను పరిశీలించి పోలీసు శాఖ సూచనలు అందిస్తుందని అన్నారు. నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండాలని, మసీదులకు అవసరమైన మేర త్రాగునీటి సరఫరాను అందిస్తామని అన్నారు. ప్రతి మసీదు దగ్గర పారిశుధ్య నిర్వహణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని, ఏదైనా మస్జిద్ దగ్గర త్రాగు నీటి సరఫరా, విద్యుత్ సరఫరా సంబంధించి ఏదైనా పనులు ఉంటే వెంటనే తెలియజేయాలని ముఖ్యంగా ఈద్గాలు, కబ్రస్తాన్ లలో పిచ్చి మొక్కలు తొలగించాలని పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచాలని అదనపు కలెక్టర్ తెలిపారు.గ్రామ పంచాయతీలలో ఉన్న మస్జిద్ జాబితా తయారు చేసి రెగ్యులర్ గా అక్కడ పారిశుధ్య పనులు జరిగేలా పంచాయతీ అధికారి చర్యలు తీసుకోవాలని అన్నారు.ప్రతి మస్జిద్ వద్ద నిరంతరం విద్యుత్ సరఫరా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు.పండగ సందర్భంగా షాపింగ్ కోసం మార్కెట్ వద్ద పెద్ద ఎత్తున మహిళలు వచ్చే అవకాశం ఉన్నందున అవసరమైన భద్రత ఏర్పాట్లు చేయాలని, ప్రతి మసీదు వద్ద పార్కింగ్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి మస్జిద్ పరిసరాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. అనంతరం ప్రతి మసీదు వద్ద చేయాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో ముస్లిం ప్రతినిధులతో అదనపు కలెక్టర్ చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మహమ్మద్ ముజాహిద్, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, పోలీస్ సిఐ .రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు, ముస్లిం మత పెద్దలు, మస్జిద్ కమిటీ అధ్యక్షులు , కార్యదర్శులు ,మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.



# కొడంగల్ కడా కార్యాలయంలో వ్యవసాయ పరికరాల పంపిణీ

- అధికారులతో కలిసి పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కొడంగల్ ఇన్చార్ ఏ.తిరుపతి రెడ్డి
- రైతులు వ్యవసాయ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా వ్యవసాయ అధికారి టి. రాజారత్నం

**కొడంగల్ మున్సిపల్, జనవరి,24(సమయం న్యూస్) :** ప్రభుత్వం రాయితీ పై అందిస్తున్న వ్యవసాయ పరికరాలను మండల కేంద్రం లోని కడా ఆఫీసు లో వ్యవసాయ శాఖ ద్వారా వ్యవసాయ యాంత్రీకరణ పథకం లో దరఖాస్తు చేసుకున్న 12 మంది రైతులకు కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఎ.తిరుపతి రెడ్డి చేతుల మీదుగా రోటోవేటర్ , విత్తనం మరియు ఎరువులు వేసే గొర్రు, స్ట్రా బేలర్,పవర్ స్ప్రేయర్ల ను కొడంగల్,బొంరస్ పేట, దౌల్తాబాద్, దుద్యాల మండలాల రైతులకు వ్యవసాయ పరికరాలు అందజేయడం జరిగింది. వారు రాష్ట్ర ప్రభుత్వం రాయితీ పై వ్యవసాయ పరికరాలు, పిచికారి యంత్రాలను అందిస్తుంది అని రైతులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి అని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి టి రాజారత్నం మాట్లాడుతూ రైతులు వ్యవసాయ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి అని ,జిల్లా లో మొత్తం 5, 678 వ్యవసాయ పరికరాలు ( 3.79 కోట్లు) అందుబాటులో ఉన్నాయని వాటిలో ప్రస్తుతం 227 వ్యవసాయ పరికరాలను (52.55 లక్షలు ) రైతులకు అందజేయడం జరిగింది అని, సన్న చిన్నకారు,పెద్ద రైతులు ఈ అవకాశం ను సద్వినియోగం చేసుకోవాలి అని జిల్లా వ్యవసాయ అధికారి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కడా ([illegible] )స్పెషల్ ఆఫీసర్ వెంకట్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి, కొడంగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్య గౌడ్,ఏడీఏ ([illegible]) శంకర్ రాథోడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ జగదీశ్వర్ రెడ్డి,పీఏసీఎస్ మాజీ ([illegible]) చైర్మన్ శివకుమార్ గుప్త. మండల వ్యవసాయ అధికారులు శ్రీలత, లావణ్య, నాగరాజు, పోలప్ప ఎ.ఈ.ఓ లు,అలాగే వ్యవసాయ శాఖ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

# రూ. 50 కోట్ల నిధులతో స్నాన ఘట్టాలు, 348 BoT ల ఏర్పాటు

- అటవీ సంరక్షణకు ప్రత్యేక చర్యలు
- నిరంతర విద్యుత్ సరఫరాకు 196 ట్రాన్స్‌ఫార్మర్లు, 67 కి.మీ ఎలక్ట్రిక్ లైను



**హైదరాబాద్/ మేడారం జనవరి 24 ( సమయం న్యూస్)**
మేడారం మహా జాతర ప్రారంభానికి మరో మూడు రోజులు మాత్రమే ఉండడంతో జాతరకు హాజరయ్యే దాదాపు కోటిన్నర మంది భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు కలుగకుండా రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లను చేసింది. ఈనెల 28 ప్రారంభమయ్యే జాతరకు హాజరయ్యే భక్తులు జంపన్న వాగులో పుణ్య స్నానాలు ఆచరించేందుకు నీటిపారుదల శాఖ గత జాతరలకన్నా అదనపు ఏర్పాట్లను చేసింది. ప్రధానంగా రెడ్డిగూడెం నుండి జంపన్న వాగు మీదుగా చిలకలగుట్ట వరకు నీటి మట్టాన్ని కొనసాగించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. జంపన్న వాగులో ఉన్న 29 ఇంఫిలిట్రేషన్ వెల్స్ ల పూడికను చేపట్టింది. స్నాన ఘట్టాలపై ఉన్న బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ (దీశీ ) లను పునరుద్ధరించడంతోపాటు బ్యాటరీ ఆఫ్ ట్యాప్ లకు నిరంతర నీటిని అందించేందుకు ఇంఫిల్టరేషన్ వెల్స్ లో సుబ్మెర్సిబుల్ పంపులను ఏరాటు చేసి పైప్ లైన్లను నీటిపారుదల శాఖ చేపట్టింది. నీటిపారుదల శాఖ ద్వారా దాదాపు రూ. 50 కోట్ల నిధులతో భక్తులకు ఏర్పాట్లు చేశారు. జంపన్న వాగు పొడుగునా 348 బ్యాటరీ ఆఫ్ ట్యాప్ లను, 119 డ్రస్ చెంగింగ్ రూమ్ లను, జంపన్న వాగులో నీటి మట్టాన్ని ఒకే తీరుగా ఉంచేందుకు 9 క్రాస్ బండ్ లను నిర్మించారు. వీటితోపాటు, జంపన్న ఘాట్ లపై ఉన్న మెట్ల మరమత్తులు, జంపన్న వాగులో జలాలు కలుషితం కాకుండా నిరంతరం క్లోరినేషన్ చేపడుతున్నారు.

అటవీ సంరక్షణకు ప్రత్యేక చర్యలు ... తాడ్వాయి మండలంలో దట్టమైన అడవిలో జరిగే ఈ మేడారం జాతర సందర్భంగా అటవీ సంరక్షణ తోపాటుగా పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర అటవీ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రధానంగా, అటవీ సంపద ధ్వంసం కాకుండా ఉండేందుకు, అటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాణాల నివారణ, దట్టమైన అడవుల గుండా వాహనాల రాకపోకల వేగాన్ని నియంత్రించడం లాంటి పనులను అటవీ శాఖ చేపట్టింది. వీటితోపాటు, ఖాళీగా ఉన్న అటవీ భూములలో పార్కింగ్ సదుపాయాన్ని కూడా కల్పించింది.

నిరంతర విద్యుత్ సరఫరాకు 196 ట్రాన్స్‌ఫార్మర్లు, 67 కి.మీ ఎలక్ట్రిక్ లైను.. మేడారం జాతరలో అత్యంత కీలకమైన విద్యుత్ శాఖ, 24 గంటలూ ఏ ఒక్క నిమిషం కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందుకు గాను 911 ఎలక్ట్రిక్ స్తంబాలు, 196 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి వీటి నిర్వహణకు 350 అదనపు సిబ్బందిని నియమించింది. వీటితోపాటు, 43 పార్కింగ్ ప్రాంతాలలో కూడా విద్యుత్ సౌకర్యం కల్పించింది. ఇప్పటికే, జాతర ప్రాంతంలో ఉన్న 11 కేవీ, 33 కేవీ సబ్ స్టేషన్ లను సిద్ధం చేసింది. భక్తుల రక్షణ చర్యల్లో భాగంగా, 11 కేవీ, 33 కేవీ లైన్లు క్రాస్ అయ్యే జంపన్న వాగు వద్ద ఆరు గస్తీ టవర్లను ఏర్పాటుచేశారు. 50 ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఎమర్జెన్సీ బృందాలను నియమించారు. తాడ్వాయి, పస్రా మార్గంలో పెట్రోలింగ్ టీమ్ లను కూడా నియమించారు నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లకు ఒక బృందం చొప్పున(ఏఈ, ముగ్గురు ఆపరేషన్ సిబ్బంది) పర్యవేక్షించనుంది. 33 కేవీ లైన్స్ పర్యవేక్షణకు తాడ్వాయి, పస్రా, గోవిందరావుపేట, చెల్పూర్, ఏటూరునాగారం, కమలాపూర్, ములుగు సబ్‌స్టేషన్‌ల పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని, ఇవే ప్రాంతాల్లోని ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్‌ల వద్ద విద్యుత్ సరఫరా పర్యవేక్షించేందుకు 20 మంది ఇంజనీర్లు, ఆపరేషన్ సిబ్బందిని ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు.. అత్యవసర పనుల కోసం సామగ్రిని తరలించేందు కు 30 వాహనాలను కేటాయించారు

# ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు డాక్టర్లతో సమావేశం

- సమీకృత జిల్లా అధికారుల సముదాయం (IDOC), కామారెడ్డిలో
- జిల్లా కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్ ఆశిష్ సంగ్వాన్, ఐఏఎస్ అధ్యక్షతన శనివారం క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్
- 2010 అమలుపై ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు డాక్టర్లతో సమావేశం నిర్వహించబడింది.



**కామారెడ్డి జనవరి24( సమయ్దం న్యూస్) :** ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు తప్పనిసరిగా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ -- 2010 ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేయకుండా నిర్వహిస్తున్న ఆసుపత్రులపై ఫైన్, పెనాల్టీలు విధిస్తూ నోటీసులు జారీ చేయాలని డీఎంహెచ ఆదేశించారు. అలాగే అన్‌రిజిస్టర్డ్ ఆసుపత్రుల నివేదికలను డీఆర కమిటీకి సమర్పించి, జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ ఆమోదం మేరకు చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది ఆసుపత్రికి వచ్చిన రోగుల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని, రోగులకు సరైన చికిత్స అందించాలని సూచించారు. రోగుల నుంచి వసూలు చేసే ఫీజులు రిజిస్ట్రేషన్ సమయంలో డీఆర కమిటీకి సమర్పించిన ప్రైస్ లిస్ట్ , ప్రొసీజర్ల ప్రకా రమే వసూలు చేయాలని ఆదేశించారు. అనుమతి పొందిన ఆసుపత్రుల్లో డాక్టర్లు లేదా సిబ్బంది మార్పులు జరిగితే వాటిని తప్పనిసరిగా జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీకి తెలియజేయాలని తెలిపారు. అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ, సమాజంలో డాక్టర్లకు ఉన్న గౌరవాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని, మానవతా దృక్పథంతో రోగులకు సేవలందించాలని, ఫీజుల విషయంలో స్పష్టత పాటించాలని సూచించారు. డాక్టర్లకు ఏవైనా సమస్యలు ఉంటే ఐఎంఏ అసోసియేషన్ ద్వారా జిల్లా కలెక్టర్‌కు ప్రతినిధిత్వం అందించవచ్చని తెలిపారు. డీఎంహెచ డాక్టర్ విద్యా మేడం మాట్లాడుతూ, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ -- 2010 ప్రకారం నిబంధనలు ఉల్లంఘించిన ఆసుపత్రులపై రూ. 50,000 నుండి రూ. 5 లక్షల వరకు జరిమానా విధించడంతో పాటు, అవసరమైతే సీజ్ చేయడం, క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రతినెల డీఎంహెచ కార్యాలయానికి స్కానింగ్ రిపోర్టులు, సి-సెక్షన్ రిపోర్టులు, అబార్షన్ రిపోర్టులు తదితర అవసరమైన నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో కొన్ని ఆసుపత్రుల యాజమాన్యాలు, తామే రిపోర్టర్లమని చెప్పుకొని పత్రికలు, యూ ట్యూబ్ చానళ్ల పేరుతో కొందరు ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ఏ ఆసుపత్రికి సంబంధించిన విషయాలు ప్రచురించే ముందు ఆసుపత్రి యాజమాన్యం లేదా డాక్టర్ల వివ రణ తీసుకున్న తర్వాతే ప్రచురించాలని కోరారు. ఈ సమావేశంలో శిరీష (పీఓ--డీఆర ), డాక్టర్ వెంకట్ స్వామి, డెమో వేణుగోపాల్, చలపతి (హెచ్ఓ) తదితర అధికారులు, ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు డాక్టర్లు పాల్గొన్నారు.

# కామారెడ్డి అభివృద్ధియే నా ధ్యేయం

- రూ. 65.80 కోట్లతో అమృత్ 2.0 పనులకు షబ్బీర్ అలీ శంకుస్థాపన



**కామారెడ్డి జనవరి24( సమయం న్యూస్) :** కామారెడ్డి పట్టణ ప్రజల తాగునీటి కష్టాలను తీర్చి, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు.

కామారెడ్డి పట్టణంలో శనివారం అమృత్ 2.0 (AMRUT 2.0) పథకం కింద రూ. 65 కోట్ల 80 లక్షల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. తాగునీటి సౌకర్యం కోసం భారీ కేటాయింపులుపట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పెరిగిన జనాభాకు అనుగుణంగా తాగునీటి సరఫరాను మెరుగుపరిచేందుకు నాలుగు నూతన భారీ వాటర్ ట్యాంకుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇస్లాంపుర కాలనీ: 5 లక్షల లీటర్ల సామర్థ్యం (రూ. 1.02 కోట్లు)లిటిల్ స్కాలర్ స్కూల్ ప్రాంతం: 5 లక్షల లీటర్ల సామర్థ్యం (రూ. 1.03 కోట్లు)గ్రీన్ సిటీ కాలనీ: 5 లక్షల లీటర్ల సామర్థ్యం (రూ. 1.02 కోట్లు)డ్రైవర్స్ కాలనీ: 5 లక్షల లీటర్ల సామర్థ్యం (రూ. 1.02 కోట్లు)వీటితో పాటు పట్టణంలోని వికాస్ నగర్ , లింగాపూర్ వార్డులలో సిసి రోడ్ల నిర్మాణ పనులను కూడా ఆయన ప్రారంభించారు.

అభివృద్ధే చరిత్రలో నిలుస్తుంది: షబ్బీర్ అలీ ...ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో షబ్బీర్ అలీ మాట్లాడుతూ ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయి.. మనుషులు కూడా శాశ్వతం కాదు. కానీ మనం చేసే అభివృద్ధి పనులు మాత్రమే కలకాలం నిలిచిపోతాయి. ప్రజల అవసరాలను గుర్తించి పని చేసినప్పుడే మన పేరు చరిత్ర పుటల్లో నిలుస్తుంది. రాజకీయం అనేది నీతిగా, నిజాయితీగా ఉండాలని, ప్రజల గుండెల్లో చోటు సంపాదించుకోవడమే అసలైన విజయమని ఆయన పేర్కొన్నారు. నేను ఎప్పుడూ కుల మత రాజకీయాలకు దూరంగా ఉంటాను. అభివృద్ధి విషయంలో వివక్షకు తావు లేదు. అందరికీ సమానమైన ఫలాలు అందాలన్నదే నా ఆకాంక్ష" అని స్పష్టం చేశారు. అభివృద్ధే నా గుర్తింపు: కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని, కేవలం మాటలతో కాకుండా పనులతోనే ప్రజల మెప్పు పొందుతానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు పెద్ద సంఖ్యలో పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత పై విద్యార్థులతో మానవహారం



**నారాయణపేట, జనవరి,24(సమయం న్యూస్) :** రోడ్డు భద్రత మహోత్సవాలు, Arrive Alive కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా నారాయణపేట జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తాలో విస్తృతంగా మానవహారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నారాయణపేట ఎస్పై వెంకటేశ్వర్లు, ఆర్టీసీ డీఎం లావణ్య, ఆర్టీసీ డ్రైవర్లు, పోలీసులు విద్యార్థులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులు, డ్రైవర్లు, ప్రజలకు అవగాహన కల్పించే విధానంగా 'ట్రాఫిక్ రూల్స్ పాటిధం రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం' నినాదంతో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ...రోడ్డు ప్రమాదాలు నివారించడానికి వాహనదారులు హెల్మెట్, సీటుబెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలని, మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదని, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ట్రాఫిక్ సిగ్నల్స్, జీబ్రా క్రాసింగ్, లైన్ డిసిప్లిన్ పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని సూచించారు. అలాగే పాఠశాల, కళాశాల విద్యార్థులు రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని, వారు తమ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు కూడా ఈ నియమాల ప్రాముఖ్యతను తెలియజేయాలని అధికారులు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తేనే రోడ్డు ప్రమాదాలను నివారించి, ప్రాణాలను కాపాడుకోవచ్చని అన్నారు. ఈ సందర్భంగా వాహనదారులు, డ్రైవర్లు, ప్రజలు రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించి, Arrive Alive అంటే ఇంటి నుండి సురక్షితంగా వెళ్లి, సురక్షితంగా తిరిగి ఇంటికి చేరుకోవడమేనని స్పష్టం చేశారు.

# స్టడీ సర్కిల్ లో పోటీ పరీక్షల ఉచిత శిక్షణ కు ధరకాస్తుల ఆహ్వానం అదనపు కలెక్టర్

- ఈ నెల 30 లోగా దరఖాస్తు చేసుకోవాలి
- జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎం. నగేష్



**- మెదక్ జనవరి 24( సమయం న్యూస్). :** మెదక్: గ్రూప్ 1,2,3,4, ఆర్ ఆర్ బి, ఎస , కానిస్టేబుల్, ఎస్ ఎస్ సి తదితర పోటీ పరీక్షలకు స్థానిక టీజీ ఎస్సీ స్టడీ సర్కిల్లో ఫౌండేషన్ కోర్సు ద్వారా 5 నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎం నగేష్ తెలిపారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి సింధు , స్టడీ సర్కిల్ డైరెక్టర్ బి. శ్రీకాంత్ లతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు . ఈ నెల 30 వ తేదీ వరకు దరఖాస్తు లను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లా లోని డిగ్రీ పూర్తి చేసి 3 లక్షల లోపు ఆదాయం కలిగిన ఎస్సీ బీసీ, ఎస్టీ అభ్యర్థులు ఆన్లైన్ లో ఁర్‌బుుఎఎెవతీఎశ్రీవ. ఎశీ.ఱఅ లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఫిబ్రవరి 8 న సిద్దిపేట ప్రతిభ డిగ్రీ కళాశాలలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఎంట్రన్స్ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ఎంట్రన్స్ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా , మెరిట్ ఆదరంగా ఎస్సీలకు 75, బీసీ లకు 15 , ఎస్టీ లకు 10 శాతం సీట్లు కేటాయిస్తారని చెప్పారు ఇందులో ఫిజికల్ హ్యాండీక్యాప్ అభ్యర్థులకు 5, మహిళా అభ్యర్థులకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తారని చెప్పారు 100 మంది అభ్యర్థులను ఎంపిక చేసి 5 నెలల పాటు ఉచిత రెసిడెన్షియల్ తో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

# చేనేత కార్మికులకు రుణ మాఫీ

- జిల్లా కలెక్టర్ కే హైమావతి

**సిద్ధిపేట జనవరి24( సమయం న్యూస్) :** చేనేత కార్మికులు వారి వృత్తికి సంబంధించి మూలదనం నిమిత్తం వివిధ బ్యాంకుల ద్వారా 1 ఏప్రిల్ 2017 నుండి 31మర్చి 2024 వరకు తీసుకున్న ఋణాలని రాష్ట్ర ప్రభుత్వం చేనేత ఋణ మాఫీ పథకం ద్వారా చేనేత కార్మికుల రుణాలను మాఫీ చేసింది. ఈ పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధిపేట జిల్లాలో మొత్తం (7) మంది చేనేత కార్మికులకు రూ 5.00 లక్షల రూపాయలు నిధులు విడుదల చేసి చేనేత కార్మికుల ఖాతాలలో జమ చేయడం జరిగిందని చేనేత మరియు జౌలి శాఖ జిల్లా సహాయ సంచాలకుఎం. సాగర్ ఒక ప్రకటనలో తెలిపారు.

# జనాభా దామాషా బట్టి ముస్లిం మైనార్టీలకు తగిన సీట్లు కేటాయించాలి

- ముస్లిం ఐక్య సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుమౌలానా షేక్. ముజాహిద్



**ఖమ్మం ,జనవరి 24 :( సమయం న్యూస్ ) :** త్వరలో జరగనున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో జనాభా దామాషాను అనుసరించి ముస్లిం మైనార్టీలకు తగిన సీట్లు కేటాయించాలని ముస్లిం ఐక్య సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా షేక్. ముజాహిద్ వివిధ పార్టీల నేతల కు విజ్ఞప్తి చేశారు. శనివారం మధిర లో జరిగిన ముఖ్యమైన నాయకుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మున్సిపల్ కౌన్సిలర్ , మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ గా ముస్లిం మైనార్టీలకు సముచిత ప్రాధాన్యత కల్పించడమే కాకుండా చైర్మన్ లుగా , మేయర్లుగా కూడా అవకాశం కల్పించేందుకు ఆయా పార్టీల నాయకులు ముందుకు రావాలని కోరారు. ముస్లిం మైనార్టీలకు సామాజిక న్యాయం , సాధికారత లభించాలంటే వారి ప్రాతినిధ్యం పట్ల ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ముస్లిం ఐక్య సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ . హుస్సేన్ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్. మహమ్మద్ గౌసుద్దీన్ లు మాట్లాడుతూ రాష్ట్రంలోముస్లిం మైనార్టీలు 14% గా ఉన్నారని , కొన్ని జిల్లాలలో ఎక్కువగా మరికొన్ని జిల్లాలలో తక్కువగా ఉన్న ముస్లింలకు అక్కడక్కడ వారి జనాభా దామాషాను బట్టి తగిన సీట్లు ఇచ్చి , పార్టీల నాయకులు ప్రోత్సాహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం ఐక్య సంఘం తెలంగాణ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముంబై మారథాన్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన డీఎస్పీ మహేష్

● అభినందించిన: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS



**నారాయణపేట, జనవరి,24(సమయం న్యూస్):** ముంబై మారథాన్--2026లో నారాయణపేట జిల్లా నుండి డిసిఆర్బి డీఎస్పీ మహేష్ పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. టాటా ముంబై మారథాన్ (42.197 కిలోమీటర్లు) లాంగ్ రన్‌లో పాల్గొన్న ఆయన, 5 గంటల 21 నిమిషాలు 30 సెకండ్లు అనే ఉత్తమ టైమింగ్‌తో మారథాన్‌ను విజయవంతంగా పూర్తి చేసి రెండు మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS మెడల్స్ తో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...పోలీస్ విధులతో పాటు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, పట్టుదలతో క్రీడల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరచడం డీఎస్పీ మహేష్ ప్రత్యేకత అని అన్నారు. ఆయన సాధించిన విజయం యువతకు, పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. నిరంతర సాధనతో క్రీడల్లో ముందుకు సాగుతూ జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చినందుకు డీఎస్పీ మహేష్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆయన సాధించిన ఈ ఘనవిజయం నారాయణపేట జిల్లా పోలీస్ శాఖకు గర్వకారణమని, జిల్లా అధికారులు, పోలీస్ సిబ్బంది, క్రీడాభిమానులు ఆయనను హృదయపూర్వకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని మారథాన్ రన్ లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని ఉన్నత విజయాలు సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ నల్లపు లింగయ్య ముంబై మారథాన్ రెండు మెడల్స్ సాధించిన డీఎస్పీ మహేష్ కు శుభాకాంక్షలు తెలిపారు.

## మున్సిపాలిటీ ఎన్నికలలో బాధ్యత గల వారిని ఎన్నుకోండి.

●పోచారం శ్రీనివాస్ రెడ్డి



**బాన్సువాడ జనవరి 24( సమయం న్యూస్):** బాన్సువాడ పట్టణంలోని 02 మరియు 14 వ వార్డులో పర్యటించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ పోచారం శ్రీనివాసరెడ్డి గారు, రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మెన్ శ్రీ కాసుల బాలరాజు గారు అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో 2 వ వార్డు, 14 వ వార్డు ప్రజలతో గత 5 సంవత్సరాలలో జరిగిన అభివృద్ధి పనులను తెలియచేశారు, రానున్న మున్సిపాలిటి ఎన్నికల్లో బాధ్యతతో పనిచేసే వారిని ఎన్నుకుంటే మన వార్డులు మరింత అభివృద్ధి చేసుకోవచ్చు అని తెలిపారు ఈ కార్యక్రమంలో బాన్సువాడ పట్టణ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## కాంగ్రెస్ పార్టీలో చేరిన రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి విజయకుమార్.




**ముషీరాబాద్, జనవరి 24:** జీఎస్టీ అండ్ కస్టమ్స్ శాఖ రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్.వీ. విజయ్ కుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. గాంధీభవన్ లో జరిగిన కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, సనత్ నగర్ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ కోట నీలిమ, సికింద్రాబాద్ డిసిసి అధ్యక్షుడు దీపక్ జాన్ ల సమక్షంలో తెలంగాణ పిసిసి అధ్యక్షుడు శ్రీ బి.మహేష్ కుమార్ గౌడ్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. విజయకుమార్ మాట్లాడుతూ సికింద్రాబాద్ లోని ఆదయ్య నగర్ లో పుట్టి పెరిగిన తాను ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ ద్వారా కేంద్ర ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ శాఖలో జీఎస్టీ విభాగంలో అసిస్టెంట్ కమిషనర్ గా పనిచేశానని తెలిపారు. ఇటీవల పదవీ విర మణ అనంతరం తాను ఇకపై ప్రజా జీవితంలో కొనసాగాలని నిర్ణయించుకున్నానని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు గత రెండేళ్లుగా రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా ప్రభుత్వం ద్వారా పేద ప్రజల సంక్షేమానికి చేస్తున్న కృషికి ఆకర్షతుడనై తాను కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందన్నారు. పార్టీ ఆదేశాల మేరకు తనకు ఏదైనా బాధ్యత అప్పగిస్తే తనవంతుగా నిజాయితీగా పనిచేస్తానని విజయకుమార్ అన్నారు. బన్సీ లాల్ పేట్ డివిజన్ లోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందర్నీ కలుపుకుపోతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేద ప్రజలకు అందించడానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.

## గణతంత్ర దినోత్సవానికి సాయుధ పోలీసు పరేడ్ రిహార్సల్స్



**నారాయణపేట, జనవరి,24(సమయం న్యూస్):** 26 జనవరి గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నారాయణపేట జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో ఆర్ ఐ నరసింహ ఆధ్వర్యంలో సాయుధ పోలీసు సిబ్బందితో పరేడ్ రిహార్సల్స్ నిర్వహించడం జరిగింది.

ఈ రిహార్సల్స్‌లో పరేడ్ క్రమశిక్షణ, సమన్వయం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను పోలీసు శాఖ పటిష్టంగా చేపడుతోంది. ఈ కార్యక్రమంలో ఆర్ ఎస్సై లు కృష్ణ చైతన్య, శిరీష, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బాలసదన్ కొత్త భవనం ప్రారంభం



**మహబూబ్ నగర్ జనవరి24( సమయం న్యూస్) :** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మెట్టుగడ్డలోని స్టేట్ హోమ్ ప్రాంగణంలో బాలికల కోసం నిర్మించిన కొత్త బాలసదన్ భవనాన్ని శనివారం మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్భిథో కలిసి ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో రూ. 1.34 కోట్ల వ్యయంతో ఈ బాలసదన్ భవనం నిర్మించబడింది. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ, బేటీ బచావో -- బేటీ పడావో పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం పిల్లలకు నాణ్యమైన విద్య, ఆరోగ్య సంరక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు బాలసదన్ ఒక ఇంటిలా మారుతుందని, ఇక్కడ వారికి అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేకంగా బాలికలు పోషకాహార లోపం, రక్తహీనత వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్న డీకే అరుణ, బాలసదన్‌ల ద్వారా వారికి సమతుల్యమైన ఆహారం, ఆరోగ్య పరీక్షలు, విద్య అందిస్తూ భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నామని అన్నారు. మంచి ఇంజనీరింగ్ డిజైన్ తో భవనాన్ని నిర్మించిన జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, ఇంజినీర్లను ఆమె అభినందించారు. బాలసదన్ పరిసరాలను శుభ్రంగా ఉంచి, మొక్కలు నాటి హరితవనం పెంచాలని అధికారులను సూచించారు. అలాగే అనాథ పిల్లల దత్తత ప్రక్రియను సక్రమంగా నిర్వహిస్తూ వారికి కొత్త కుటుంబాలు లభించేలా కృషి చేస్తున్న మహిళా అభిరుధి శిశు సంషేక్మా శాఖా సిబందినీ ఎంపీ గారు ప్రశంసించారు. తల్లిదండ్రులు లేని పిల్లలను గుర్తించి బాలసదన్‌లో చేర్చి, వారికి ఆహారం, ఆరోగ్యం, విద్య అందించి వారి స్వర్ణ భవిష్యత్తుకు బాటలు వేయాలని అధికారులకు సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ మాట్లాడుతూ, బాలసదన్‌లో నివసిస్తున్న అనాథ పిల్లలకు ఎటువంటి లోటు లేకుండా అన్ని విధాలుగా సంరక్షణ అందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా సంక్షేమ అధికారి జరీనా బేగం మాట్లాడుతూ, బాలసదన్‌లో నివసిస్తున్న బాలికలు కొందరు ఇద్దరు తల్లిదండ్రులను కోల్పోయినవారు, మరికొందరు కుటుంబ పరిస్థితులు, నేర నేపథ్యాల కారణంగా అనాథలైనవారు లేదా కుటుంబాలు విడిచిపెట్టిన అర్ధ అనాథలని తెలిపారు. ఈ బాలికలకు కేవలం భోజనం, నివాసం, దుస్తులు మాత్రమే కాకుండా విద్య, వైద్య సదుపాయాలు కూడా అందిస్తున్నామని చెప్పారు. ఈ రోజు జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంపి గారు పిల్లలతో పాటు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్,విద్య ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామచంద్రం TGEWIDC ఈ ఈ రామచంద్రం ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి

● డీఎస్పీ నల్లపు లింగయ్య
● రాబోయే మున్సిపల్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి-డీఎస్పీ




**నారాయణపేట, జనవరి,24(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా పోలీసు అధికారులకు డీఎస్పీ నల్లపు లింగయ్య సబ్ డివిజనల్ పోలీసు కార్యాలయంలో శనివారం పెండింగ్ కేసులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో జరిగే నేరాల నియంత్రణపై దృష్టి సారించాలని అధికారులకు తెలిపారు. పెండింగ్ లో ఉన్న (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులలో గ్రేవ్, నాను గ్రేవ్ కేసుల గురించి సిఐ, ఎస్సైలను అడిగి తెలుసుకొని తగిన సూచనలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతు... గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ఏ విధంగా ఇన్వెస్టిగేషన్ చెయ్యాలి ఏ ఏ అంశాలు క్రోడికరించాలి తదితర అంశాల గురించి వివరిస్తూ. ప్లాన్ ఆఫ్ యాక్షన్, ఎస పి ప్రకారం ఇన్వెస్టిగేషన్ చేసి, కేసులు ఛేదించాలి. కేసుల్లో శిక్షల శాతం పెంచాలి. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలి. పూర్తి పారదర్శకంగా కేసులో ఇన్వెస్టిగేషన్ చేయాలి. కేసు నమోదు నుండి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్నికూలంకషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలి. అక్రమ ఇసుక రవాణా, గంజాయి, గుట్కా, పేకాట పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి సమూలంగా నిర్మూలించాలి. ఫోక్సో, ఎస్సీ ఎస్టీ, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి, 60 రోజుల్లో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలి. ప్రతి అధికారికి పూర్తి ఇన్వెస్టిగేషన్, స్టేషన్ మేనేజ్మెంట్ తెలిసి ఉండాలని, ప్రతిరోజు కేసులను ఆన్లైన్లో నమోదు చేయాలని సూచించారు. కేసులను అన్ని కోణాలలో ఇన్వెస్టిగేషన్ చేసి కేసు ఫైనల్ చేయాలని సూచించారు. లాంగ్ పెండింగ్ కేసులు త్వరగా చేదించాలి, కేసుల చేదనలో అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించాలి, పెరుగుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి చాలెంజిగా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందే విధంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ముందస్తు అవసరమైన బందోబస్తు ఏర్పాట్లను, సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాల పై ప్రత్యేక నిఘా ఉంచాలని, పాత నేరస్తులపై నిఘా ఉంచి రౌడీషీటర్స్ ని బైండోవర్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సీఐలు శివ శంకర్, రామ్ లాల్, సైదులు, భగవంత్ రెడ్డి,ఎస్సైలు వెంకటేశ్వర్లు, రాముడు, రాజు, రాము, బాలరాజు, విజయ్ కుమార్, భాగ్యలక్ష్మి రెడ్డి,ఎస్ ఎం నవీద్, అశోక్ బాబు, గాయత్రి, మహేశ్వరి,రేవతి,స్టేషన్ రైటర్లు తది తరులు పాల్గొన్నారు.

# వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

● జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్.



**నారాయణపేట, జనవరి,24(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లాలో ఈ వేసవి కాలం తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో తాగునీటి వేసవి ప్రణాళిక( స్పెషల్ డ్రైవ్ ) పై డి ఆర్ డి ఓ,డీపివో, మిషన్ భగీరథ అధికారులు, ఎంపీడీవోలు ఎంపీలు ఏఈలతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలోని మండలాలు, గ్రామాల వారిగా తాగునీటి సమస్య ను గుర్తించి, వెంటనే పరిష్కరించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని దామరగిద్ద, మద్దూర్, కొత్తపల్లి, గుండుమల్, కోస్గి, నారాయణపేట, మక్తల్, ఊట్కూర్, నర్వ ,మాగనూరు, కృష్ణ, మరికల్, ధన్వాడ మండలాలలోని గ్రామాలలో బల్క్ నీటి సరఫరా జరుగుతుందా లేదా ? అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏ ఏ గ్రామాలలో తాగునీటి సమస్య ఉందో గుర్తించి వీలైనంత తొందరగా ఆ సమస్యను పరిష్కరించాలన్నారు. మండల స్థాయిలో ఎంపీడీవోలు, మిషన్ భగీరథ ఏ ఈ లతో కమిటీ వేసి వచ్చే నెల 1 నుంచి 20 వరకు ఆయా మండలాల్లోని గ్రామాలలో తాగునీటి సరఫరా సక్రమంగా జరుగుతుందా లేదా అని పరిశీలించాలన్నారు. ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే స్థానికంగా ఉన్న నీటి వనరుల ను వినియోగించుకుని నీటి సరఫరా చేయాలని కలెక్టర్ సూచించారు. మద్దూరు, కొత్తపల్లి, గుండుమల్, కోస్గి మండలాల ఎంపిడివో లు, ఏ ఈలు తాగునీటి సమస్య పరిష్కారానికి కడ నుంచి నిధులు తెచ్చుకోవాలని చెప్పారు. తాగునీటి పైప్ లైన్ ఉన్నా.. కనెక్షన్లు ఇవ్వని ఇళ్ళు ఎన్ని? కనెక్షన్ లు ఉన్నా తాగునీటి సరఫరా జరగని గ్రామాలు ఎన్ని ? పైప్ లైన్ మరమ్మతులు చేయాల్సిన గ్రామాలు, కొత్త పైప్ లైన్ వేయాల్సిన గ్రామాలను గుర్తించి వాటికి భగీరథ ఏఈలతో టెక్నికల్ ఎస్టిమేట్లు వేయించి, గ్రామపంచాయతీ నిధులు, లేదా జనరల్ ఫండ్, ఎస్ ఎఫ్ సి నిధుల ద్వారా ఆయా సమస్యలన్నింటిని పరిష్కరించాలని ఎంపీడీవోలను కలెక్టర్ ఆదేశించారు. ఫిబ్రవరి రెండో వారం లోపు సమస్యలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో వాటిని పరిష్కరించాలన్నారు. ఈ వేసవిలో జిల్లాలోని ఏ ఒక్క గ్రామ పంచాయతీలో తాగునీటి సమస్య ఉందనే ఫిర్యాదులు రావొద్దన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా జరగకపోతే రిజిస్టర్లో నమోదు చేసి జిల్లా పంచాయతీ అధికారికి సమాచారం ఇవ్వాలన్నారు. మిషన్ భగీరథ, ఎంపీడీవో, ఏఈలు, ఎంపీ ఓలు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి ఈ వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఆయన కోరారు. అనంతరం కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన జల శక్తి అభియాన్ అమలు తీరు జిల్లాలో సంతృప్తిగా లేకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అమలు చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇతర జిల్లాలతో పోలిస్తే మన జిల్లా 31 వ చివరి స్థానంలో ఉందని, వచ్చే నెల వరకు జిల్లా ర్యాంకింగ్ పెంచాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, ఎస్ డీ ఎఫ్ పనులు, ఉపాధి హామీ పనులు, నర్సరీలు తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డివో మొగులప్ప, డిపిఓ సుధాకర్ రెడ్డి, మిషన్ భగీరథ ఎస్.ఈ. జగన్ మోహన్, ఈ ఈ లు రంగారావు, శ్రీనివాస్, మిషన్ భగీరథ డి ఈ, ఏఈలు, జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపీఓలు పాల్గొన్నారు.

## షాబాద్ మండల్ తాళ్లపల్లి గ్రామంలో ప్రజా బాట కార్యక్రమం ప్రారంభించారు.



**షాబాద్, జనవరి. 24 (సమయం న్యూస్):** తాళ్లపల్లి ప్రైమరీ స్కూల్లో పిల్లలకు ఎంతో ప్రమాదకరంగా ఉన్నటువంటి "సతీుఅంటశీతీఎవతీ"ను స్కూల్ నుండి తొలగించి రైతులకు అనుకూలంగా పొలాలకు దగ్గరగా వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ స్వాతి మాణిక్యం, గౌడ్ ఉప సర్పంచ్ అక్కముల అంజయ్య, వార్డు సభ్యులు బొబ్బని నవనీత ప్రకాష్ ,వడ్ల మాధవచారి, తమ్మలి జయమ్మ, అదేవిధంగా current department, Ade, సాయినాథ్ ,Ae, G.v.కోటేశ్వరరావు, line inspector line inspector, గోపాలకృష్ణ, గ్రామస్తులు వడ్ల దయాకర్ ,బండ శ్రీను , తమ్మలి Naresh,తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడొద్దు

- పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం
- పాల్గొన్న జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్.



**వికారాబాద్, జనవరి,24(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ జిల్లాలోని శాంతిభద్రతల పరిస్థితిపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలో నమోదైన పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించడమే కాకుండా, బాధితులకు సత్వర న్యాయం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా హత్య లు, దొంగతనాలు వంటి తీవ్రమైన నేరాల్లో దర్యాప్తును వేగవంతం చేయాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని (Technology) పూర్తిస్థాయిలో వినియోగించుకుని పక్కా ఆధారాలతో కోర్టులో చార్జ్ షీట్లు దాఖలు చేయాలని స్పష్టం చేశారు. కన్విక్షన్ రేటు (శిక్షల శాతం) పెంచడం ద్వారానే నేరస్తుల్లో భయం కలుగుతుందని, తద్వారా నేరాలను అదుపు చేయవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రజలు తమ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారితో మర్యాదగా ప్రవర్తించి, వారి ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, అప్పుడే పోలీస్ వ్యవస్థపై సామాన్యులకు నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు. మహిళలు, చిన్నారులు మరియు వృద్ధుల భద్రత విషయంలో అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాత్రి సమయాల్లో పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేయాలని, ప్రధాన కూడళ్లతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా సీసీటీవీ కెమెరాల ఏర్పాటును ప్రోత్సహించాలని సూచించారు. "నేర నివారణలో సీసీ కెమెరాలు మూడవ కన్నులా పనిచేస్తాయని", వాటి నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ క్రైమ్ పట్ల ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలని, అపరిచిత లింకులు మరియు కాల్స్ పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారు, గంజాయి వంటి మాదక ద్రవ్యాల విక్రయదారులపై ఉక్కుపాదం మోపాలని, జిల్లాలో అక్రమ మద్యం రవాణాను పూర్తిగా అరికట్టాలని అధికారులను హెచ్చరించారు. రాబోయే మునిసిపల్ ఎన్నికల దృష్ట్యా పోలీస్ అధికారులు ముందస్తుగా క్షేత్రస్థాయి సమాచారాన్ని సేకరించాలని, ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎస్పీ సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధించి 'బ్లాక్ స్పాట్స్' గుర్తించి, అక్కడ హెచ్చరిక బోర్డులు మరియు రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని రవాణా శాఖతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. విధి నిర్వహణలో ప్రతి అధికారి క్రమశిక్షణ తో,బాధ్యతాయుతంగా పనిచేస్తూ జిల్లాను నేరరహిత జిల్లాగా మార్చడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇట్టి కార్యక్రమం లో జిల్లా అదనపు ఎస్పీ బి. రాములు నాయక్ , డిటిసి డీఎస్పీ శ్రీనివాసులు,డీసీఆర్ బి డీఎస్పీ, జానయ్య, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, తాండూర్ డీఎస్పీ ఎన్. యాదయ్య, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, ఏ.ఆర్ డీఎస్పీ వీరేష్, జిల్లా లోని ఇన్స్పెక్టర్, సర్కిల్ ఇన్స్పెక్టర్, ఎస్సై లు, ఆర్ ఎస్సై లు,, సిబ్బంది, తదితరులు పాల్గొనడం జరిగింది.

# జీహెచ్ఎంసిలో బదిలీ(ల)లు

- బదిలీ ఉత్తర్వులు వెలువడిన కొన్ని గంటల్లోనే మార్పులతో మరో ఉత్తర్వు.

**హైదరాబాద్ 24.01.26(సమయం న్యూస్) :** జీహెచ్ ఎంసిలో బదిలీల ప్రక్రియ అపహాస్యం అవుతుంది. బదిలీ ఉత్తర్వులు వెలువడిన గంటల్లోనే మళ్లీ మార్పులతో కొత్త ఉత్తర్వులను తీసుకొచ్చిన ఘనత జిహెచ్ఎంసి కీ దక్కింది. బడంగ్పేట్ సర్కిల్లో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో అక్కడ పనిచేస్తున్న డిప్యూటీ కమిషనర్ ను కేంద్ర కార్యాలయానికి బదిలీ చేయడం జరిగింది. ఆమె పైన విజిలెన్స్ విచారణ కూడా కొనసాగుతుంది. అయినప్పటికీ బదిలీల్లో మళ్లీ ఆమెను అదే స్థానానికి పంపడంతో తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. ఆమె రాజకీయ జోక్యంతోనే మళ్లీ అదే స్థానంలోకి వచ్చినట్లు తెలుస్తుంది. అదే విధంగా ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ ను యూసఫ్ గూడాకు బదిలీ చేయడం జరిగింది. ఈయన అక్కడ జాయిన్ కాకుండా ఆదిభట్ల మున్సిపల్ కార్యాలయానికి బదిలీ చేయించుకున్నారు. అలాగే పటాన్చెరులో పనిచేస్తున్న డిప్యూటీ కమిషనర్ ను కేంద్ర కార్యాలయానికి బదిలీ చేయగా ఆయన అక్కడ జాయిన్ కాకుండానే ఉత్తర్వులు వచ్చిన గంటలోనే బదిలీ మార్పించుకొని యూసఫ్ గూడా సర్కిల్ కు మార్చుకోవడం జరిగింది. అధికారులు తమకు కేటాయించిన సర్కిల్లో ఎక్కడైనా సరే పని చేయాల్సిన అవసరం ఉంటుంది. కానీ ఇక్కడ అలా కాకుండా శివారు ప్రాంతాల్లో అత్యధిక ఆదాయం వచ్చే సర్కిళ్లను అధికారులు గబ్బిలాల్ల పట్టుకొని వేలాడుతున్నారు. అలాగే పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్ నుంచి డిప్యూటేషన్ పై జిహెచ్ఎంసి లో పనిచేస్తున్న అధికారి అమీన్పూర్ సర్కిల్ కు బదిలీ చేయించుకోవడం జరిగింది. ప్రభుత్వాలు మారిన ఈమె మాత్రం అమీన్పూర్ను వదలకపోవడంలో ఏముందో అందరికీ ప్రత్యక్షంగా అర్థమవుతూనే ఉంది. గతంలో జరిగిన బదిలీలలో ఆల్వాల్ డిసీగా ఉన్న శ్రీనివాసరెడ్డి నీ కావాడిగూడకు బదిలీ చేయగా ఆయన అక్కడ జాయిన్ కాకపోవడంతో ఆ అధికారిని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్ సస్పెండ్ చేయడం జరిగింది. కానీ ఇక్కడ బదిలీ ఉత్తర్వులు వెలువడిన గంటల్లోనే కేంద్ర కార్యాలయంలో జాయిన్ కావాల్సిన అధికారి మరో ఉత్తర్వులు తెప్పించుకొని యూసఫ్ గూడా లో జాయిన్ అయ్యారంటే ఏం జరిగిందనేది అందరికీ అర్థమవుతుంది. ఒక అధికారికి శిక్ష, మరో అధికారిని అందలం ఎక్కించడం ఏంటి అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ఏది ఏమైనాప్పటికీ శుక్రవారం నాడు జరిగిన బదిలీలపై మాత్రం తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి.

# బాలికలను చదవనిద్దాం.. ఎదగనిద్దాం బాలికా సాధికారత సాధిద్దాం

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నారాయణపేట, జనవరి,24(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లాలో బాలికలను చదివించి ఎదగనిచ్చి బాలికా సాధికారత సాధించడం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ,జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా కలెక్టరేట్ లో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సంతకం చేసి మాట్లాడారు. బాలిక విద్యకు ప్రాధాన్యత నిచ్చి వారిని అన్ని విధాలుగా ప్రోత్సహించాలని అన్నారు. ఆడపిల్లల పట్ల వివక్షత లేని సమాజాన్ని నిర్మించాలన్నారు. బాల్య వివాహ రహిత జిల్లాగా నారాయణపేట ను మార్చడానికి ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించి సమూలంగా బాల్య వివాహాలను నిర్మూలించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్/ ఇన్ ఛార్జి జిల్లా సంక్షేమ అధికారి రాజేందర్ గౌడ్, డిఆర్డిఓ మొగులప్ప, డీపీఆర్ వో రషీద్, జిల్లా అధికారులు, ఎంపీడీఓలు , జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ నర్సిములు , జెండర్ స్పెషలిస్టులు అనిత, నరసింహ, ఇన్ ఛార్జి డీసీపీ కరిష్మా , చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ నర్సిములు, తిరుపతయ్య, వెంకట్,సాయి ,మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి బాలికకు సమాన అవకాశాలు, భద్రత, గౌరవం కల్పించడమే మన బాధ్యత



**సమయం న్యూస్ గజ్వేల్ జనవరి 24 :** మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో గజ్వేల్ కస్తూరీభా గాంధీ బాలికల విద్యాలయంలో జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్మన్, జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ దేశబోయిని నర్సింహులు లీగల్ ప్యానల్ అడ్వకేట్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ బాలికా దినోత్సవం ప్రతి సంవత్సరం జనవరి 24న జరుపుకుంటారని,బాలికల హక్కులు, విద్య, ఆరోగ్యం, భద్రతపై అవగాహన కల్పించడం,లింగ పక్షపాతం తొలగించడం, బాలికలకు సమాన అవకాశాలు కల్పించడం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. 2008 జనవరి 24 నుండి ఈ దినోత్సవాన్ని జాతీయ బాలికా దినోత్సవంగా ప్రకటించారని గుర్తు చేశారు. బాల్య వివాహాలు, శిశుహత్యలు, వరకట్నం వంటి సామాజిక సమస్యలను పరిష్కరించేందుకు ఈ దినోత్సవం ఒక వేదికగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమం అనంతరం వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యులు సుదర్శన్ ప్యానెల్ న్యాయవాదులు నర్సింలు, ప్రశాంత్, పారా లీగల్ వాలంటీర్, పోలోజు నరసింహ్మ చారి లీగల్ సర్వీస్ సిబ్బంది, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ అనురాధ, అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# యముడి వేషధారణలో రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన

- టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు
- అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా యముడి వేషధారణతో రోడ్డు భద్రతపై వినూత్న అవగాహన
- నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS సూచనల మేరకు,




**నారాయణపేట, జనవరి,24(సమయం న్యూస్) :** జిల్లా కేంద్రంలో ARRIVE-ALIVE (అరైవ్ అలైవ్) కార్యక్రమంలో భాగంగా నారాయణపేట టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు. ఆధ్వర్యంలో నారాయణపేట పోలీసులు రోడ్డు భద్రతపై వినూత్న అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నియమ నిబంధనలను ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా యముడి వేషధారణలో (హోమ్ గార్డ్ లింగం) కళాత్మక రూపంలో వివరించారు. ముఖ్యంగా హెల్మెట్ ధరించడం, డ్రంక్ అండ్ డ్రైవ్ నివారణ, సీట్ బెల్ట్ వినియోగం, త్రిబుల్ రైడింగ్, డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ వినియోగం,రాష్ డ్రైవింగ్ వంటి అంశాలపై ప్రజలకు స్పష్టమైన సందేశాన్ని అందించారు. రోడ్డు ప్రమాదాలకు ఇవే ప్రధాన కారణాలని, ఒక్క క్షణం నిర్లక్ష్యం ప్రాణాంతకమవుతుందని అవగాహన కల్పించారు. యముడి వేషధారణతో హోమ్ గార్డ్ లింగం నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రజల్లో విశేషంగా ఆకట్టుకోవడంతో, పెద్ద సంఖ్యలో ప్రజలు, వాహనదారులు, యువకులు ఈ కార్యక్రమాన్ని ఆసక్తిగా వీక్షించారు. కళాత్మకంగా, భావోద్వేగంగా అందించిన సందేశం ప్రజల మనసుల్లో బలమైన ప్రభావాన్ని చూపిందని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... అరైవ్ అలైవ్ అంటే ఇంటి నుంచి సురక్షితంగా బయలుదేరి తిరిగి క్షేమంగా ఇంటికి చేరడం. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలు పాటిస్తేనే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుంది. ప్రాణాల విలువను గుర్తించి బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలి" అని సూచించారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట ఎస్సై 2 గాయత్రి ,పోలీసులు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొని ప్రజలకు రోడ్డు భద్రతపై విస్తృతంగా అవగాహన కల్పించారు.

# ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులోకి హైదరాబాదీ అమ్మాయి సృజన !



**హైదరాబాద్, 24 (సమయం న్యూస్) :** నగరానికి చెందిన యువ క్రికెటర్ ఎడ్ల సృజన అరుదైన అవకాశం దక్కించుకుంది. మహిళల ప్రీమియర్ లీగ్ (భ్లూా)లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు ఇప్పటివరకు సపోర్ట్ బౌలర్‌గా ఉన్న సృజన, ఇప్పుడు ఏకంగా ప్రధాన జట్టులోకి ఎంపికైంది. మరో హైదరాబాదీ క్రీడాకారిణి ఎం. మమత గాయపడటంతో, ఆమె స్థానంలో సృజనకు ఈ అవకాశం లభించింది. వడోదరలో జరుగుతున్న ఈ టోర్నీలో మిగిలిన మ్యాచ్‌లకు సృజన జట్టుతో కలిసి ఆడనుంది. ఈ సందర్భంగా సృజన తన ఆనందాన్ని పంచుకుంటూ.. "ఇది ఒక ఊహించని పెద్ద సర్ప్రైజ్. ఇప్పటివరకు సపోర్ట్ బౌలర్‌గా జట్టుతో ఉండటమే గొప్ప విషయంగా భావించాను. ఇప్పుడు ప్రధాన జట్టులో అవకాశం రావడం ఒక సవాల్‌తో కూడుకున్న బాధ్యత. నాకు అవకాశం వచ్చినప్పుడు ఖచ్చితంగా రాణించి, అందరి నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను" అని తెలిపింది.

సృజన ప్రస్థానం – విశేషాలు,,,20 ఏళ్ల సృజన మీడియం పేస్ బౌలర్. తక్కువ పరుగులిస్తూ వికెట్లు తీయడం (ఎకానమీ రేట్) ఈమె ప్రత్యేకత. వివిఎస్ లక్ష్మణ్ వంటి దిగ్గజాలను అందించిన సికింద్రాబాద్‌లోని ప్రఖ్యాత సెయింట్ జాన్స్ కోచింగ్ ఫౌండేషన్‌లో ఈమె శిక్షణ పొందింది. వేగంగా బౌలింగ్ చేస్తూనే, ఖచ్చితమైన లైన

# జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా అదేశాలమేరకు

- ఆపరేషన్ స్మైల్ లో భాగంగా ఇటుక బట్టీల యజమానులతో అవగాహన సమావేశం
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న అడిషనల్ ఎస్పీ బి ఆర్ నాయక్



**పరిగి మున్సిపల్(మం)జనవరి,24(సమయం న్యూస్) :** ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు పరిగి సబ్ డివిజన్ పరిధిలోని పరిగి పోలీస్ స్టేషన్‌లో శనివారం ఇటుక బట్టీల యజమానులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మైనర్ బాలబాలికలను పనిలో పెట్టుకోవడం వల్ల కలిగే నష్టాలు, చట్టపరమైన చర్యలు, బాలల హక్కుల పరిరక్షణ అంశాలపై పోలీస్ అధికారులు యజమానులకు అవగాహన కల్పించారు. బాల కార్మిక వ్యవస్థ సమాజంపై కలిగించే దుష్పరిణామాలను వివరించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ ఎస్పీ బి ఆర్ నాయక్ మాట్లాడుతూ, బాలలను పనిలో పెట్టుకోవడం నేరమని, అటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పిల్లల భవిష్యత్తును కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. అలాగే పరిగి ఎస్‌డీపీఓ,పరిగి సీఐ, కొడంగల్ సీఐ శ్రీధర్ రెడ్డితో పాటు ఇతర పోలీస్ అధికారులు పాల్గొని తమ తమ సందేశాలను అందించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారులు బాలల సంరక్షణకు సంబంధించిన చట్టాలు, సహాయ సేవలపై వివరించారు. బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు ఇటుక బట్టి యజమానులు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఇటువంటి సమావేశాలు సమాజంలో మార్పుకు దోహదపడతాయని తెలిపారు.

# "నెక్స్ట్‌జెన్ AI గ్రోత్" శిక్షణా కార్యక్రమం విజయవంతం



**హైదరాబాద్, జనవరి 24 :** రియల్ ఎస్టేట్ రంగంలో ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించేందుకు ఉద్దేశించిన "నెక్స్ట్‌జెన్ గ్రోత్ ఫర్ ప్రాప్‌టెక్ ఒ రియల్ ఎస్టేట్" శిక్షణా కార్యక్రమం హైదరాబాద్‌లోని టి-హబ్‌లో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన సుమారు 250 మంది స్వతంత్ర ఛానల్ పార్ట్‌నర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ శిక్షణలో AI ఆధారిత సేల్స్, డిజిటల్ మార్కెటింగ్ ద్వారా లీడ్స్ పెంపు, కస్టమర్ ట్రస్ట్ బిల్డింగ్, సైట్ విజిట్ కన్వర్షన్ మెరుగుదల వంటి అంశాలపై ప్రాక్టికల్ అవగాహన కల్పించారు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ డాక్యుమెంటేషన్ స్పష్టత, అప్రూవల్స్ వెరిఫికేషన్, ఖర్చుల విభజన వివరాలను స్పష్టంగా చూపించే "ప్రూఫ్ -- ప్రెజెన్స్ -- ప్రాసెస్" ఫ్రేమ్‌వర్క్ ను ప్రత్యేకంగా పరిచయం చేశారు. అలాగే AI టూల్స్ సహాయంతో రీల్స్ స్క్రిప్ట్స్, పోస్టర్ కంటెంట్, అడ్స్ కాపీ, ఫాలో-అప్ మెసేజెస్ వేగంగా రూపొందించే విధానాలను లైవ్ డెమో ద్వారా వివరించారు. ఈ కార్యక్రమానికి లీడ్ ట్రైనర్‌గా నికీలు గుండా శిక్షణ అందించి, పాల్గొన్నవారికి ప్రాక్టికల్ మార్గదర్శనం చేశారు. ఈ ఈవెంట్‌కు శ్రీ సిద్ధి వినాయక ప్రాపర్టీ డెవలపర్స్ ఛైర్మన్ ఒ డైరెక్టర్ కసర్ల మహేందర్ రెడ్డి నేతృత్వంలో మద్దతు లభించింది. సంస్థ డైరెక్టర్ గుర్రం రఘుమా రెడ్డి తో పాటు టీమ్ సభ్యులు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. రియల్ ఎస్టేట్ రంగంలోAI వినియోగాన్ని అమలు స్థాయిలో నేర్పిన ప్రత్యేక కార్యక్రమంగా నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమం చివర్లో పాల్గొన్న ఛానల్ పార్ట్‌నర్లకు రోజువారీ అమలు చేయగల 90 రోజుల యాక్షన్ ప్లాన్ అందించి శిక్షణను ముగించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన వసతులు

- ఎమ్మెల్యే బి. మనోహర్ రెడ్డి



**యాలాల మండలం,జనవరి,24(సమయం న్యూస్) :** ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన వసతులు ఉంటాయని, విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. శనివారం యాలాల మండల పరిధిలోని పగిడియాల ఉన్నత పాఠశాలల్లో కొత్తగా నిర్మించిన స్టేజి ప్రాంతాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటో వసతులు, బోదనా సిబ్బంది ఉన్నారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో కాకుండా ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని సూచించారు. పూర్వ విద్యార్థులు చందాలు వేసుకొని స్టేజి నిర్మాణ పనులను చేపట్టగా, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సైతం తన తరపున ఆర్థిక సాయం అందించారని ఈ సందర్భంగా పలువురు తెలిపారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతను ఎమ్మెల్యే తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ సురేందర్ రెడ్డి,పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి,సర్పంచ్ రిశీత,తదితరులు ఉన్నారు.

# నేడు ప్రశ్నించడమే నేరం

● హెచ్ సి యు ప్రొఫెసర్ కె. లక్ష్మీనారాయణ



**ఖమ్మం ,జనవరి 24 : ( సమయం న్యూస్ ) :** ఫాసిజపు చత్రచాయలో ఒక వ్యవస్థ ను తీసుకొచ్చేముందు తొలుత భావజాలంపై దాడి ప్రారంభిస్తారని, ప్రస్తుతం ఆ పోకడలు విస్పష్టంగా కనిపిస్తున్నాయని ... అందుకే నేడు ప్రశ్నించడమే నేరంగా మారిందని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ( హెచ్ సి యు )ప్రొఫెసర్ కె. లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో ప్రారంభమైన పి డి ఎస్ యు తెలంగాణ రాష్ట్ర 2 3 వమహాసభ రెండవ రోజు శనివారం జరిగిన ప్రతినిధుల సభలో ఆయన తొలిత ప్రసంగించారు. ప్రస్తుత దేశ కాలమాన పరిస్థితులకు అధ్యయనం చేయాల్సిన అవసరం, ఆవశ్యకత నేటితరం గుర్తించాల్సిన గురుతర బాధ్యత ఎంతోఉందన్నారు. మనలాంటి వారికి మన భావజాలం మీద దెబ్బతీసేందుకు మనలను అర్బన్ నక్సలైట్లుగా చిత్రీకరిస్తున్నారని తెలిపారు. ఇదే ఫాసిజంకు ఆనవాళ్ళని స్పష్టం చేశారు. టి పి టి ఎఫ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి వి. మనోహర్ రాజు మాట్లాడుతూ ఈ సభలో సీరియస్ అంశాలను ఇంతకుముందు మాట్లాడిన వక్తలు ప్రస్తావించారని , అందులో మన భవిష్యత్తు తో పాటు మన ముందు తరాల భవిష్యత్తు కూడా అంధకార బంధురంగా ఉంటుందని హెచ్చరికలు చేశారనిగుర్తు చేస్తూ దీనిపై మేధోమధనం చేయాలని పిలుపు నిచ్చారు. చరిత్రలో ఎన్నో పోరాటాలు జరిగిన తీరును గమనిస్తేఅందులో విద్యార్థుల భాగస్వామ్యం ఎంతటి మహత్తర పాత్రను పోషించిందో తెలుస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర 23వపి డి ఎస్ యు రాష్ట్ర మహాసభ చారిత్రక నేపథ్యాన్ని , ఔనత్యాన్నిపరిగణలో తీసుకొని సీరియస్ గా మన బాధ్యతను, మన కర్తవ్యాన్నినెరవేర్చు దిశలో సాగాలని పిలుపునిచ్చారు. ప్రముఖ విద్యావేత్త ఐ వి.రమణా రావు తన ప్రసం గంలో వివిధ చారిత్రాత్మక పోరాటాలలో విద్యార్థుల ప్రాతినిధ్యం , పోరాటం , ఫలితాలు గురించి చెప్పిన విషయాలను నేటి విద్యార్థులు గమనంలో తీసుకోవాలని హితవు పలికారు.

## నిరుపేదలకు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ ఒక వరం లాంటిది.

● పేదింటి ఆడబిడ్డలకు వరప్రదాయిని కళ్యాణ లక్ష్మీ పథకం:- చేవెళ్ల ఎమ్మెల్యే "కాలే యాదయ్య.



**చేవెళ్ల ,షాబాద్, జనవరి. 24 (సమయం న్యూస్) :** ఈరోజు చేవెళ్ల శాసనసభ్యులు "కాలే యాదయ్య" రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి ,తో కలిసి మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో మండలానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన రూ. 46,05,336/- (రూపాయలు నలబైఆరులక్షల ఐదువేల మూడువందలముప్పైఆరు) విలువ గల 46 కళ్యాణ లక్ష్మీ / షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వంలో బడుగు బలహీన వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. పేద ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేస్తుందని తెలిపారు. అనంతరం షాబాద్ మండలం చందనవెల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే గారు ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మాజీప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పేట జిల్లాలో సోషల్ ఎకనామిక్ అండ్ డెవలప్మెంట్ స్కీం సర్వే



**నారాయణపేట, జనవరి,24(సమయం న్యూస్) :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదా అని నారాయణ పేట జిల్లాలో ఆల్ ఇండియా సర్వీసెస్ మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీసెస్ విలేజ్ విసిట్ ప్రోగ్రాం ద్వారా సోషల్ ఎకనామిక్ అండ్ డెవలప్మెంట్ స్కీం సర్వే నిర్వహిస్తారని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. శనివారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలో ఎంపిక చేసిన 4 పంచాయతీలకు ఆల్ ఇండియా సర్వీసెస్ మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీసెస్ బృందం వెళ్ళి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు ప్రజలకు చేరుతున్నాయా అని సర్వే చేస్తారని ఆమె చెప్పారు. ఈ నెల 24 నుంచి జిల్లాలోని ఉట్కూర్, దామరగిద్ద మండల కేంద్రంలో, నారాయణపేట మండలం సింగారం గ్రామంలో, మద్దూరు మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామపంచాయతీలలో సర్వే చేస్తారని, అలాగే 29 నుండి 31 వ తేదీ వరకు నారాయణపేట మున్సిపాలిటీలోని నాలుగు వార్డులలో సర్వే చేయనున్నారు. ఆల్ ఇండియా సర్వీసెస్ వారు ప్రతి గ్రామానికి, వార్డులకు నలుగురు చొప్పున వెళ్లి సర్వే నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి నోడల్ అధికారిగా డిఆర్డిఓ మొగులప్ప వ్యవహరించనున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హనుమంతు, ఉమ్మడి జిల్లా ట్రైనింగ్ మేనేజర్, ఆల్ ఇండియా సర్వీసెస్ అభ్యర్థులు పాల్గొన్నారు.

# ఘనంగా 'జాతీయ బాలికల దినోత్సవం'

● బాలికలు అన్ని రంగాల్లో రాణించి సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి:

● స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేందర్ గౌడ్



**నారాయణపేట, జనవరి,24(సమయం న్యూస్) :** మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈ వేడుకలు జరిగాయి. విద్యార్థినులకు గుంజాన్ సక్సేనా అనే సినిమా ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ బాలికల సాధికారత గురించి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకోవడం చట్టరీత్యా నేరమని, దీనివల్ల ఆరోగ్యపరంగా తీవ్ర నష్టాలు కలుగుతాయని హెచ్చరించారు. సరిగ్గా చదువుకోకపోతే తల్లిదండ్రులు పెళ్లి చేసే అవకాశం ఉంటుందని, కాబట్టి బాలికలు చదువుపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతి బాలిక ఆత్మరక్షణ విద్యలను నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. చదువు ద్వారానే ఉన్నత రంగాలలో ఎదగవచ్చని ఆకాంక్షించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ యాదమ్మ , సీడీపీఓ సరోజినీ మాట్లాడుతూ బాలికలు సమాజంలో అందరితో సమానంగా ఉండాలని, తమలోని అంతర్లీన శక్తిని గుర్తించి ముందడుగు వేయాలన్నారు. ప్రభుత్వాలు కల్పించిన అవకాశాలు వినియోగించుకొని, మన ప్రతిభతో గుర్తింపు పొందాలన్నారు. అన్ని రంగాల్లో అమ్మాయిలు రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాటకాలు, నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలను అద్దం పట్టేలా నాటకం ద్వారా అవగాహన కల్పించారు. మరియు విద్యలో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేందర్ గౌడ్,గురుకుల ప్రిన్సిపాల్ యాదమ్మ సీడీపీఓ సరోజినీ , జిల్లా మిషన్ కోఆర్డినేటర్ నర్సిములు,జెండర్ స్పెషలిస్ట్లు అనిత ,నర్సిములు, భారతి, సూపర్వైజర్లు రూప,సరోజ, అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రాణాలు కాపాడుకోవాలి

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్, జనవరి 24( సమయం న్యూస్) :**37వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని, 'ARRIVE - ALIVE" అవగాహనా కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ ఆధ్వర్యంలో శనివారం నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.

హెల్మెట్ ధారణ ప్రాణరక్ష - కలెక్టర్ పమేలా సత్పతిఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గౌరవ డీజీపీ గారు ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ARRIVE - ALIVE' కార్యక్రమం జిల్లాలో పకడ్బందీగా అమలు అవుతోందని తెలిపారు. ప్రపంచంలోనే అత్యధికంగా మన దేశంలో 22 కోట్ల 10 లక్షల బైక్‌లు ఉన్నాయని, ప్రమాదాలు జరిగినప్పుడు తలకి గాయం కాకుండా ఉంటే ప్రాణాపాయం తప్పుతుందని గుర్తుచేశారు. వాహనదారులు వ్యక్తిగత భద్రత పాటిస్తూనే, ఇతరులను కూడా చైతన్యపరచాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో పాల్గొన్న వారికి పోలీస్ శాఖ తరపున హెల్మెట్లను పంపిణీ చేశారు.

90 శాతం ప్రమాదాలను నివారించవచ్చు - సీపీ గౌష్ ఆలం...కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ గతేడాది గణాంకాలను వివరించారు. గత ఏడాది కమిషనరేట్ వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో 200 మంది మరణించగా, అందులో 40 శాతం (80 మంది) టూ వీలర్ వాహనదారులే. మరణించిన వారిలో 90 శాతం మంది హెల్మెట్ ధరించకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు భద్రతా నియమాలను తూచా తప్పకుండా పాటిస్తే 90 శాతం ప్రమాదాలను నివారించవచ్చని, ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కొనసాగిన ర్యాలీ మార్గం:పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ.. బస్ స్టేషన్, ప్రతిమ మల్టీప్లెక్స్, గీతాభవన్ చౌరస్తా, మంకమ్మతోట, శివ థియేటర్ సర్కిల్, కెమిస్ట్ భవన్, కోర్ట్ చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, గాంధీ చౌరస్తా, కమాన్ చౌరస్తా మీదుగా సాగి తిరిగి పరేడ్ గ్రౌండ్‌లో ముగిసింది. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ సోహం, అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీంరావు, ఏసీపీలు వెంకటస్వామి, యాదగిరిస్వామి, ఇన్స్పెక్టర్లు రాంచందర్ రావు, సృజన్ రెడ్డి, తిరుమల్ మరియు పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు అందేలా కృషి.

● జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

● పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రత్యేక తరగతుల నిర్వహణ

● సుల్తానాబాద్ మండలంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్

**సుల్తానాబాద్, జనవరి- 24:( సమయం న్యూస్) :** ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు అందెలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సుల్తానాబాద్ మండలంలోని పూసాల లోని ఎంపిపిఎస్, పల్లె దవాఖానా ,భూపతి పూర్ లోని కేజీబీవీ, బీసీ బాలుర గురుకుల పాఠశాల, సుల్తానాబాద్ లోని అంబేద్కర్ చౌరస్తా, గర్రెపల్లి లోని ఎస్సీ రెసిడెన్షియల్ కళాశాలలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, భూపతి పూర్ కేజీబీవీ లోని 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహించి ప్రతి ఒక్కరికి 90 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కేజీబీవీ కాంపౌండ్ వాల్, మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని అన్నారు. పూసాల ఎంపీపీఎస్ పాఠశాలలో ప్రాథమిక విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ పంపిణీ చేశారు. ప్రాథమిక విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. ఎఫ్.ఆర్.ఎస్ విధానం ద్వారా హాజరు నమోదు చేయాలని అన్నారు. పాఠశాలలో ఎఫ్. ఎల్. ఎన్ అమలు పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

గర్రెపల్లి లోని ఎస్సీ రెసిడెన్షియల్ కళాశాలలో జరుగుతున్న పర్యావరణ పరీక్షను కలెక్టర్ పరిశీలించారు. కళాశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించాలని, రాబోయే పబ్లిక్ పరీక్షలలో మెరుగైన ఫలితాలు సాధించే విధంగా రెగ్యులర్ స్టడీ అవర్స్ నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. సుల్తానాబాద్ లోనే అంబేద్కర్ చౌరస్తా నుంచి గట్టెపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. రోడ్డు విస్తరణ పనులు సజావుగా నిర్వహించాలని, విస్తరణ లో భాగంగా ఇండ్లు కోల్పోయిన ప్రజలను తరలించి పాత ఇండ్ల కూల్చివేత పనులు రెండు రోజులలో పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. సుల్తానాబాద్ ఆసుపత్రి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి అవసరమైన నిధులకు ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సుల్తానాబాద్ తాహసిల్దార్ బషీరుద్దీన్, మున్సిపల్ కమిషనర్ రమేష్, ఎం.పీ.ఓ. సమ్మిరెడ్డి, ఆర్‌డబీ డీఈ రవి కిరణ్, ఏఈ గుణ శేఖర్ రెడ్డి,కేజీబీవి ఎస్.ఓ స్వప్న , ఏఈపిఆర్ ,బీసీ రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గోన్నారు.



## ప్రతీ కుటుంబానికి ఆడపిల్ల ఒక గిఫ్ట్ లాంటిది

● బాలికల హక్కులను పరిరక్షించాలి .. ఉజ్వలతో బాలికల అభ్యున్నతికి కృషి

● జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగాం జనవరి 24( సమయం న్యూస్):** ఆడపిల్ల ఉన్న ప్రతీ ఇల్లు ఎప్పుడు సంతోషకరం గా ఉంటుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారుజాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా...మహిళా, శిశు, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో...శనివారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్,డీసీపీ రాజ మహేంద్ర నాయక్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన తో కార్యక్రమాన్ని ప్రారంభించారు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ......బాలికల పట్ల వివక్షతను ప్రదర్శించకుండా వారి అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారుసమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల మొదలైన అంశాలపై క్రమం తప్పకుండ వివిధ శాఖల అధికారులను సమన్వయము చేస్తు.. ఉజ్వల అనే కార్యక్రమాన్ని చేపట్టామన్నారుఆడపిల్ల లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడడమే ఉజ్వల ప్రధాన లక్ష్యమన్నారు ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఉజ్వల కమిటీలను ఏర్పాటు చేసి బాలికలకు ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించడంతో పాటు, బాల్య వివాహాల నివారణ, పోక్సో చట్టంపై అవగాహన కల్పించడం జరుగుతుందని వివరించారు. అలాగే "బేటీ బచావో -- డిజిటల్ హటావో" అనే సందేశంతో బాలికలను డిజిటల్ దుర్వినియోగం నుండి రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ప్రతి బాలికకు విద్య అందించినప్పుడే నిజమైన సాధికారత సాధ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. సమాజం లో మహిళల కు, ఆడపిల్ల లకి గొప్ప హోదా ఉండాలన్నారుమన జిల్లా లో అమ్మాయిలకె చదువు మీద ఎక్కువ ఆసక్తి ఉందని... ఆకాశమే హద్దు గా వారి భవిష్యత్ సాగుతుం దన్నారుస మాజంలో మహిళలు, ఆడపిల్ల ల మీద ఉండే సాంఘిక వివక్ష ను అరికట్టి... వారిప్రాధాన్యత గురించి అవగాహన పెంచడానికి అందరూ కృషి చేయాలన్నారుడీసీ పీ రాజమేంద్ర నాయక్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలు, పిల్లల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మహిళలు, పిల్లలు ఎదుర్కొనే సమస్యలను ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేసే సౌకర్యాన్ని తెలంగాణ పోలీస్ శాఖ అందుబాటులోకి తీసుకువచ్చిందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జాతీయ బాలిక దినోత్సవం -- 2026 సందర్భంగా ఈ కార్యక్రమంలో భాగంగా "మిస్ జనగామ -- 2026" పేరుతో బాలికలకు మూడు దశలలో పోటీలను నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాలికలకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేయడం జరిగింది. కార్యక్రమం సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన లు ఆకట్టుకున్నాయిజిల్లాలో ఉజ్వల పథకం ప్రారంభం కావడం శుభప్రదమని, ఇది బాలికల సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని వక్తలు కొనియాడారు. డి సి ఓ కోదండరాములు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోని, జడ్పీ అదనపు సీఈఓ,జీసీడీఓ గౌసియా బేగం ,సీడబ్ల్యూసీ చైర్మన్ ఉప్పలయ్య , సభ్యులు శ్రీలత, కవిత , డిహెచ డబ్ల్యూ సిబ్బంది, చైల్డ్ లైన్ సిబ్బంది, బాలికలు మరియు ఇతర లైన్ డిపార్ట్మెంట్ అధికారులు పాల్గొన్నారు

# టీ20 వరల్డ్ కప్ నుంచి బంగ్లా బహిష్కరణ

భర్తీ చేసిన స్కాట్లాండ్!

వేదిక మార్పు పట్టుదలే బంగ్లాదేశ్ క్రికెట్ కొంపముంచిందా?

బంగ్లా క్రికెట్‌కు భారీ నష్టం

## ఐసీసీ సంచలన నిర్ణయం.. ఫిబ్రవరి టోర్నీలో అనూహ్య మార్పులు

**క్రికెట్ ప్రపంచంలో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. మరో కొద్ది రోజుల్లో భారత్ వేదికగా ప్రారంభం కానున్న టీ20 వరల్డ్ కప్ నుంచి బంగ్లాదేశ్ జట్టు నిష్క్రమించింది. భద్రతా కారణాల పేరుతో వేదిక మార్చాలని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) చేసిన డిమాండ్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తోసిపుచ్చడమే కాకుండా, టోర్నమెంట్ నుంచే ఆ జట్టును తప్పించడం ఇప్పుడు చర్చనీయాంశమైంది.**



**స్పోర్ట్స్ డెస్క్, జనవరి 25:**

వివాదం ఎక్కడ మొదలైంది? రాబోయే టీ20 ప్రపంచ కప్ మ్యాచ్‌లు ఇండియాలో జరగాల్సి ఉంది. అయితే, తమ దేశంలోని రాజకీయ పరిస్థితులు, ఇండియాలో తమ ఆటగాళ్లకు భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ.. తమ మ్యాచ్‌లను తటస్థ వేదికకు (న్యూట్రల్ వెన్యూ) మార్చాలని బీసీబీ పట్టుబట్టింది. చివరి నిమిషం వరకు చర్చలు జరిగినప్పటికీ, షెడ్యూల్‌లో మార్పులు చేయడం సాధ్యం కాదని ఐసీసీ స్పష్టం చేసింది. "షెడ్యూల్ ప్రకారమే ఇండియాలో ఆడాలి, లేదంటే తప్పుకోవాలి" అని ఐసీసీ అల్టిమేటం జారీ చేసినట్లు సమాచారం.

### ఐసీసీ కఠిన నిర్ణయం

నిబంధనల విషయంలో ఐసీసీ ఎప్పుడూ కఠినంగానే వ్యవహరిస్తుంది. ప్రపంచ కప్ వంటి మెగా టోర్నీ షెడ్యూల్‌ను ఒక జట్టు కోసం మార్చడం అనేది మిగతా జట్ల సన్నాహకాలను, లాజిస్టిక్స్‌ను దెబ్బతీస్తుంది. బంగ్లాదేశ్ తన నిర్ణయానికే కట్టుబడి ఉండటంతో, జనవరి 24న ఐసీసీ తుది నిర్ణయం తీసుకుంది. బంగ్లా స్థానంలో అర్హత పొందేందుకు తర్వాతి స్థానంలో ఉన్న స్కాట్లాండ్ జట్టుకు అవకాశం కల్పించింది.

### బంగ్లా క్రికెట్‌కు భారీ నష్టం

ఈ నిర్ణయం బంగ్లాదేశ్ క్రికెట్ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపనుంది. ప్రపంచ కప్ వంటి టోర్నీల్లో పాల్గొనడం ద్వారా బోర్డుకు వచ్చే ఆదాయం, స్పాన్సర్ల మద్దతు కోల్పోవాల్సి వస్తుంది. ఎంతో కష్టపడి అర్హత సాధించిన ఆటగాళ్లకు ఇది తీరని నిరాశ. రాజకీయ కారణాల వల్ల క్రీడాకారులు నష్టపోవడం విచారకరం. క్రికెట్‌ను అమితంగా ప్రేమించే బంగ్లా అభిమానులకు ఇది మింగుడుపడని విషయం.

### స్కాట్లాండ్‌కు సువర్ణావకాశం

మరోవైపు, స్కాట్లాండ్‌కు ఇది అదృష్టమనే చెప్పాలి. క్వాలిఫయర్స్ లో పోరాడినా, త్రుటిలో అవకాశం కోల్పోయిన ఆ జట్టుకు, ఇప్పుడు ప్రధాన రౌండ్‌లో తలపడే ఛాన్స్ దక్కింది. వారు ఈ అవకాశాన్ని ఎలా సద్వినియోగం చేసుకుంటారో చూడాలి. క్రీడలను, రాజకీయాలను వేరుగా చూడాలనే వాదన ఎప్పటి నుంచో ఉంది. అయితే, తాజా పరిణామాలు రెండు దేశాల సంబంధాలు క్రికెట్ మైదానంపై ఎలాంటి ప్రభావం చూపుతాయో మరోసారి రుజువు చేశాయి. బంగ్లా బోర్డు అతిజాగ్రత్త, లేదా మొండి వైఖరి.. చివరకు ఆ దేశాన్ని ప్రపంచ కప్‌కు దూరం చేసింది.

### పాకిస్తాన్ కూడా తప్పుకుంటుందా?

*బంగ్లాదేశ్‌ను టీ20 ప్రపంచ కప్ నుంచి తొలగించడంపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఐసీసీ నిర్ణయం పక్షపాతంతో కూడుకున్నదని పీసీబీ ఛైర్మన్ మోసిన్ నఖ్వీ విమర్శించారు. బంగ్లాకు జరిగిన అన్యాయానికి నిరసనగా టోర్నీని బహిష్కరించే ఆలోచనలో ఉన్నామని, దీనిపై తమ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తుది నిర్ణయం తీసుకుంటారని ఆయన వెల్లడించారు. ప్రభుత్వం ఆదేశిస్తే టోర్నీ నుంచి తప్పుకుంటామని, ఐసీసీ మరో జట్టును చూసుకోవచ్చని స్పష్టం చేశారు.*

# ఆర్సీబీ జైత్రయాత్రకు బ్రేక్

ఢిల్లీ క్యాపిటల్స్ పంజాతో బెంగళూరు విలవిల!

వడోదర వేదికగా స్మృతి సేనకు **తొలి ఓటమి**





- ఢిల్లీ బౌలర్ల ధాటికి 109 పరుగులకే కుప్పకూలిన ఆర్సీబీ
- వొల్వార్డ్, జెమిమా క్లాస్ ఇన్నింగ్స్‌తో ఢిల్లీ ఘనవిజయం

**స్పోర్ట్స్ డెస్క్ - జనవరి 25:**

మహిళల ప్రీమియర్ లీగ్ 2026లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) అప్రతిహత విజయాలకు ఢిల్లీ క్యాపిటల్స్ అడ్డుకట్ట వేసింది. ఈ సీజన్‌లో వరుసగా ఐదు విజయాలతో దూసుకుపోతున్న స్మృతి మంధాన సేనకు, శనివారం వడోదరలోని బీసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఊహించని షాక్ ఇచ్చింది. సమష్టి బౌలింగ్, సమయస్ఫూర్తితో కూడిన బ్యాటింగ్‌తో ఢిల్లీ 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించి పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి ఎగబాకింది. టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ జెమిమా రోడ్రిగ్స్ మరో ఆలోచన లేకుండా బౌలింగ్ ఎంచుకుంది. ఆరంభంలో ఆర్సీబీ ఇన్నింగ్స్ సాఫీగానే సాగింది. ఓపెనర్‌గా వచ్చిన కెప్టెన్ స్మృతి మంధాన (34 బంతుల్లో 38; 6 ఫోర్లు, 1 సిక్స్) మరోసారి తన క్లాస్ చూపించింది. ఒక దశలో ఆర్సీబీ 9 ఓవర్లలో 62/1తో పటిష్ట స్థితిలో కనిపించింది.

కానీ, ఇక్కడే మ్యాచ్ మలుపు తిరిగింది. మిన్ను మణి బౌలింగ్‌లో స్మృతి అవుట్ కావడంతో ఆర్సీబీ పతనం మొదలైంది. ఢిల్లీ బౌలర్లు నందని శర్మ (3/26), మారిజాన్ కాప్ (2/17), చిపెల్లే హెన్రీ (2/22) కట్టుదిట్టమైన బంతులతో ఆర్సీబీ మిడిలార్డర్‌ను హడలెత్తించారు. రిచా ఘోష్, జార్జియా వోల్ వంటి స్టార్ బ్యాటర్లు విఫలమవడంతో, చివరికి ఆర్సీబీ 20 ఓవర్లలో కేవలం 109 పరుగులకే ఆలౌట్ అయింది.

### ఢిల్లీ బ్యాటింగ్.. తడబడ్డా.. నిలబడ్డారు! 110

పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీకి ఆరంభంలోనే షాక్ తగిలింది. షఫాలీ వర్మ (16), లిజెల్లీ లీ (6) త్వరగానే పెవిలియన్ చేరడంతో 24 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో కెప్టెన్ జెమిమా రోడ్రిగ్స్ (24), లారా వొల్వార్డ్ (38 బంతుల్లో 42 నాటౌట్) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడారు. వీరిద్దరూ వికెట్ కాపాడుకుంటూనే స్కోరు బోర్డును ముందుకు నడిపించారు. చివర్లో మారిజాన్ కాప్ (19 నాటౌట్) మెరుపులు మెరిపించడంతో 15.4 ఓవర్లలోనే ఢిల్లీ లక్ష్యాన్ని ఛేదించింది.

### ఆర్సీబీ ఎక్కడ విఫలమైంది?

స్మృతి మంధాన ఇచ్చిన శుభారంభాన్ని మిగతా బ్యాటర్లు సద్వినియోగం చేసుకోలేకపోయారు. ముఖ్యంగా 62 పరుగుల నుంచి 109 పరుగులకే ఆలౌట్ అవడం ఆ జట్టు బ్యాటింగ్ లోపాలను బయటపెట్టింది. వికెట్లు పడుతున్నప్పుడు ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే వారు కరువయ్యారు. స్వల్ప లక్ష్యాన్ని కాపాడుకోవాలంటే ఆరంభంలోనే వికెట్లు తీయాలి. ఆర్సీబీ బౌలర్లు ప్రయత్నించినప్పటికీ, ఢిల్లీ బ్యాటర్ల సంయమనం ముందు వారి ఎత్తులు పారలేదు. ఈ విజయంతో ఢిల్లీ క్యాపిటల్స్ పాయింట్ల పట్టికలో తమ స్థానాన్ని (రెండో స్థానం) పదిలం చేసుకుంది. మరోవైపు, ఓటమి పాలైనప్పటికీ మెరుగైన రన్‌రేట్, పాయింట్లతో ఆర్సీబీ అగ్రస్థానంలోనే కొనసాగుతోంది. ఈ ఓటమి ఆర్సీబీకి ఒక హెచ్చరిక లాంటిదని, ప్లేఆఫ్స్ ముందు వారి లోపాలను సరిదిద్దుకునే అవకాశం ఇచ్చిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# కివీస్ పై భారత కుర్రాళ్ల పంజా

గ్రూప్ టాపర్‌గా సూపర్ సిక్స్‌లోకి!

అండర్-19 ప్రపంచ కప్‌లో అప్రతిహత విజయాలు

బ్యాటింగ్, బౌలింగ్‌లో సమిష్టి ప్రదర్శనతో న్యూజిలాండ్ పై ఘనవిజయం

## భారత స్పిన్నర్ల ధాటికి కివీస్ విలవిల

**స్పోర్ట్స్ డెస్క్ - జనవరి 25:**

దక్షిణాఫ్రికా గడ్డపై జరుగుతున్న ఐసీసీ అండర్-19 ప్రపంచ కప్‌లో భారత యువజట్టు (టీమ్ ఇండియా) జోరు కొనసాగుతోంది. శనివారం (జనవరి 24) జరిగిన కీలక లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ పై భారత్ సాధికారిక విజయం సాధించింది. ఈ విజయంతో గ్రూప్ దశలో అజేయంగా నిలిచిన భారత్, 'గ్రూప్ టాపర్' హోదాతో సూపర్ సిక్స్ దశకు అర్హత సాధించింది. సాంకేతిక లోపాలు లేకుండా సాగిన భారత ఆటతీరు, భవిష్యత్ తారల సత్తాను మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది.

టాస్ మొదలుకొని మ్యాచ్ ముగిసే వరకు భారత జట్టు స్పష్టమైన ప్రణాళికతో కనిపించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టుకు ఓపెనర్లు శుభారంభాన్ని అందించారు. క్లిష్టమైన పిచ్‌పై న్యూజిలాండ్ పేసర్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ స్కోరు బోర్డును నడిపించారు. మిడిల్ ఓవర్లలో వికెట్లు పడకుండా జాగ్రత్త పడుతూనే, వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలతో విరుచుకుపడ్డారు. ముఖ్యంగా డెత్ ఓవర్లలో (చివరి ఓవర్లలో) భారత బ్యాటర్లు సాధించిన పరుగులు మ్యాచ్ ఫలితాన్ని నిర్ణయించడంలో కీలకపాత్ర పోషించాయి. న్యూజిలాండ్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడానికి ప్రయత్నించినప్పటికీ, భారత బ్యాటింగ్ లోతు ముందు వారి వ్యూహాలు ఫలించలేదు. ఛేజింగ్‌లో న్యూజిలాండ్ జట్టు ఏ దశలోనూ భారత బౌలర్ల ఆధిపత్యాన్ని తట్టుకోలేకపోయింది. భారత పేసర్లు ఆరంభంలోనే వికెట్లు తీసి ఒత్తిడి పెంచగా, ఆ తర్వాత వచ్చిన స్పిన్నర్లు కివీస్ బ్యాటర్లను ఉక్కిరిబిక్కిరి చేశారు. బంతిని రెండు వైపులా టర్న్ చేస్తూ, వేగంలో వైవిధ్యం చూపిస్తూ భారత స్పిన్నర్లు వికెట్ల పండగ చేసుకున్నారు. క్రీజులో పాతుకుపోయేందుకు ప్రయత్నించిన కివీస్ బ్యాటర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా వెంటవెంటనే వికెట్లు తీసి, వారిని తక్కువ స్కోరుకే పరిమితం చేశారు.


**ఈ విజయంతో భారత అండర్-19 జట్టు టైటిల్ ఫేవరెట్‌గా తన స్థానాన్ని మరింత పదిలం చేసుకుంది. లీగ్ దశలో చూపించిన ఈ దూకుడును సూపర్ సిక్స్, నాకౌట్ దశల్లోనూ కొనసాగిస్తే.. మరోసారి అండర్-19 ప్రపంచ కప్ భారత్ వశం కావడం ఖాయంగా కనిపిస్తోంది. మరోవైపు, ఈ ఓటమితో న్యూజిలాండ్ తన లోపాలను సరిదిద్దుకోవాల్సిన అవసరం ఏర్పడింది.**





# ఏప్రిల్ 10న స్వయంభు విడుదల

యంగ్ అండ్ డైనమిక్ హీరో నిఖిల్ సిద్దార్థ్ కెరీర్‌లోనే మైలురాయిగా నిలిచిపోయే అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'స్వయంభూ' విడుదల తేదీని చింత్రబృందం ప్రకటించింది. ఈ సినిమా విడుదలపై మేకర్స్ క్లారిటీ ఇచ్చారు. ఈ ఏడాది వేసవి కానుకగా, ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఈ పాన్-ఇండియా చిత్రం గ్రాండ్‌గా విడుదల కానుంది. భారీ బడ్జెట్‌తో, అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కుతున్న ఈ పీరియడ్ యాక్షన్ డ్రామా కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమా కోసం నిఖిల్ పడుతున్న శ్రమ అంతా ఇంతా కాదు. ఒక యోధుడి పాత్రలో పరకాయ ప్రవేశం చేయడానికి ఆయన తన శరీరాకృతిని పూర్తిగా మార్చుకున్నారు. కేవలం ఫిజిక్ మాత్రమే కాకుండా, యుద్ధ సన్నివేశాల్లో సహజత్వం కోసం విదేశాల్లో కత్తిసాము, గుర్రపు స్వారీ ,విలువిద్యలో ప్రత్యేక శిక్షణ పొందారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో విజువల్స్ హాలీవుడ్ ప్రమాణాలకు ఏమాత్రం తగ్గకుండా ఉంటాయని సమాచారం. అయితే తాజాగా నిఖిల్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన గ్లింప్స్ ఫస్ట్ లుక్ పోస్టర్లు ఇప్పటికే సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేయగా, ఇప్పుడు రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ సినిమాపై అంచనాలను మరో మెట్టు ఎక్కించింది. ఈ చిత్రంలో నిఖిల్ సరసన సంయుక్త మీనన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. విజువల్ వండర్‌గా తెరకెక్కుతున్న ఈ చారిత్రక గాథ తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో విడుదల కానుంది.



# నెట్‌ఫ్లిక్స్‌లో 29న ఛాంపియన్ విడుదల

తెలంగాణ రాజకార్లను ఎదురొడ్డిన బైరాన్‌పల్లి గ్రామ కథ ఆధారంగా రోషన్ హీరోగా తెరకెక్కిన పీరియాడిక్ యాక్షన్ మూవీ 'ఛాంపియన్' గత డిసెంబరులో బాక్సాఫీసు ముందుకొచ్చి మంచి టాక్ తెచ్చుకుంది. ఇందులోని గిరగిరతో పాటు పాటలు హిట్ అయ్యాయి. ఇప్పుడు ఈ సినిమా ఓటీటీ విడుదల తేదీ తాజాగా ఖరారైంది. 'నెట్‌ఫ్లిక్స్' లో ఈనెల 29 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అనస్వర రాజన్, అవంతిక, రచ్చరవి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇందులోని 'గిర గిర గింగిరాగిరే' పాట విశేషంగా అలరించిన సంగతి తెలిసిందే. హైదరాబాద్ సంస్థానం నిజాం నిరంకుశ పాలనలో మగ్గిపోతున్న రోజులవి. రజాకార్ల దౌర్జన్యాలకు తెలంగాణ పల్లెలన్నీ చిగురుటాకులా వణికిపోతుండగా.. బైరాన్‌పల్లి లాంటి కొన్ని ఊళ్లు మాత్రం వీరోచితంగా పోరాడుతూ అందరిలో స్వాతంత్య కాంక్ష రగిలించే ప్రయత్నం చేస్తుంటాయి. అదే సమయంలో సికింద్రాబాద్‌కు చెందిన ఆంగ్లో ఇండియన్ కుర్రాడు మైఖేల్ సి.విలియమ్స్ (రోషన్) ఫుట్‌బాల్ ఆటగాడిగా ఎంతో పేరు తెచ్చుకుంటాడు. తన ప్రతిభతో ఇంగ్లాండ్ మాంచెస్టర్ ఫుట్‌బాల్ క్లబ్‌లో ఆడే అవకాశాన్ని అందుకుంటాడు. కానీ, మైఖేల్ తండ్రి నేపథ్యం కారణంగా తను లీగల్‌గా ఆ దేశానికి వెళ్లే దారులు మూసుకుపోతాయి. దీంతో ఎలాగైనా 20 రోజుల్లో ఇంగ్లాండ్‌కు వెళ్లేందుకు అక్రమ మార్గం ఎంచుకుంటాడు. కానీ, దారితప్పి బైరాన్‌పల్లికి వెళతాడు? దానికి కారణమేంటి? ఆ ఊరి వాళ్లతో కలిసి రజాకార్లపై పోరుకు ఎందుకు సిద్ధమయ్యాడు? బైరాన్‌పల్లి గ్రామస్థుల పోరాటాన్ని అణగదొక్కి.. వాళ్లను అంతం చేసేందుకు ఖాసిం రజ్వీ రంగంలోకి దింపిన బాబు దేశ్‌ముఖ్ (సంతోష్ ప్రతాప్)తో మైఖేల్‌కు ఉన్న విరోధం ఏంటి? అన్నది మిగతా కథ.

# రాజాసాబ్ నుంచి సహనా సహనా వీడియో సాంగ్ విడుదల

సంక్రాంతి కానుకగా బాక్సాఫీసు ముందుకొచ్చిన చిత్రాల్లో 'ది రాజాసాబ్' ఒకటి. ప్రభాస్ హీరోగా మారుతి తెరకెక్కించిన చిత్రమిది. ఇందులోని మెలొడీ 'సహనా సహనా' ఫుల్ వీడియో విడుదలైంది. ప్రభాస్-నిధి అగర్వాల్‌పై రూపొందించిన సాంగ్ ఇది. ఈ చిత్రం మంచి టాక్‌తో ప్రభాస్ మేనరిజాన్ని బాగా ఎలివేట్ చేసింది. మంచి టాక్ తెచ్చుకున్న ఈ సినమా థియేటర్లలో ఆడుతోంది.



# దురంధర్‌ను మించిన బోర్డర్-2




దేశభక్తి నేపథ్యంలో తెరకెక్కిన 'బోర్డర్ 2' తొలిరోజు కలెక్షన్ల విషయంలో 'ధురంధర్' ను బీట్ చేసింది. శుక్రవారం విడుదలైన 'బోర్డర్ 2' అదే రోజు.. భారతీయ బాక్సాఫీసు వద్ద రూ.32 కోట్లు (నెట్) కలెక్షన్లు రాబట్టింది. 'ధురంధర్' తొలిరోజు కలెక్షన్లు రూ.28.60 కోట్లు మాత్రమే. సన్నీ దేవోల్, వరుణ్ ధావన్, దిల్జీత్ దోసాంజ్, అహాన్ శెట్టి ప్రధాన పాత్రల్లో అనురాగ్ సింగ్ 'బోర్డర్ 2'ను తెరకెక్కించారు. 1971 ఇండో - పాక్ యుద్ధం నేపథ్యంలో జేపీ దత్తా తెరకెక్కించిన 'బోర్డర్'కు కొనసాగింపుగా వచ్చింది. ఈ సీక్వెల్ 28 ఏళ్ల తర్వాత వచ్చినా ప్రేక్షకాదరణ పొందడం విశేషం. ఈ సినిమా 1971 యుద్ధం తర్వాత జరిగిన మరో కీలకమైన సరిహద్దు పోరాటం చుట్టూ తిరుగుతుంది. మొదటి భాగంలో కేవలం ఆర్మీ పోరాటాన్ని మాత్రమే చూపిస్తే.. ఈసారి ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ సంయుక్తంగా చేసిన త్రిముఖ పోరును కళ్లకు కట్టినట్లు ఉద్వేగభరితంగా చూపించారు. వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' రికార్డులు సృష్టించిన సంగతి తెలిసిందే. గతేడాది డిసెంబరు 5న విడుదలైన ఈ సినిమా రూ.1300? కోట్లు రాబట్టింది. అత్యధిక వసూలు చేసిన బాలీవుడ్ చిత్రాల జాబితాలో రెండో స్థానం, అత్యధిక కలెక్షన్లు రాబట్టిన భారతీయ సినిమా లిస్ట్‌లో నాలుగులో స్థానంలో నిలిచింది. తొలిరోజు కలెక్షన్ల హవాని బట్టి ఈ 'ధురంధర్' రికార్డును 'బోర్డర్ 2' అధిగమించే అవకాశాలున్నాయని సినీ వర్గాల టాక్.

# హీరోలుగా ఎంట్రీ ఇస్తున్న డీఎస్పీ, లోకేశ్ కనగరాజ్



తెర వెనక సత్తా చాటిన ఎందరో సాంకేతిక నిపుణులు, డైరెక్టర్లు తెర పైనా సందడి చేశారు. నటులుగానూ తమదైన ముద్ర వేశారు. ఇదే దారిలో ఇప్పుడు మరికొందరు హీరోలుగా పరిచయం కానున్నారు. రెండు దశాబ్దాలకు పైగా తన సంగీతంతో శ్రోతలను ఉర్రూతలూగిస్తున్న దేవిశ్రీ ప్రసాద్ ఎల్లమ్మ' మూవీతో హీరోగా ఎంట్రీ ఇస్తున్నారు. డప్పు కళాకారుడిగా ఆయన నటిస్తున్నారు. 'బలగం' తర్వాత వేణు యెల్దండి తెరకెక్కిస్తున్న చిత్రమిది. తెలంగాణ గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రానికి సంగీతం కూడా డీఎస్పీనే అందిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాకి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో ప్రకటించనున్నారు. ఈ సినిమా చిత్రీకరణ దశలో ఉంది. 'ఖైదీ', 'విక్రమ్' తదితర చిత్రాలతో తెలుగు ప్రేక్షకులనూ థ్రిల్ చేసిన కోలీవుడ్ డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'డీసీ'. వామికా గబ్బీ హీరోయిన్. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహిస్తున్నారు. రొమాంటిక్- యాక్షన్ నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. 'టూరిస్ట్ ఫ్యామిలీ'తో ప్రేక్షకులతోపాటు సినీ ప్రముఖుల దృష్టిని ఆకర్షించిన మలయాళ దర్శకుడు అభిషన్ జీవింత్ ఈ మూవీలో ఓ పాత్ర పోషించిన



ఆయన.. 'విత్ లవ్' తో హీరోగా మారారు. ఈ రొమాంటిక్ డ్రామాలో అనస్వర రాజన్ హీరోయిన్. మదన్ దర్శకుడు. ఈ సినిమా ఫిబ్రవరి 6న తెలుగులోనూ విడుదల కానుంది. కొరియోగ్రాఫర్ యశ్ హీరోగా 'ఆకాశం దాటి వస్తావా' సినిమాని 'దిల్ రాజు ప్రొడక్షన్స్' సంస్థ గతంలో ప్రకటించింది. ఈ మేరకు ఓ వీడియోనూ విడుదల చేసింది. కానీ, తర్వాత ఎలాంటి అప్‌డేట్ లేదు. ఈ విభిన్న ప్రేమకథా చిత్రానికి శశికుమార్ దర్శకుడు. ÷ట్ మాస్టర్ పీటర్ హెయిన్ మూవీ కూడా అంతే. అనౌన్స్ చేసి చాలాకాలమైనా మరో అప్‌డేట్ లేదు. ఈ చిత్రానికి మా వెత్రి దర్శకుడు. టైటిల్ ఇంకా ఖరారు కాలేదు.

## బాలకృష్ణ, గోపీచంద్ కాంబినేషన్‌లో

# 111వ సినిమా

### మార్చి నుంచి రెగ్యులర్ షూటింగ్‌కు ప్లాన్

నందమూరి బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబినేషన్ అంటేనే బాక్సాఫీస్ వద్ద మాస్ జాతర మొదలైనట్లే. 'వీరసింహా రెడ్డి' వంటి భారీ హిట్ తర్వాత వీరిద్దరి కలయికలో రాబోతున్న 111వ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. అయితే, ఈ సినిమా షూటింగ్ విషయంలో గత కొద్దిరోజులుగా జరుగుతున్న సస్పెన్స్‌కు ఇప్పుడు తెరపడింది. మొదట ఈ ప్రాజెక్ట్‌ను సుమారు రూ.170 కోట్ల భారీ బ్జడెట్‌తో ఒక చారిత్రక నేపథ్యం ఉన్న కథతో చేయాలనుకున్నారు. కానీ, ప్రస్తుతం మారిన మార్కెట్ పరిస్థితులు, బ్జడెట్ లెక్కల దృష్ట్యా ఆ కథను పక్కన పెట్టి, బాలయ్య ఇమేజ్‌కు సరిపోయే పక్కా మాస్ యాక్షన్ కథను గోపీచంద్ సిద్ధం చేశారు. ఇటీవలే దర్శకుడు వినిపించిన ఈ కొత్త కథకు బాలయ్య గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, వచ్చే మార్చి నెల నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ 'వృద్ధి సినిమాస్' ధృవీకరించింది. తొలి షెడ్యూల్‌లోనే బాలయ్య మార్క్ అదిరిపోయే యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించేందుకు ఎ÷-లాన్ చేస్తున్నారు. ఇక హీరోయిన్ విషయానికి వస్తే, పాత కథ ప్రకారం నయనతారను ఎంపిక చేసినప్పటికీ, ఇప్పుడు కథ మారడంతో ఆమెనే కొనసాగిస్తారా లేక కొత్త హీరోయిన్‌ను తీసుకుంటారా అనే దానిపై సస్పెన్స్ నెలకొంది. ఏదేమైనా, బాలయ్య మార్క్ పవర్‌ఫుల్ డైలాగులు, గోపీచంద్ టేకింగ్ కలిసి మరోసారి బాక్సాఫీస్ వద్ద రికార్డులను తిరగరాయడం ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131